ఈనాడు హైదరాబాద్
HMDA
సోమవారం 21 ఆగస్టు 2017 24 పేజీలు

పరుగో పరుగు... ఆరోగ్యం మెరుగు



మరిన్ని చిత్రాలు www.eenadu.netలో చూడండి.

వేకువజాము... చీకట్లు ఇంకా తొలగలేదు... నెక్లెస్‌రోడ్ పీపుల్స్ ప్లాజా దగ్గర యువతీయువకులు, ఔత్సాహికుల కోలాహలం నెలకొంది. ఇక్కడి నుంచి గచ్చిబౌలి వరకూ సాగిన పరుగులో దాదాపు 20 వేలమంది ఉత్సాహంగా పాల్గొన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో బహుమతుల ప్రదానోత్సవం కేరింతల మధ్య సాగింది. పరుగులో పాల్గొన్న వారికి పలు చోట్ల స్వాగతం పలుకుతూ నగరవాసులు ప్రోత్సహించారు.

మరిన్ని చిత్రాలు, వివరాలు IIలో



అద్దెల దరువు!

బల్దియాలో 100కు పైగా సొంత 'కిరాయి' కార్లు





- అక్రమ సంపాదనకు అధికారుల అడ్డదారి
- అవినీతిలో కూరుకున్న రవాణా విభాగం

ఈనాడు, హైదరాబాద్

అక్రమ సంపాదనకు ఎన్ని మార్గాలున్నాయి, వాటన్నింటినీ ఎలా వినియోగించుకోవాలో బల్దియా యంత్రాంగానికే తెలుసు. ఈ విషయం ఎందుకు చెప్పాల్సి వస్తోందంటే.. గట్టిగా రూ.10 వేల విలువ చేయని కారుకు.. బల్దియా నెలకు రూ.34 వేల అద్దె చెల్లిస్తోంది. సొంత వాహనాలను అధికారికంగా వినియోగించుకుంటూ సర్కారు ఖజానాకూ గండి కొడుతున్నారు. బల్దియా ప్రారంభించిన డ్రైవర్-కం-ఓనర్ పథకాన్ని నిర్వీర్యం చేసి కార్మికుల పొట్టకొడుతున్నారు. రవాణా విభాగంలో జడలు విప్పుకొన్న ఈ కుంభకోణంలో సుమారు 50కిపైగా ట్రావెల్ ఏజెన్సీలకు, వంద మందికి పైగా ఉన్నతాధికారులకు నేరుగా సంబంధం ఉంది.

వింతగా లేదా... సర్కిల్-10బీలోని ఏఎంసీ కొంత కాలంగా తన మారుతి-800 వాహనాన్ని వినియోగిస్తున్నారు. పాతకాలానికి చెందిన ఈ వాహనాన్ని అంతర్జాతీయ మార్కెట్లో వేలం వేసినా గట్టిగా రూ.20 వేలు రావని సీనియర్ అధికారులు చెబుతున్నారు. బల్దియా ఆ వాహనానికి నెలకు రూ.34 వేల అద్దె చెల్లిస్తోందన్నారు.

అన్నీ ఉల్లంఘనలే.. నిబంధనల ప్రకారం ప్రభుత్వ కార్యాలయంలో అద్దె వాహనాన్ని ఏర్పాటు చేసుకోవాలంటే అవి తప్పనిసరిగా రవాణా విభాగానికి చెందినవే ఉండాలి. ఆయా వాహన యజమానులు లైఫ్‌ట్యాక్స్, రోడ్ ట్యాక్స్, బీమా తదితర విభాగాల్లో ప్రభుత్వానికి పెద్దఎత్తున డబ్బు చెల్లిస్తారు. దాంతోపాటు తరచూ బండికి 'ఫిట్‌నెస్ సర్టిఫికెట్' తెచ్చుకుంటారు. ఈ పత్రాలన్నీ సక్రమంగా ఉన్నప్పుడే ఆయా వాహనాలను అద్దెకు తీసుకుంటారు. వాటికి ప్రభుత్వం నెలకు రూ.34 వేల అద్దె చెల్లిస్తుంది. ఇవన్నీ పట్టించుకోకుండా పాత మారుతి-800 నుంచి ఇండియా, తదితర రకాల సొంత వాహనాలను అధికారులు కిరాయికి ఉంచుతున్నారు.

అడుగడుగునా అవినీతి... అధికారులు వాహనాలను నేరుగా అద్దెకు ఉంచుకోరు. మధ్యలో ఓ ప్రైవేటు ట్రావెల్ సంస్థ ఉంటుంది. ఏజెన్సీల

...మిగతా 4లో

330	బల్దియాలోని అద్దె వాహనాలు
రూ. 34,000	ఒక్కో వాహనానికి నెలవారీ అద్దె
రూ. 13.5 కోట్లు	ఏడాదికి అయ్యే వ్యయం
150 (దాదాపు)	అద్దె వాహనాల్లోని డ్రైవర్-కం-ఓనర్(డీసీఓ) కార్లు
150కు పైగా	ట్రావెల్స్ నంబర్లతో ఉండే బోగస్ కార్లు

మరిన్ని ఉదాహరణలు

- టీఎస్08ఈబీ0639 వాహనాన్ని ఓ కార్యనిర్వాహక ఇంజినీరు(ఈఈ) రెండేళ్ల పైగా ఉపయోగిస్తున్నారు. ఏపీ29బీపీ2346 నంబరు వాహనాన్ని అదనపు ఎస్టేట్ అధికారి, ఏపీ09సీఎస్4625 వాహనాన్ని కార్యనిర్వాహక ఇంజినీరు(ప్రాజెక్ట్స్ డివిజన్), ఏపీ28బీఆర్0309 వాహనాన్ని సర్కిల్-8కు చెందిన యూసీడీ అధికారి, ఏపీ28ఏఎస్3636 వాహనాన్ని శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ ఈఈ, ఏపీ13ఏఏ4399 వాహనాన్ని ప్రధాన కార్యాలయంలోని సహాయ పట్టణ ప్రణాళికాధికారి వినియోగిస్తున్నారు. ఇలా చెప్పుకొంటూ పోతే ఎగ్జామినర్ ఆఫ్ అక్కౌంట్స్ నుంచి విజిలెన్స్, ఇంజినీరింగ్, పారిశుద్ధ్యం, పట్టణ సామాజికాభివృద్ధి(యూసీడీ), ఇతరత్రా విభాగాల వరకు అన్ని కార్యాలయాల్లో ఈ దుస్థితి ఉంది. సుమారు వందకు పైగా అధికారులున్నట్లు తెలుస్తోంది.



ఓ మట్టి గణపయ్య... నీ జట్టు మేమయ్య!

నల్లగండ్లలోని అపర్ణా సరోవర్ గేటెడ్ కమ్యూనిటీలో ఆదివారం చిన్నారులతో కలిసి తల్లులు మట్టి గణేశులను రూపొందించారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. వివరాలు 3లో

సంరక్షణ సులువు



77 శాతం మొక్కలకు జియో ట్యాగింగ్

ఈనాడు, హైదరాబాద్: హరితహారంలో మొక్కలు నాటడంతోనే సరిపోదు. రెండేళ్ల పాటు క్రమంగా వాటికి నీళ్లు పోయాలి. ఆకతాయిలు, ఆక్రమణదారుల బారినపడి ధ్వంసం కాకుండా పరిరక్షించాలి. ఇవన్నీ జరగాలంటే.. అసలు ఎక్కడెక్కడ ఎన్నెన్ని మొక్కలు నాటారో అధికారులతోపాటు నగరవాసులకూ తెలియాలి. అందుకే బల్దియా... జియోట్యాగింగ్‌కు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోనే అత్యధిక మొక్కల్ని జియోట్యాగింగ్ పరిధిలోకి తీసుకొచ్చి ముమ్ముందుకు సాగుతోంది. హైదరాబాద్ మహా నగరపాలక సంస్థ(జీహెచ్ఎంసీ) నగరంలో పచ్చదనం పెంచేందుకు అనేక ప్రయత్నాలు చేస్తోంది. బల్దియా కార్యాలయాల్లో వర్టికల్

...మిగతా 4లో

రాచ 'కొండంత' దూరం..!

● వీఎం హోం దక్కినా తాత్కాలిక గూడు గగనమే

● కనీసం రెండేళ్లు గచ్చిబౌలిలోనే కమిషనరేట్

● కొనసాగనున్న యాదాద్రి జిల్లా వాసుల వెతలు



విక్టోరియా మెమోరియల్ హోం

ఈనాడు, హైదరాబాద్

విస్తీర్ణం పరంగా దేశంలోనే అతి పెద్ద పోలీస్ కమిషనరేట్. ఈ మాట వినగానే ఠక్కున స్ఫురించేది రాచకొండ. ఇప్పుడు ఆ పెద్ద విస్తీర్ణమే అవరోధంగా మారింది. అంత పెద్ద ప్రాంతం పరిధిలోని ప్రజలు కమిషనరేట్ కార్యాలయానికి రావాలంటే మరికొంత కాలం ఇబ్బందులు పడక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవలే ఈ కమిషనరేట్ శాశ్వత భవన సముదాయం కోసం ప్రభుత్వం స్థలం కేటాయించింది. అయితే నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరై.. భవనం పూర్తి కావాలంటే కనీసం మరో రెండేళ్లయినా వేచిచూడాల్సి వస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈనేపథ్యంలో ఏడాదిగా ఎదురుచూస్తున్న శాశ్వత గూడుకు మార్గం సుగమమైందన్న ఆనందం అట్టే లేకుండా పోయింది.

అధికారాల వికేంద్రీకరణ అనేది పరిపాలన సౌలభ్యం దృష్టిలో పెట్టుకొని జరగాల్సి ఉంటుంది. అలా కాదని వేరే అంశం అందులో ఇమిడి ఉంటే ఆ వికేంద్రీకరణ అబాసుపాలు కాక తప్పదు. వాస్తవానికి రాచకొండ కమిషనరేట్ ఆవిర్భావంలో అలాగే జరిగింది. రాష్ట్ర రాజధాని చుట్టూ విస్తరించి ఉన్న ఉమ్మడి సైబరాబాద్‌ను పరిపాలన సౌలభ్యం కోసం రెండుగా విభజిస్తూ గత ఏడాది ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు అప్పటివరకు ఉన్న సైబరాబాద్‌లో సగం ఠాణాలను విభజించి రాచకొండ కమిషనరేట్‌ను ఏర్పాటు చేశారు. అదే క్రమంలో కొత్తగా ఏర్పాటైన యాదాద్రి భువనగిరి జిల్లా మొత్తాన్ని ఉమ్మడి నల్గొండ నుంచి విడదీసి రాచకొండ కమిషనరేట్‌లోనే కలిపేశారు. దీంతో పోలీసింగ్ పరంగా ఆ జిల్లా పూర్తిగా రాచకొండ కమిషనరేట్ పరిధిలోకి వచ్చేసింది. ఈనేపథ్యంలో విభజన జరిగినప్పటికీ కొత్తగా కార్యాలయం ఏర్పాటయ్యే వరకు కమిషనరేట్ కార్యకలాపాలను గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయం కేంద్రంగానే నిర్వహించాల్సి వస్తోంది. ఈ పరిణామమే ఇప్పుడు యాదాద్రి భువనగిరి జిల్లావాసులకు తీవ్ర ఇబ్బందుల్ని తెచ్చిపెడుతోంది. కమిషనరేట్ భవన నిర్మాణం కోసం సరూర్‌నగర్ విక్టోరియా మెమోరియల్ హోం ఆవరణలోనే సుమారు 10 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేయడం కొంత ఊరటనిచ్చే అంశమే అయినా అక్కడ భవనం పూర్తి కావాలంటే అథమపక్షం రెండేళ్లయినా పట్టనుండటం గమనార్హం.

తాత్కాలిక భవనం లేనట్లే..!

రాచకొండ కమిషనరేట్ ఆవిర్భావం జరిగినప్పుడే తాత్కాలిక కార్యాలయం ఏర్పాటు అంశం తెర పైకి వచ్చింది. ఎల్‌బీనగర్, మల్కాజిగిరి జోన్లతోపాటు కొత్తగా విలీనమైన యాదాద్రి జోన్ ప్రజలకు అందుబాటులో ఉండేలా దాన్ని సత్వరమే ఏర్పాటు చేసేందుకు కసరత్తు జరిగింది. ఘట్‌కేసర్, ఈసీఐఎల్, నాచారం, ఉప్పల్, ఎల్‌బీనగర్, నాగోల్, సరూర్‌నగర్.. తదితర ప్రాంతాల్లో తాత్కాలిక కార్యాలయ భవనం కోసం అన్వేషించారు. అదే సమయంలో శాశ్వత భవనం కోసమూ స్థల సేకరణ గురించి ప్రత్యేక దృష్టి సారించారు. అయితే తాత్కాలిక కార్యాలయం కోసం ప్రైవేటు భవనాల యజమానులు అద్దె ఎక్కువగా చెబుతుండటంతో ఆదిలోనే అడ్డంకులు ఎదురయ్యాయి. అన్ని చోట్ల నెలకు కనీసం రూ.లక్షల్లోనే అద్దె చెల్లించాల్సి రావడంతో ఆ ప్రయత్నాలను దాదాపుగా విరమించి శాశ్వత భవనానికి స్థలం కోసం తీవ్రంగా శ్రమించారు. అది ఫలించి ఇటీవలే విక్టోరియా మెమోరియల్ హాల్‌లో పది ఎకరాల స్థలాన్ని కేటాయించారు. అయితే ఇప్పుడప్పుడే భవన నిర్మాణానికి రూ.కోట్లలో నిధులు మంజూరయ్యే అవకాశాలు లేవు. అవి మంజూరై భవనం పూర్తి కావాలంటే కనీసం రెండేళ్లు వేచ్చి చూడాల్సి ఉండటంతో అప్పటివరకు గచ్చిబౌలి నుంచే కమిషనరేట్ కార్యకలాపాలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే ఇప్పుడు యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజలకు ఇబ్బందిగా మారనుంది.

వ్యయ ప్రయాసలు భరించాల్సిందే..

ప్రస్తుతం రాచకొండ కమిషనరేట్‌లో మూడు జోన్లు ఉన్నాయి. ఎల్‌బీనగర్, యాదాద్రి భువనగిరి జోన్లలో 17 చొప్పున, మల్కాజిగిరి జోన్‌లో 9 ఠాణాలున్నాయి. ఎల్‌బీనగర్, మల్కాజిగిరి జోన్ల ప్రజలకైతే పెద్దగా ఇబ్బందులు లేవనే చెప్పొచ్చు. గతంలో ఉమ్మడి సైబరాబాద్‌లోనూ ఈ జోన్ల ప్రజలు గచ్చిబౌలిలోనే కమిషనరేట్‌కు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడూ అదే పరిస్థితి ఉండటంతో మార్పేమీ లేదు. కానీ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజలకు మాత్రం భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి.

● ప్రస్తుత యాదాద్రి భువనగిరి జిల్లా విభజనకు ముందు ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో ఉండేది. భువనగిరి ప్రజలు ఎస్పీ కార్యాలయానికి వెళ్లాలంటే నల్గొండకే వెళ్లేవారు. ఇప్పుడు యాదాద్రి జిల్లా అంతా రాచకొండ కమిషనరేట్‌లో విలీనం కావడంతో కమిషనర్‌ను కలిసేందుకు గచ్చిబౌలికి రావాల్సి వస్తోంది.

● యాదాద్రి జిల్లాలోని అడ్డగూడూరు వాసులు గతంలో నల్గొండ ఎస్పీ కార్యాలయానికి వెళ్లాలంటే 70 కి.మీ.లు మాత్రమే ప్రయాణించాల్సి వచ్చేది. ఇప్పుడు గచ్చిబౌలికి రావాలంటే 150 కి.మీ.లకు పైగానే ప్రయాణించాలి. అప్పుడు నల్గొండకైతే నేరుగా బస్సులో వెళ్లేవారు. ఇప్పుడు మాత్రం నాలుగైదు బస్సులు మారితే తప్ప కమిషనరేట్‌కు చేరుకోలేని దుస్థితి నెలకొంది. వ్యయప్రయాసలు ఇందుకు అదనం.

● ఆలేరు, రాజాపేట మండలాల ప్రజలు ఇప్పుడు గచ్చిబౌలికి రావాలంటే తప్పనిసరిగా ఘట్‌కేసర్ మీదుగానే రావాల్సి ఉంటుంది. ఆయా ప్రాంతాల నుంచి ఘట్‌కేసర్, ఉప్పల్ మీదుగా కమిషనరేట్‌కు చేరుకోవాలంటే కనీసం 100 కి.మీ.లు ప్రయాణించాల్సిందే. ఒకవేళ ట్రాఫిక్ ఇబ్బందుల నుంచి తప్పించుకోవాలంటే బాహ్యావలయ రహదారిపై 130 కి.మీ.లు ప్రయాణించాల్సి ఉంటుంది. గతంలో ఇక్కడి ప్రజలు నల్గొండకు వెళ్లాలనుకుంటే కాస్త దూరం ఎక్కువైనా ఇంత వ్యయప్రయాసలు అవసరం లేకుండేవి.

● ఇలాంటి ఉదంతాలు సగం ఠాణాల పరిధిలో నెలకొన్నాయి. కమిషనరేట్‌ను గచ్చిబౌలి నుంచి సరూర్‌నగర్ విక్టోరియా మెమోరియల్ హోంకు మార్చితే కొంతమేర ఉపశమనం ఉంటుంది. అలా చేస్తే ట్రాఫిక్ ఇబ్బందులు పెద్దగా లేకుండానే వీఎం హోంకు చేరుకోవచ్చు. కానీ వీఎం హోంలో కమిషనరేట్ కొలువు దీరేందుకు మరో రెండేళ్లు తప్పకపోవచ్చు. అంతవరకు అక్కడి ప్రజలు ఆ ఇబ్బందుల్ని భరించక తప్పదు.



ప్రపంచ దోమల నివారణ దినం సందర్భంగా ఆదివారం జీహెచ్‌ఎంసీ మలేరియా విభాగం సిబ్బంది పరిసరాల పరిశుభ్రతపై ప్రదర్శన నిర్వహించారు. ప్లకార్డులతో ప్రచారం చేసి అవగాహన కలిగించారు

భర్త తాగుడు మానకపోవడంతో తనువు చాలించిన భార్య

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఎన్నిసార్లు చెప్పినా భర్త పద్ధతి మార్చుకోవడం లేదని ఓ భార్య తనువు చాలించింది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్డు నం. 10సిలోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం లింగంగుట్ట గ్రామానికి చెందిన వారికంటి రామిరెడ్డి, గోవర్ధిని(25) ఉంటున్నారు. రామిరెడ్డి మేస్త్రీగా పనిచేస్తుండగా గోవర్ధిని చిన్నచిన్న పనులు చేసుకుంటూ పిల్లలను చూసుకొనే వారు. రామిరెడ్డి మద్యానికి అలవాటుపడటంతో మద్యం మానేయాలని గోవర్ధిని చాలాసార్లు కోరింది. ఇంటి గురించి, పిల్లల గురించి పట్టించుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటూ నిత్యం కోరేది. భార్య మాటను పెడచెవిన పెట్టిన రామిరెడ్డి శనివారం రాత్రి కూడా మద్యం తాగి ఇంటికి వచ్చారు. ఇద్దరి మధ్య గొడవ జరిగింది. కొద్ది సేపటి తరువాత లోపలి గదిలోకి వెళ్లిన ఆమె ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. భర్త గుర్తించే సమయానికే ఆమె ప్రాణం విడిచింది. తన తాగుడే తన భార్య ప్రాణాలు తీసిందని, తాగుడు మానుకోవాలని, కుటుంబాన్ని చూసుకోవాలంటూ చెప్పినా వినలేదని ఈ కారణంగానే మనస్తాపంతో చనిపోయిందంటూ రామిరెడ్డి పోలీసులకు వివరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సబ్‌రిజిస్ట్రార్ విధులకు ఆటంకం

న్యాయవాదికి రిమాండ్

దిల్‌సుఖ్‌నగర్, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఉన్న సబ్‌రిజిస్ట్రార్‌ను తీవ్ర పదజాలంతో దూషించడంతో పాటు విధులకు ఆటంకం కలిగించిన న్యాయవాదిని శనివారం రాత్రి రిమాండ్‌కు తరలించిన సంఘటన సరూర్‌నగర్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ లింగయ్య కథనం ప్రకారం... సరూర్‌నగర్ లింగోజిగూడకు చెందిన కరీముద్దీన్ తన ఇంటిని హరిరామకృష్ణశర్మ వద్ద తాకట్టుపెట్టి అప్పు తీసుకున్నాడు. కరీముద్దీన్ అప్పు తిరిగి చెల్లించకపోవడంతో హరిరామకృష్ణశర్మ కోర్టులో కేసు వేశాడు. కోర్టులో కేసు ఉండగానే కరీముద్దీన్ తన ఇంటిని బైడి సుభాష్(48) న్యాయవాదికి (గతంలో పోలీస్ కానిస్టేబుల్‌గా పని చేసిన సుభాష్ రాజీనామా చేసి న్యాయవాదిగా పనిచేస్తున్నారు.) విక్రయించడానికి ఒప్పందం చేసుకున్నారు. ఈనెల 17న సరూర్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ జరుగుతున్న సమాచారం తెలుసుకున్న హరిరామకృష్ణశర్మ కార్యాలయం వద్దకు చేరుకుని ఇంటిపై కోర్టులో కేసు నడుస్తున్న విషయం సబ్‌రిజిస్ట్రార్ వనజాకుమారికి ఫిర్యాదు చేశాడు. దీంతో రిజిస్ట్రేషన్ నిలిపివేసిన సబ్‌రిజిస్ట్రార్ పూర్తి సమాచారం సేకరించి రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తామంటూ తెలిపింది. ఆగ్రహంతో సుభాస్ సబ్‌రిజిస్ట్రార్ వనజాకుమారిని దూషిస్తూ విధులకు ఆటంకం కలిగించడంతో ఆమె ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సుభాస్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు విక్రమ్‌గౌడ్ హాజరు

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: కాల్పుల కేసులో నిందితుడైన మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ కుమారుడు విక్రమ్‌గౌడ్ బంజారాహిల్స్ ఠాణాకు ఆదివారం హాజరయ్యారు. నాంపల్లి కోర్టు విక్రమ్‌గౌడ్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన విషయం విధితమే. విక్రమ్‌గౌడ్ ఆదివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో హాజరై తన వ్యక్తిగత పాస్‌పోర్టును పోలీసులకు సమర్పించారు. విక్రమ్‌గౌడ్‌కు బెయిల్ మంజూరై వచ్చిన విషయం తెలుసుకుని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ఆయన అభిమానులు ఆదివారం అనేక మంది అతన్ని కలిశారు.

రెడ్డి హాస్టల్ నిర్మాణానికి శంకుస్థాపన 22న

● హాజరుకానున్న సీఎం కేసీఆర్

● బుద్వేల్‌లో సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు



మాట్లాడుతున్న హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి తదితరులు

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: రాజా బహద్దూర్ వెంకట్‌రాంరెడ్డి ఎడ్యుకేషనల్ క్యాంపస్ నిర్మాణానికి 22వ తేదీన చేయనున్న శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు పాల్గొననున్నారని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్ బుద్వేల్‌లో సర్వేనెంబర్ 324, 325, 333లలో ఎడ్యుకేషనల్ క్యాంపస్‌ను నిర్మించడానికి ప్రభుత్వం పది ఎకరాల స్థలం కేటాయించిన సంగతి తెలిసిందే. శంకుస్థాపన అనంతరం ఇక్కడ సీఎం బహిరంగ సభలో పాల్గొంటారని హోంమంత్రి తెలిపారు. 22వ తేదీ సాయంత్రం 4గంటలకు ఈ సభ ఉంటుందని చెప్పారు. ఆదివారం హోంమంత్రి నాయినితో పాటు రవాణాశాఖ మంత్రి పి.మహేందర్‌రెడ్డి, ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జితెందర్‌రెడ్డి, మల్లారెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మహేశ్వరం ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి సభ జరిగే స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శిలాఫలకం ఏర్పాటు చేయడానికి స్థలాన్ని నిర్ణయించారు. అనంతరం బహిరంగ సభ నిర్వహణకు సంబంధించి అధికారులకు, పోలీసులకు పలు సూచనలు చేశారు.



అవార్డులతో విజేతలు

రాష్ట్రస్థాయి నృత్య పోటీలు ప్రారంభం

నారాయణగూడ, న్యూస్‌టుడే: స్ఫూర్తి మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కళామందిరంలో తెలంగాణ రాష్ట్రస్థాయి నృత్య పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ విద్యావేత్త కొత్త నాగనాథం, జాతీయ వినియోగదారుల అధ్యక్షుడు మందడి కృష్ణారెడ్డి, నిర్వాహకులు నారాయణ మాస్టరు పోటీలను ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి కళాకారులు తరలివచ్చారు. సోలో, డబుల్స్, సబ్-జూనియర్, జూనియర్, సీనియర్, సూపర్ సీనియర్ విభాగాల్లో పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. నృత్యదర్శకుడు సూర్యతేజ, టీవీ నిర్మాత విక్రమాధిత్యారెడ్డి, మయూరి రాధా న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తారు.

కళాంజలిలో వానాకాలం డిజైనర్ కలెక్షన్స్





పాస్టల్ పింక్ షర్ట్, బూటీ ఎంబ్రాయిడరీతో ఎంతో స్టైల్‌గా ఉంది.

లెనిన్ షర్ట్ బీడ్ వర్క్, ఫ్లోరల్ ఎంబ్రాయిడరీతో ట్రెండీగా ఉంది. డెనిమ్స్ మీద ధరించేందుకు అనువుగా ఉంటుంది. లేత ఆకుపచ్చ, గులాబీ రంగుల్లో అందుబాటులో ఉన్నాయి.
వివరాలకు www.kalanjali.com, www.facebook.com/kalanjaliworld



అందుబాటు ధరల్లో మహిళలు, చిన్నారుల కోసం డిజైనర్ వస్త్రశ్రేణిని తీసుకొచ్చింది కళాంజలి. వానాకాలంలో ధరించేందుకు అనువైన నూతన వస్త్రాలను పరిచయం చేసింది. ప్రకృతి స్ఫూర్తితో పక్షులు, పువ్వుల ఎంబ్రాయిడరీ, ప్రింట్స్‌తో పెటిట్ బ్లాసమ్ కలెక్షన్స్ సరికొత్తగా ఉన్నాయి. – ఈనాడు, హైదరాబాద్



గణనాథులు వేంచేస్తున్నారహో!

నగరంలో గణపతుల సందడి మొదలైంది. ఆదివారం విద్యానగర్ - ఓయూ రోడ్డులో కనిపించిన చిత్రమిది. సెలవు రోజు కావడంతో నగర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో యువత వినాయక విగ్రహాలను తమ ప్రాంతాలకు తరలిస్తుండటం కనిపించింది.



పర్యావరణ పరిరక్షణే అభిమతంగా..!

● చిన్నారులతో గణపతుల తయారీ సందడి



శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: మేము సైతం.. అంటూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావడంతో పాటు భవిష్యత్‌తరాలకి దాని ప్రాధాన్యం తెలియాలన్న ప్రధాన సంకల్పంతో శేరిలింగంపల్లి నల్లగండ్ల అపర్ణాసరోవర్ వాసులు చేపట్టిన 'చిన్నారుల చేతుల మీదుగా మట్టి గణపతుల తయారీ' కార్యక్రమం పెద్ద ఎత్తున సాగింది. ఆదివారం దాదాపు 600మంది చిన్నారులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి ఒకేచోట ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అపర్ణాసరోవర్ గణేష్ ఉత్సవ సమితి, బాలగోకులం భారత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా సాగింది. ముందుగా తీసుకొచ్చిన సిద్ధంచేసిన మట్టిని చిన్నారులకి అందించారు. ప్రత్యేంగా 25మంది వలంటీర్లు బాలాబాలికలను మెలకువలను అందిస్తూ పర్యవేక్షించారు. తయారుచేసిన విగ్రహాలకి వారి ఇళ్లల్లోనే గణనాథుడిని నిమజ్జనం చేయాలని సూచనలు చేశారు. కుండీల్లో నిమజ్జనం చేసినప్పుడు వాటిలో మొక్కలు మొలవడానికి కమిటీ సభ్యులు మెంతులు అందించారు. 6వ సంవత్సరం దిగ్విజయంగా కార్యక్రమాన్ని ముగించామని చెప్పారు. కార్యక్రమంలో నిర్వాహకులు నాగరాజు, శ్రీలక్ష్మి, సాయిరాం, దీప, లక్ష్మణ్, అన్నపూర్ణ, శ్రీలత, ప్రతిమ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.





మరిన్ని చిత్రాలు www.eenadu.netలో చూడండి.



ఉండ్రాలయ్యా.. ఎన్నెన్ని రూపాలయ్యా

నారాయణగూడ, న్యూస్‌టుడే: చిట్టి చేతులు బంక మట్టితో వైవిధ్యమైన రూపాల్లో గణనాథుని విగ్రహాలను తీర్చిదిద్ది అబ్బురపరిచారు. పబ్లిక్ గార్డెన్స్‌లోని జవహర్ బాలభవన్‌లో వినాయక చవితిని పురస్కరించుకొని 'మట్టి వినాయకులను ప్రతిష్ఠించుకొని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం' అనే నినాదాంతో పిల్లలకు మట్టి గణపతుల తయారీ, నవరాత్రి ఉత్సవాల విశిష్టతను తెలియజేస్తూ ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలభవన్ సంచాలకులు రాధారెడ్డి, పీసీబీ ప్రాజెక్టు డైరెక్టర్ రాధిక కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వినాయకుడిని పూజించడానికి ఉపయోగించే పత్రి ప్రాముఖ్యతను కూడా పిల్లలకు వివరించారు.





తవ్వకుండానే... సరి చేస్తారు!


పాడైన గొట్టం

- పాడైన గొట్టాలకు మరమ్మతులు
- తొలిసారి సీఐపీపీ సాంకేతికత వినియోగం
- ఎన్టీఆర్ ఘాట్ దగ్గర పనులు ప్రారంభం
- 1.5 కి.మీ. దూరానికి రూ.21 కోట్లు


సీఐపీపీ సాంకేతికతతో పనులు

ఈనాడు, హైదరాబాద్

విదేశాలు, దిల్లీ లాంటి పెద్ద నగరాలకు పరిమితమైన క్యూర్డ్ ఇన్ ప్లేస్ పైపు(సీఐపీపీ) సాంకేతికత మనకూ వచ్చేసింది. తొలిసారి నగరంలో మురుగు నీటి గొట్టాల మరమ్మతులకు జలమండలి శ్రీకారం చుట్టింది. తొలుత ఖైరతాబాద్ ఫ్లైఓవర్ చివరన ఉన్న మురుగు నీటి శుద్ధి కేంద్రం(ఎస్టీపీ) నుంచి ఎన్టీఆర్ ఘాట్ మీదుగా జీహెచ్ఎంసీ కార్యాలయం వరకు దాదాపు 1.5 కిలోమీటర్ల మేర మరమ్మతులు చేపట్టనున్నారు. రహదారిపై చిన్నపాటి గొయ్యి లేకుండానే 1,800 ఎంఎం డయా సామర్థ్యం ఉన్న ఈ పైపులైన్‌కు కొత్త సాంకేతికతతో మరమ్మతులు చేపట్టనున్నారు. ఎంతో రద్దీగా ఉన్న ఈ ప్రాంతంలో ప్రయాణికులకు ఇదో పెద్ద ఊరటగా భావిస్తున్నారు. ఈ పనుల కోసం దాదాపు జలమండలి రూ.21 కోట్లు కేటాయిస్తోంది. వినాయక నిమజ్జనం జరిగే నాటికి కీలకమైన 200 మీటర్ల మేర పనులు చేస్తామని ప్రాజెక్టులు(డైరెక్టర్) శ్రీధర్‌బాబు తెలిపారు.



అక్కడే ఎందుకంటే...

గతేడాది ఇదే మార్గంలో సరిగ్గా ఎన్టీఆర్ ఘాట్‌కు సమీపంలో మురుగునీటి పైపులైన్‌కు ఓ పెద్ద గుంత పడింది. రహదారి అమాంతంగా భారీగా కుంగింది. ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ వేగంగా స్పందించడంతో వాహనాలు అందులో పడిపోకుండా కాపాడారు. అటు వైపు వాహనాలు రాకుండా అడ్డుకున్నారు. వినాయక నిమజ్జనం యాత్ర పూర్తి అయిన రెండు, మూడు రోజుల వ్యవధిలోనే ఈ సంఘటన జరిగింది. అప్పటికప్పుడు అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. వాస్తవానికి ఈ పైపులైన్ 1996 మధ్యలో ఏర్పాటు చేశారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ఇతర ప్రాంతాల నుంచి మురుగునీటి వ్యర్థాలను మోసుకొస్తూ జీహెచ్ఎంసీ దగ్గర కాల్వలో కలుపుతుంది. కొన్నాళ్లుగా ఈ పైపు నుంచి సామర్థ్యం కంటే ఎక్కువ భారీగా వరద వస్తోంది. పాత కాలం నాటి ఆర్‌సీసీ(రీఎన్‌ఫోర్స్‌డ్ సిమెంట్ కాంక్రీట్) పైపులైన్ కావడంతో దీనిపై ఎక్కువ ఒత్తిడి పెరుగుతోంది. అంతేకాక రసాయన వ్యర్థాలు కలుస్తుండటంతో వేగంగా దెబ్బతింది. గతేడాది సెప్టెంబరులో ఎన్టీఆర్ గార్డెన్ దగ్గర బద్దలై భారీగా గొయ్యి ఏర్పడింది. నిత్యం వీఐపీలు పర్యటించే రహదారి కావడంతోపాటు... అదీ సచివాలయం సమీపంలోనే కావడంతో అధికారులు ఉలిక్కి పడ్డారు. రాత్రి పగలూ కష్టపడి 48 గంటల వ్యవధిలో మరమ్మతులు చేశారు. అనంతరం ఈ పైపులైన్‌పై పూర్తి స్థాయిలో అధ్యయనం చేశారు. ఎక్కడికక్కడ పగుళ్లు ఉన్నట్లు ఈ అధ్యయనంలో గుర్తించారు. 1.5 కిలోమీటర్ల మేర పూర్తిగా పాతబడినట్లు తేలింది.

కొత్త టెక్నాలజీతో....

ఎస్టీపీ నుంచి వయా ఎన్టీఆర్ మార్గ్ నుంచి జీహెచ్ఎంసీ వరకు 1,800 ఎంఎం డయా పూర్తిగా మార్చాలంటే మొత్తం రోడ్డును జలమండలి స్వాధీనం చేసుకోవాలి. భారీగా తవ్వాలి. ఇది ఎంతో రద్దీ ఉన్న ప్రాంతం. అదీ సాగర్‌కు ఆనుకుని ఉండటం, వర్షాకాలంతోపాటు గణేష్ ఉత్సవాలు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఇప్పటికిప్పుడు తవ్వాలంటే దాదాపు అసాధ్యమే. ఒక వేళ మరమ్మతులు చేయక పోతే ఎప్పుడు కుంగిపోతుందో చెప్పలేని పరిస్థితి. దీంతో సీఐపీపీ సాంకేతికతో ఎలాంటి తవ్వకాలు లేకుండానే మరమ్మతులు చేయాలని నిర్ణయించారు.

- ఈ టెక్నాలజీ ఉపయోగించి దిల్లీలో కొన్ని ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టారు. అక్కడ విజయవంతం కావడంతో ఇక్కడ అమలు చేయాలని నిర్ణయించారు.
- ఫాలీ కార్బన్, ఫైబర్‌గ్లాస్ ఇతర మెటీరియల్స్ ఉపయోగించి ప్లాస్టిక్ లాంటి పైపులను ఇందులో ఉపయోగిస్తారు.
- తొలుత పాడైన పైపులోపలికి ఈ మెటీరియల్‌తో రూపొందించిన పైపులను లోనికి పంపుతారు. మధ్యమధ్యలో మ్యాన్‌హోళ్ల ద్వారా వీటిని లోనికి నెడతారు.
- వాటిలోకి బాగా వేడిగా ఉన్న నీటిని పంపుతారు. అవి బాగా వ్యాకోచించి మరమ్మతులకు గురైన అసలు పైపు గోడలకు ఈ మెటీరియల్ నిర్ణీత మందంలో అంటుకుంటుంది.
- కొంత సమయం తర్వాత మళ్లీ చల్లని నీటిని వదులుతారు. దీంతో మెటీరియల్ చల్లబడి గట్టిగా ఇనుము మాదిరి తయారవుతుంది. ప్రధాన పైపుల్లో లీకేజీల ఉన్నచోట మందం పెరుగుతుంది.
- ఈ సాంకేతికతతో మరమ్మతులు చేయడం వల్ల వచ్చే 50 ఏళ్ల వరకు ఎలాంటి ఇబ్బంది ఉండదని అధికారులు తెలిపారు. పైగా భారీగా రోడ్డు తవ్వకాలు, ట్రాఫిక్ మళ్లింపు లాంటి సమస్యలు తప్పుతాయి.





అదరహో రష్యన్ నృత్యం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్ హరిహరకళాభవన్‌లో ఆదివారం తెలంగాణ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో రష్యన్ నృత్యాలు అలరించాయి. రష్యా కళాకారులు జానపదం, శాస్త్రీయం, ఆధునిక నృత్యాలతో కట్టిపడేశారు. -రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే

ఇంటికి చేరిన సాయి సుజన్!

కుటుంబంలో వెల్లివిరిసిన ఆనందం


తల్లిదండ్రులు, చెల్లితో సాయిసుజన్

కాప్రా, న్యూస్‌టుడే: క్రికెట్‌పై మోజుతో ఇంటి నుంచి వెళ్లిన బాలుడు సాయిసుజన్ ఎట్టకేలకు రాచకొండ పోలీసుల చొరవతో ఇంటికి చేరాడు. కుమారుని రాకతో ఆ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. 71 రోజుల ఉత్కంఠకు తెరవీడింది. ఆదివారం ముంబయి నుంచి సాయిసుజన్‌ను హెచ్‌బీకాలనీలోని ఇంటికి పోలీసులు తీసుకువచ్చారు. సైబరాబాద్ సీపీ మహేష్ భగవత్, కుషాయిగూడ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ బి.శ్రీనివాస్‌కు విద్యార్థి తల్లిదండ్రులు బి.కృష్ణారావు, రేఖ కృతజ్ఞతలు తెలిపారు. కాప్రాలోని హెచ్‌బీకాలనీకి చెందిన బి.సాయిసుజన్ (15) తార్నాకలోని శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గత జూన్ 11న క్షవరం చేయించుకునేందుకని చెప్పి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. 12న తల్లిదండ్రులు కుషాయిగూడ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ముంబయిలో క్రికెట్ క్లబ్‌లో చేరి ఆట బాగా నేర్చుకోవాలన్న తపన సాయిసుజన్‌కు ఉండేది. పోలీసులు ముంబయి వెళ్లి దర్యాప్తు చేయగా ఓ మినరల్ వాటర్ సరఫరా సంస్థలో సుజన్ పనిచేస్తున్నట్లు గుర్తించి హైదరాబాద్ తీసుకువచ్చారు. రైల్లో ముంబయి వెళ్లిన అతనికి డబ్బులవసరమై పనిలో చేరినట్లు తెలిపాడు. పీటర్ క్రాస్ రోడ్డులోని సచిన్ ఇంటికి వెళ్లాడు. కారులో బయటకు వెళుతున్న సచిన్‌ను ఇంటి గేటు వద్ద కలిసి మాట్లాడగా ఎస్‌పీజే క్లబ్‌లో చేరి క్రికెట్ నేర్చుకోవాలని సూచించారు. పనిచేస్తూ క్రికెట్ నేర్చుకుని ఇంటికి వద్దామని అనుకున్నానని సుజన్ వివరించాడు. తన కుమారుడికి క్రికెట్ నేర్పిస్తామని సుజన్ తండ్రి తెలిపారు.

సంరక్షణ సులువు

(మొదటిపేజీ తరువాయి) గార్డెన్లను ఏర్పాటు చేయడంతోపాటు నగరంలోని ఖాళీ స్థలాలకు ప్రహరీలు నిర్మించి పార్కులను అభివృద్ధి చేసేందుకు నడుం బిగించింది. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, కార్యాలయాలు, పరిశ్రమలు, పరిశోధన సంస్థలు, అటవీ భూముల్లోనూ పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడుతోంది. కమిషనర్ డాక్టర్ బి.జనార్దన్‌రెడ్డి ఈ ఏడాది కోటి మొక్కలు నాటడమే లక్ష్యంగా కార్యాచరణ చేపట్టారు. ఇప్పటికే 40 శాతం మొక్కల్ని పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. వాటన్నింటినీ 766 ప్రాంతాల్లో నాటామని జీవ వైవిధ్య విభాగం అంటోంది. అందులో దాదాపు 35.40 లక్షల మొక్కలు నాటిన 652 ప్రాంతాలను జియోట్యాగింగ్ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన మొత్తం 77 శాతం మొక్కలు జియోట్యాగింగ్ పరిధిలోకి వచ్చినట్లయింది. దీనివల్ల జీహెచ్ఎంసీ అధికారులతోపాటు, నగరవాసులు స్పష్టంగా తెలుసుకోవచ్చు.

రాష్ట్రంలోనే ముందంజ

హరితహారంలో భాగంగా నాటే మొక్కల్ని జియోట్యాగింగ్ చేయాలనేది రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం. ఆ మేరకు అన్ని జిల్లాల్లోనూ పనులు కొనసాగుతున్నాయి. వాటిలో జీహెచ్ఎంసీ 77 శాతంతో ముందుండగా.. ఆదిలాబాద్ 72.55 శాతంతో రెండో స్థానం, జగిత్యాల 69.57 శాతంతో మూడో స్థానంలో, కొత్తగూడెం, నిజామబాద్, మేడ్చల్ జిల్లాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయని బల్దియా తెలిపింది. గ్రేటర్‌లో నాటే కోటి మొక్కల్లో 93 లక్షల మొక్కలను నగరవాసులకు కోరుకున్న ప్రాంతంలోనే ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. మిగిలిన 7లక్షల మొక్కలను రహదారుల పక్కన, మొక్కల పెంపకానికి ప్రత్యేకించిన ఖాళీ స్థలాలు, వర్టికల్ గార్డెన్‌లు, కార్యాలయాలు తదితర ప్రాంతాల్లో నాటనున్నట్లు అధికారులు వివరించారు.

అద్దెల దరువు!

(మొదటిపేజీ తరువాయి) వాహనాలు ఎక్కడెక్కడో బాడుగకు తిరుగుతుంటాయి. వారి వాహన నంబర్లతో మాత్రం బల్దియాలో ప్రతినెలా కోట్లాది రూపాయల మేర బిల్లు అవుతుంది. ఈ మొత్తం ఏజెన్సీ ఖాతాలో జమ కాగా.. అందులోంచి ఒక్కో బిల్లుకు రూ.4 వేలు మినహాయించి మిగిలిన రూ.30 వేలు అధికారి చేతికి వస్తుంది. అంటే అధికారులు ప్రభుత్వం ఇచ్చే జీతానికి అదనంగా.. అధికారాన్ని అడ్డుపెట్టుకుని.. సర్కారు ఖజానాకు గండికొట్టి అదనంగా మరో రూ.30 వేలు సంపాదిస్తున్నారని అర్థం. ఇక అధికారులు, ఏజెన్సీలను కలపడంలో రవాణా విభాగంలోని కంప్యూటర్ ఆపరేటర్‌ది ముఖ్య పాత్ర. ఉన్నతాధికారులు ఇతని ద్వారానే వ్యవహారాన్ని నడిపిస్తారు. అందుకు నెలనెలా ఇతను ఒక్కో బిల్లుపై రూ.500 లంచంగా తీసుకుంటున్నట్లు సమాచారం.

మంత్రి మాట పట్టించుకోవట్లేదు

జీహెచ్ఎంసీ 'డ్రైవర్ కం ఓనర్' పథకాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించింది. నిరుద్యోగ యువతకు, కార్మికులకు పరోక్షంగా మెరుగైన ఉపాధి కల్పించాలనేది దీని ఉద్దేశం. అందులో భాగంగా బల్దియా ఇప్పటి వరకు సుమారు 550 కార్లను నిరుద్యోగులకు ఇప్పించింది. అధికారులు వాటిని అద్దెకు ఉంచుకోవాలని, ఇదే విధానాన్ని అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ అమలు చేస్తామని పలుమార్లు రాష్ట్ర పురపాలక మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ యంత్రాంగం ఆ విషయాన్ని పట్టించుకోవట్లేదు. పైగా.. ఉన్న కొద్దిపాటి 'డ్రైవర్ కం ఓనర్' పథకంలోని సాగుతుండటం గమనార్హం. సక్రమంగా బిల్లు చెల్లించకుండా రవాణా విభాగంలోని కంప్యూటర్ ఆపరేటర్ వేధింపులకు పాల్పడున్నాడని డ్రైవర్లు ఫిర్యాదు చేస్తున్నారు. తమ ఇబ్బందులను ఉన్నతాధికారులు పట్టించుకోవట్లేదని వాపోతున్నారు.

సర్కారు పట్టించుకోవాలి

బల్దియాతోపాటు సెక్రటేరియట్, దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ, ఇతరత్రా ప్రభుత్వ శాఖలన్నింటిలోనూ ఇదే పద్ధతి నడుస్తోందని డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం పనిచేస్తుంటే.. పలువురు అధికారులు తమ ఉపాధికి ఎసరు పెడుతున్నారని వాపోతున్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలని కోరుతున్నారు.

అంతరిక్షంలో విలాసంగా నివసించొచ్చు



కుటుంబ సభ్యులతో లక్ష్మీ

● పరిశోధనలకు ఉవ్విళ్లూరుతున్న కేపీహెచ్‌బీ బాలుడు

● నాసాలో ప్రజంటేషన్‌కి ప్రపంచ శాస్త్రవేత్తల మన్ననలు

న్యూస్‌టుడే, కేపీహెచ్‌బీ కాలనీ

12 ఏళ్ల బాలుడు.. అంతరిక్షంలో విలాసంగా నివసించొచ్చు అని నమూనా ప్రాజెక్ట్‌కు రూపుదిద్దాడు. అమెరికాలోని అంతరిక్ష పరిశోధన కేంద్రం నాసాలో తనదైన శైలిలో దాని గురించి వర్ణించాడు. వివిధ దేశాలకు నుంచి ప్రాతినిధ్యం వహించే తలపండిన శాస్త్రవేత్తలతో తన ఆలోచనలను పంచుకున్నాడు. భవిష్యత్తులో వ్యోమగామిగా అంతరిక్షంలోకి అడుగు పెట్టాలని ఆశిస్తున్నాడు కేపీహెచ్‌బీ మలేసియన్ టౌన్‌షిప్‌కి చెందిన వెంకటేశ్వరరావు, రాధికల కుమారుడు లక్ష్మీ బొంతల.

2038 నాటికి నాసాలోకి అడుగు పెట్టడమే లక్ష్యం

జూబ్లీహిల్స్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న లక్ష్మీ 2038 నాటికి నాసా ప్రతినిధిగా అంతరిక్ష పరిశోధనలో భాగస్వామి అయ్యేందుకు ఇప్పటికే ప్రణాళికలు రూపొందించుకుంటున్నాడు. అంతరిక్ష పరిశోధనల్లో భాగంగా నాసా ప్రతి ఏటా అంతరిక్ష సదస్సు నిర్వహిస్తోంది. దీనికి ప్రపంచ వ్యాప్తంగా ఉత్తమ ప్రతిభ గల విద్యార్థులను ఆహ్వానిస్తోందన్న విషయం తెలుసుకున్న లక్ష్మీ ఆ దిశగా వడివడిగా అడుగులు వేశాడు. ఈ క్రమంలోనే లక్ష్మీ ధ్యాస అంతరిక్షం వైపు మళ్లింది. ఎప్పటినుంచో వైజ్ఞానిక శాస్త్రపరంగా తన మదిలో తొలుస్తున్న సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ఇదే సరైన సమయం అనుకున్నాడు. నాసా సదస్సుకి హాజరయ్యేందుకు నిర్వహించే పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపేందుకు సన్నద్ధం అయ్యాడు. దీనికోసం అంతరిక్ష పరిశోధనలకు సంబంధించి వివిధ రకాల పుస్తకాలు చదవడం ఆరంభించాడు. మరోవైపు అంతర్జాలంలో అందుబాటులో ఉండే సమాచారాన్ని సేకరించాడు. మొత్తానికి తను అనుకున్న విధంగా 2016, జులైలో నిర్వహించిన ఎంపిక పరీక్షలో 50 మార్కులకి గాను లక్ష్మీ 40 మార్కులు సాధించాడు. ఈ ఫలితాల స్ఫూర్తితో అంతరిక్ష పరిశోధనలపై తనకున్న ఆసక్తిని మరింతగా పెంపొందించుకుని నాసా సదస్సుకు హాజరవ్వాలనే తపనతో ఓ ప్రణాళిక ప్రకారం తన కార్యాచరణలో వేగం పెంచాడు. తను ముందునుంచి అనుకున్నట్లుగా 'భూమ్మీద నివసించినట్లే అంతరిక్షంలో కూడా ఇంకా విలాసవంతంగా నివసించొచ్చు' అనే పరిశోధనపై ప్రాజెక్ట్ చేయడం ప్రారంభించాడు.



అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం డైరెక్టర్‌తో లక్ష్మీ

ప్లేథోరా పేరుతో ప్రాజెక్ట్ మొదలు

అంతరిక్షంలో నివాస గృహాల ఏర్పాటే లక్ష్యంగా నాసా పనిచేయనుందని, ఇందులో భాగంగా ఆరు నుంచి పన్నెండో తరగతి విద్యార్థులను నాసా సదస్సులో తమ పరిశోధన వివరాలను వెల్లడించేందుకు ఆహ్వానించినట్లు లక్ష్మీ చెప్పాడు. ఇందుకోసం ప్లేథోరా పేరుతో ప్రాజెక్ట్ మొదలు పెట్టాడు. అంతరిక్షంలో 75వేల మంది నివసించేందుకు కావాల్సిన భవన నిర్మాణాలు, నీరు, ఆక్సిజన్ తదితర మౌలిక సదుపాయాలను ఏవిధంగా సమకూర్చాలో తెలియజేయడమే ఈ ప్రాజెక్ట్ ఉద్దేశం. జియోస్టేషన్ ఆర్బిట్ కేంద్రంగా అంతరిక్షంలో కూడా అన్ని రకాల సదుపాయాలతో నివసించే అవకాశముందని, భూమ్మీద కన్నా విలాసవంతమైన జీవితాన్ని గడపొచ్చుని.. తదితర కీలక అంశాలతో లక్ష్మీ తన సీనియర్ విద్యార్థి తిరుపతికి చెందిన పసుపులేటి ఆదిత్యతో కలిసి ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. కాలుష్య రహిత జీవనం గడపొచ్చని, వ్యవసాయం ద్వారా తినటానికి ఆహార పదార్థాలు సైతం దొరుకుతాయని, ప్రధానంగా భూమ్మీద కాలుష్య కారకమైన ప్లాస్టిక్ అనే మాటే ఉండదని లక్ష్మీ వివరించాడు. ప్రాజెక్ట్ రూపకల్పనలో భాగంగా లక్ష్మీ సందేహాలను ఉపాధ్యాయులు తీర్చారు. 2016, నవంబర్‌లో అమెరికాలోని సెయింట్ లూయిస్ నగరంలో ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రానికి(ఐఎస్‌డీసీ) లక్ష్మీ తను చేసిన ప్రాజెక్ట్‌ను పంపించాడు. 2017, మార్చిలో అది ఎంపికైనట్లు అవార్డు విన్నర్‌గా నాసా ధృవీకరించిన పత్రాలు అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం నుంచి పాఠశాలకి పంపించారు. గత జూన్ చివరి వారంలో లక్ష్మీ పది రోజుల పర్యటనలో అమెరికాలో జరిగిన 36వ నేషనల్ స్పేస్ డెవలప్‌మెంట్ కాన్ఫరెన్స్‌లో తన ప్లేథోరా ప్రాజెక్ట్ గురించి వివరించినట్లు లక్ష్మీ తెలిపాడు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శాస్త్రవేతల ముందు తన ఆలోచనలను వివరించడం మరువలేని తీపి గుర్తు అని లక్ష్మీ పేర్కొన్నాడు. ఈ సదస్సుకి దేశం మొత్తమ్మీద 22మంది విద్యార్థులు అర్హత సాధించగా నగరం నుంచి ఎంపికైన ఏకైక విద్యార్థి లక్ష్మీ. వివిధ దేశాల నుంచి 632 మంది అర్హత సాధించగా వీరిలో అతి చిన్న వయస్సు కలిగినది లక్ష్మీనే.

గొప్ప భారతీయుడిగా నిరూపించుకోవాలి: లక్ష్మీ

భారత దేశం ఏ రంగంలో అడుగిడినా ప్రపంచంలో కెల్లా మొదటి స్థానంలో ఉండాలన్నదే నేను ప్రతిసారి కోరుకుంటా. నాసా ప్రతినిధిగా అంతరిక్షంలోకి అడుగు పెట్టాలని లక్ష్యం. మరింత విజ్ఞానాన్ని పెంపొందించుకుని తిరిగి దేశానికి వచ్చి సేవలందించి గొప్ప భారతీయుడిగా నిరూపించుకోవాలన్నది నా తపన. మొట్టమొదటి ఇస్రో డైరెక్టర్ విక్రమ్ సారాభాయ్, మిసైల్ మ్యాన్ అబ్దుల్ కలాం నాకు స్ఫూర్తి. నా తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయులు రమణ, సీమా మేడమ్ శిక్షణ మరవలేనిది.



గౌతంరాజును సత్కరించిన అతిథులు

గౌతంరాజుకు రేలంగి పురస్కారం ప్రదానం

వివేక్‌నగర్ న్యూస్‌టుడే: రేలంగి వెంకట్రామయ్య తనదైన ప్రత్యేక సంభాషణ శైలి, హావభావ అభినయ విన్యాసాలతో హాస్యాన్ని అత్యద్భుతంగా పండించి ప్రేక్షకులపై చెరగని ముద్రవేసిన హాస్య నటచక్రవర్తి అని అతిథులు కొనియాడారు. ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ అవార్డు అందుకున్న తొలి హాస్యనటుడు కావడం రేలంగి ప్రత్యేకతను వెల్లడిస్తుందన్నారు. రేలంగి హాస్యపాత్రలే కాకుండా నాయక, ప్రతినాయక పాత్రలను కూడా ప్రతిభావంతంగా పోషించిన ప్రతిభాశాలి అని వారు కీర్తించారు. రేలంగి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభ సౌజన్యంతో ఆదివారం కళాసుబ్బారావు సమావేశ ప్రాంగణంలో నిర్వహించిన పద్మశ్రీ రేలంగి జయంతి సభలో వారు పాల్గొన్నారు. ప్రముఖ సినీనటుడు భూపతిరాజు గౌతంరాజుకి రేలంగి ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చేశారు. మొదట ప్రముఖ గాయకులు వైఎస్ రామకృష్ణ బృందం చిత్ర గీతాలు గానం చేశారు. వంశీ సంస్థల వ్యవస్థాపకులు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి సినీ దర్శకులు రేలంగి నర్సింహారావు, హేమంత్‌రేలంగి, కళాజనార్ధనమూర్తి, ఆర్‌ఎన్ నారాయణరావు, డా.సుధాదేవి తదితరులు పాల్గొన్నారు.



గచ్చిబౌలి స్టేడియంవద్ద ఆదివారం ఫిజికల్ లిటరసీ డేస్ కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగింది. యువతీయువకులు ఆటపాటలతో సందడి చేశారు. లోయల అకాడమీకి చెందిన విద్యార్థులు ఫ్లాష్‌మాబ్, ఫ్రీజ్‌మాబ్ నృత్యాలతో ఆకట్టుకొన్నారు. అనంతరం మారథాన్‌లో పాలు పంచుకొని స్టేడియానికి చేరుకొన్న రన్నర్లకు ఫిజికల్ లిటరసీ డేస్‌కు విచ్చేసిన వారంతా స్వాగతం పలికారు. – న్యూస్‌టుడే, గచ్చిబౌలి



షీ.. రయ్‌రయ్

● కొత్త వాహనాలతో సేవలు విస్తృతం

ఈనాడు, హైదరాబాద్: రాజధాని నగరంలో షీ బృందాలు వేగం పెంచనున్నాయి. మూడు కమిషనరేట్ల పరిధిలో ఆకతాయి వేధింపుల నుంచి భరోసానిస్తున్న ఈ బృందాలు రాబోయే రోజుల్లో మరింత చురుగ్గా పనిచేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ఈ మేరకు షీ బృందాల మహిళా సిబ్బందికి ద్విచక్రవాహనాలను సమకూర్చడంతో వీరి సేవలు విస్తృతం కానున్నాయి. హైదరాబాద్ కమిషనరేట్‌లో పనిచేస్తున్న సిబ్బందికి 70, సైబరాబాద్‌లో 50, రాచకొండలో 30 వాహనాల్ని గురువారం అందజేశారు. ఈ వాహనాలను వినియోగించడం ద్వారా షీ బృందాల సిబ్బంది నిఘా పెంచేందుకు ఆస్కారం ఏర్పడింది. సుమారు రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ బృందాల పనితీరు ఆశాజనకంగా ఉండటం.. మహిళలకు ఎదురవుతున్న వేధింపులను ఇవి సమర్థంగా ఎదుర్కొంటుండటం.. ప్రోత్సాహమందిస్తే ఫలితాలు మరింత బాగుండే అవకాశముండటంతో వాహనాలు సమకూర్చాలని ఉన్నతాధికారులు యోచించి ఈ నిర్ణయం తీసుకున్నారు.

నిఘా పెంచేందుకు దోహదం.. ప్రస్తుతం ఏవైనా ఫిర్యాదులు అందినా, లేకున్నా షీ బృందాలు పలు కూడళ్లలో, రద్దీ ప్రాంతాల్లో నిఘా ఉంచుతున్నాయి. ఇందుకోసం పలు ప్రాంతాలను హాట్‌స్పాట్‌లుగా ఎంపిక చేశారు. ఆయా ప్రాంతాల్లో రహస్య కెమెరాలకు పని కల్పిస్తూ ఆకతాయిలెవరైనా వేధింపులకు పాల్పడితే చిత్రీకరిస్తున్నాయి. అనంతరం వాటి ఆధారంగా వేధింపురాయుళ్లను పట్టుకెళ్లి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాయి. తాజాగా వాహనాలను సమకూర్చడంతో ఈ నిఘా మరింత విస్తృతం కానుంది. ప్రస్తుతం గుర్తించిన హాట్‌స్పాట్‌ల సంఖ్యను పెంచి అక్కడా నిఘా ఉంచేందుకు అవకాశం ఏర్పడనుంది. ఆయా ప్రాంతాలకు సులభంగా చేరుకుని ఆకతాయిల ఆట కట్టించే అవకాశాలు మెరుగయ్యాయి.



డీజే ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు

కాటేదాన్: ఉత్సవాలు, ఊరేగింపుల్లో ప్రజాశాంతికి భంగం కలిగించే డీజేల వాడకంపై నిషేధం ఉందని మైలార్‌దేవుపల్లి ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఠాణాలో మాట్లాడుతూ... కొందరు అమాయక ప్రజలను మోసం చేయడానికి ఈ నిషేధాన్ని హైకోర్టు సడలించిందని వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో తప్పుడు సమాచారాన్ని పెడుడుతున్నారని అన్నారు. తప్పుడు సమాచారాన్ని నమ్మి డీజేలు వాడితే చట్టం ప్రకారం కేసును నమోదు చేస్తామని హెచ్చరించారు.

నిమజ్జనం నాటికి పూర్తయ్యేనా?

- పత్తికుంటలో రూ.1.20 కోట్లతో కొలను పనులు
- వేలాది విగ్రహాల నిమజ్జనం ఇక్కడే
- పలు చెరువుల అభివృద్ధిలో జాప్యం

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే:

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో గణేష్ ఉత్సవాలకు సంబంధించిన పనులను అధికారులు వేగవంతం చేశారు. ప్రధానంగా మైలార్‌దేవ్‌పల్లిలోని పల్లెచెరువులో అత్యధికంగా విగ్రహాలను నిమజ్జనం చేస్తారు. తరువాత రాజేంద్రనగర్‌లోని పత్తికుంటలో నిర్వహిస్తారు. అయితే చెరువుల్లో కాకుండా ప్రత్యేక కొలనులో నిమజ్జనం చేయడానికి జీహెచ్ఎంసీ అధికారులు నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా గ్రేటర్ వ్యాప్తంగా నిమజ్జన కొలనులను ఏర్పాటు చేస్తున్నారు. రాజేంద్రనగర్‌లోని పత్తికుంటలో రూ.1.20 కోట్లతో నిమజ్జన కొలను ఏర్పాటు చేయడానికి అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే కొలనుకు సంబంధించి పనులు ప్రారంభించారు. నిమజ్జనం నాటికి కొలను అందుబాటులోకి తెస్తామని జీహెచ్ఎంసీ నీటిపారుదలశాఖ విభాగం అధికారులు తెలిపారు. చెరువు స్థలంలోనే ఒక పక్కన కొలను నిర్మిస్తున్నారు. కొలను చుట్టూ రహదారి నిర్మాణం చేపడుతున్నారు. ఐదు అడుగుల ఎత్తు ఉన్న విగ్రహాలు మాత్రమే వేయడానికి అవకాశం ఉందని ఓ అధికారి తెలిపారు. వాస్తవానికి సర్కిల్ పరిధిలో పత్తికుంటలో సుమారు 400 విగ్రహాలు నిమజ్జనం అవుతాయి. ఇందులో చిన్న విగ్రహాలు అధికంగా ఉంటాయి. పెద్ద విగ్రహాలను ఎక్కువ సంఖ్యలో పల్లెచెరువుకు తరలిస్తారు. అత్తాపూర్, హైదర్‌గూడ, ఉప్పర్‌పల్లి పరిసర కాలనీలలో ఏర్పాటు చేసే భారీ విగ్రహాలన్నీ హుస్సేన్‌సాగర్ వైపు వెళ్తాయి. ప్రస్తుతం పత్తికుంటలో నిర్మిస్తున్న కొలనులో సుమారు 3వేల విగ్రహాలు నిమజ్జనం చేయడానికి అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. పత్తికుంటలో ఇష్టానుసారంగా నిమజ్జనం చేయడం కారణంగా విగ్రహాలకు సంబంధించి వాడిన ఇనుమును సేకరించడానికి వెళ్లి ఇప్పటికే పలువురు మృత్యువాత పడ్డారు. ప్రత్యేకంగా కొలను నిర్మిండం ద్వారా అలాంటి ఇబ్బందులు ఉండవని అధికారులు అంటున్నారు. మరోవైపు నిమజ్జనం కూడా తేలికగా పూర్తవుతుందని అభిప్రాయపడుతున్నారు.

పల్లె చెరువు సంగతేంటి?

రాజేంద్రనగర్ సర్కిల్లో వాస్తవానికి పత్తికుంట కంటే మైలార్‌దేవ్‌పల్లిలోని పల్లెచెరువు ప్రధానమైంది. గణేష్ ఉత్సవాలలో భారీగా విగ్రహాలు ఇక్కడ నిమజ్జనం అవుతాయి. సుమారు వెయ్యికిపైగా విగ్రహాలు ఇక్కడ నిమజ్జనమయ్యే అవకాశం ఉంది. ఈ కారణంగా గతంలో దీన్ని మినీ ట్యాంక్‌బండ్‌గా నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అధికారులు సైతం పలు మార్లు సందర్శించి గతంలో ప్రతిపాదనలు రూపొందించారు. దీన్ని సర్వే నిర్వహించి అభివృద్ధి చేయాలని గతంలో అధికారులు నిర్ణయం తీసుకున్నారు. కానీ చెరువు అభివృద్ధిపై మాత్రం ప్రస్తుతం ఎవ్వరూ దృష్టి సారించడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే చెరువు స్థలం ఇప్పటికే కబ్జాకు గురవుతోంది. చెరువులోకి వెళ్లి మరీ పలువురు నిర్మాణాలు జరుపుతున్నారు. అధికారులు గతంలో వాటిని అడ్డుకున్నా... మళ్లీ నిర్మాణాలు పూర్తి చేశారు. మరోవైపు చెరువు స్థలం తమదంటూ, పట్టాలు ఉన్నాయంటూ కొందరు చెరువును పూడ్చడానికి గతంలో ప్రయత్నించారు. పురాతన చరిత్ర కలిగిన పల్లెచెరువులో గణేష్ నిమజ్జనం కొన్నేళ్లుగా సాగిస్తున్నారు. విగ్రహాల సంఖ్య ఏటా పెరుగుతోంది. అధికారులు ఈ చెరువు కబ్జాకు గురికాకుండా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. కానీ ఆ దిశగా దృష్టి సారించడంలేదు. పల్లెచెరువు సుందరీకరిస్తే గణేష్, బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి అవకాశం ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైన అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పత్తికుంట వద్ద కొనసాగుతున్న కొలను పనులు



నిమజ్జనంలోపు నిర్మాణం పూర్తి చేస్తాం: శేఖర్‌రెడ్డి, ఎస్ఈ, నీటిపారుదలశాఖ, జీహెచ్ఎంసీ

పత్తికుంటలో నిర్మిస్తున్న కొలను నిమజ్జనం నాటికి పూర్తిచేయడంతో పాటు చెరువు చుట్టూ కంచె వేయడానికి నిర్ణయం తీసుకున్నామని జీహెచ్ఎంసీ నీటిపారుదల శాఖ విభాగం ఎస్ఈ శేఖర్‌రెడ్డి తెలిపారు. పల్లె చెరువు అభివృద్ధిపైనా దృష్టి సారించామని అన్నారు. అయితే పల్లె చెరువుకు సంబంధించిన సర్వే పూర్తికాలేదని తెలిపారు. సర్వే పూర్తిచేసి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని వినతి



దత్తాత్రేయకు వినతి పత్రం అందజేస్తున్న నేతలు

కాటేదాన్: రాజేంద్రనగర్ సర్కిల్లో ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర మజ్దూర్ మోర్చ జాయింట్ కన్వీనర్ అడికె రాజు ఆదివారం కేంద్ర కార్మిక, ఉపాధిశాఖ మంత్రి బండారు దత్తాత్రేయకు వినతిపత్రం అందిజేశారు. ఈ.ఎస్.ఐ డిస్పెన్సరీ నిర్మాణాలకై హైదర్‌గూడలోని సర్వేనెంబరు 7, 12లో ప్రభుత్వ స్థలముందన్నారు. అధికారులను పరిశీలించి అక్కడ ఆసుపత్రి నిర్మాణాలకు అనుమతిచ్చేలా కృషి చేయాలని కోరారు. ఈ విషయంపై దృష్టి సారిస్తామని బండారు దత్తాత్రేయ హామీ ఇచ్చినట్లు అడికెరాజు అన్నారు. నేతలు రావుల భాస్కర్, హరినాథ్ ఉన్నారు.

కిక్‌బాక్సింగ్‌లో జిల్లాకు గుర్తింపు తెస్తాం



కార్యక్రమంలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

శంషాబాద్: కిక్‌బాక్సింగ్‌లో రంగారెడ్డి జిల్లాకు ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకురావాలన్నదే లక్ష్యమని టీఎస్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహిపాల్, జిల్లా అధ్యక్షులు నర్సింగరావు అన్నారు. శంషాబాద్ లో ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిపాల్ మాట్లాడుతూ.. కిక్ బాక్సింగ్‌లో జిల్లా నుంచి అనేక మంది రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని తెలిపారు. ఇటీవల తుర్కమెనిస్థాన్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీలో జిల్లా క్రీడాకారులు కాంస్య పతకం సాధించడం సంతోషమన్నారు. అనంతరం కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రవీణ్‌కుమార్, శశికాంత్, శ్రవణ్‌కుమార్, శివ, వినోద్, శివకుమార్ తదితరులను కమిటీలో ఉన్నారు.

యువతి, యువకుడు అదృశ్యం

శంషాబాద్ గ్రామీణ: పీజీ కౌన్సెలింగ్‌కు వెళ్తున్నట్లు చెప్పి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలో ఆదివారం చోటు చేసుకొంది. శంషాబాద్ ఠాణా ఎస్సై అహ్మద్‌పాషా తెలిపిన కథనం ప్రకారం.. నర్కుడకు చెందిన అంబికా భవానీ(21) డిగ్రీ చదివి ఇంటి వద్ద ఉంటుంది. శనివారం ఉదయం పీజీ కౌన్సెలింగ్ ఉందని తల్లి సరళకు చెప్పి నగరానికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చి తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. ఓ కాగితం పై 'నేను ఓ అబ్బాయి ని ప్రేమించాను, మీరు పట్టించుకోవడం లేదు.. మేమిద్దరం పెళ్లి చేసుకుంటాం' అని రాసి పెట్టింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. మరోవైపు అదే గ్రామానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి పి.నరేష్(22) శనివారం ఉదయం విధులకు వెళ్లి తిరిగి రాలేదు. ఒకే గ్రామానికి చెందిన యువతి, యువకుడు ఒకే రోజు అదృశ్యం కావడంతో స్థానికంగా కలకలం రేగింది. నరేష్ అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి నేడు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సర్కిల్ ఉపకమిషనర్ విజయలక్ష్మీ తెలిపారు. సర్కిల్ పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ కార్యక్రమంలో ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. సర్కిల్ కార్యాలయంలోని అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని అన్నారు. వచ్చిన ఫిర్యాదులను ఆయా విభాగాల అధికారులు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటారన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



మాట్లాడుతున్న కృష్ణకుమార్, వేదికపై ఇతర నేతలు

శంషాబాద్: ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పాడ కృష్ణకుమార్ అన్నారు. శంషాబాద్‌లో ఆదివారం ఎంఎంఆర్ గార్డెన్‌లో సంఘం ఆధ్వర్యంలో సమర శంఖారావం పేరుతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలంటూ ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కృష్ణకుమార్ మాట్లాడుతూ.. పక్క రాష్ట్రం పాత పెన్షన్ విధానాన్ని కొనసాగిస్తుంటే.. మన రాష్ట్రంలో కొత్త విధానాన్ని అమలు చేయడం ఏమిటన్నారు. అన్ని జిల్లాల్లో ఉద్యోగులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా పోరాటం చేస్తామన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఉద్యోగులకే అన్యాయం జరిగితే ఎవరికి చెప్పుకోవాలని అన్నారు. రానున్న రోజుల్లో ఉద్యోగులతో ట్యాంకు బండ్‌లో మానవహారం చేస్తామన్నారు. ఉద్యోగులు ఉద్యమాలు చేస్తుంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా లేదన్నారు. ఆయా సంఘాల నేతలు రవి, మునార్, అనిల్‌కుమార్, నాగేంద్ర స్వామి, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్‌లో వర్షానికి కూలిన ఇల్లు

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: వరుసగా కురుస్తున్న వర్షాలకు ఓ ఇల్లు కూలిన ఘటన మండల కేంద్రంలోని అహ్మద్‌నగర్ బస్తీలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. ఈ ఘటన రాత్రి జరిగితే భారీ ప్రాణనష్టం జరిగి ఉండేది. అబ్దుల్ సలీం పాత ఇనుప సామాన్ల వ్యాపారి. అతని తల్లిదండ్రులతోపాటు భార్య, నలుగురు పిల్లలు ఒకే ఇంట్లో ఉంటున్నారు. ఉదయం కుటుంబ సభ్యులు నిద్ర లేచాక ఇల్లు కొంచెంకొంచెంగా కూలుతుండడం గమనించి కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీశారు. నిమిషాల్లో ఇల్లు కూలిపోయింది. స్థానిక ఎంపిటీసీ నజ్ముద్దీన్ వెంటనే తహసీల్దార్ సురేష్‌కుమార్, సర్పంచి ఆర్.సిద్దేశ్వర్‌కు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలాన్ని సందర్శించారు. కూలిన ఇంటిని పరిశీలించారు. అబ్దుల్‌సలీంకు ప్రత్యామ్నాయ ఖర్చుల కోసం ప్రభుత్వం నుంచి రూ.3వేల నగదును తహసీల్దార్ అందజేశారు. పేదల కోసం నిర్మిస్తున్న రెండు పడక గదుల ఇళ్ల పథకంలో బాధితుడికి ఇల్లు కేటాయించేలా కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్నట్లు తహసీల్దార్ హామీ ఇచ్చారు.



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేష్‌కుమార్

మద్యం దుకాణం వద్ద వ్యక్తి మృతి

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: మద్యం దుకాణం వద్ద ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. రాజేంద్రనగర్ ఎస్సై శివప్రసాద్ తెలిపిన వివరాల మేరకు... బుద్వేల్‌కు చెందిన సత్యంగౌడ్(33) ఉప్పర్‌పల్లి ఆర్టీఏ కార్యాలయంలో ప్రైవేటు పార్కింగ్ దగ్గర పనిచేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఉప్పర్‌పల్లిలోని అమరావతి వైన్స్ దగ్గర మద్యం కొనుగోలు చేశాడు. దుకాణం వెనుక ఖాళీ స్థలంలో తాగుతూ కూర్చున్నాడు. చేతిలో ఉన్న సమోసాను తింటుండగా వెక్కిళ్లు వచ్చినట్లు ప్రత్యక్షసాక్షులు పోలీసులకు వివరించారు. అలాగే వెనుకకు వాలిపోయాడు. పక్కనున్న వారు వెళ్లి చూడగా మృతి చెందినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అన్ని కోణాల్లోను పరిశీలించారు. అక్కడ ఉన్న సీసీటీవీలను పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివప్రసాద్ తెలిపారు.

రాజేంద్రనగర్

గండిపేట గ్రామ ఐద్వా కమిటి ఎన్నిక

నార్సింగి: గండిపేట గ్రామంలో ఐద్వా కమిటీ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. గండిపేట గ్రామ ఐద్వా కమిటీ అధ్యక్షులురాలిగా రేణుక, గౌరవ అధ్యక్షులురాలిగా మయూరి, ఉపాధ్యక్షులుగా బి.జయమ్మ, కార్యదర్శిగా మగ్రత్, ఉప కార్యదర్శిగా అరుణ ఎన్నికయ్యారు. అదేవిధంగా కోశాధికారిగా కె.వినోద, ఉప కోశాధికారిగా సరిత ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో జిల్లా ఐద్వా అధ్యక్షురాలు అనురాధ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలను చిన్నచూపు చూస్తున్నాయని ఆరోపించారు.

ఘనంగా మల్లికార్జునస్వామి కల్యాణం



స్వామి కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

నార్సింగి: గండిపేట మండలం హైదర్షాకోట్ భాగ్యనగర్‌లోని శ్రీవిజయగణపతి దేవాలయంలో శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి దివ్య కళ్యాణోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. పరిసర కాలనీల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై పూజలు చేసి వేడుకలను తిలకించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయకమిటీ ఛైర్మన్ రాంనరేశ్, రాంచంద్రయ్యగుప్త, సురేందర్, సరోజ, చంద్రారెడ్డి, నారాయణరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఏళ్లుగా ఉంటున్నాం.. వసతులు కల్పించండి

వట్టినాగులపల్లి వివేకానందనగర్ వాసుల వినతి

మణికొండ, న్యూస్‌టుడే: వట్టినాగులపల్లి గ్రామ పరిధిలోని గౌలిదొడ్డి ఇందిరమ్మకాలనీలో మౌలిక వసతులు కల్పించాలని నివాసితులు కోరుతున్నారు. ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణ సమయంలో భూములు కోల్పోయిన గ్రామస్థులకు గౌలిదొడ్డి అగ్నిమాపక కార్యాలయం సమీపంలోని ప్రభుత్వ భూముల్లో నివేశన స్థలాలు కేటాయించారు. దశాబ్దం క్రితం కాలనీగా ఏర్పడిన ఈ ప్రాంతంలో విద్యుత్తు సౌకర్యం మినహా మిగిలిన వసతులు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. చాలామంది తమ స్థలాలను వేరే వారికి విక్రయించడంతో.. నింబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు చోటుచేసుకుంటున్నాయి. సరైన రోడ్లు, మురుగునీటి వ్యవస్థ లేకపోవడంతో కొందరు సొంతంగా నిధులు వ్యయం చేసి పైపులైన్ పనులు చేపట్టారు. ప్రభుత్వ విభాగాల అధికారులు ఈ కాలనీపై దృష్టి సారించి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతున్నారు. నివేశన స్థలాల కేటాయింపు వివరాలు గ్రామ పంచాయతీలో అందుబాటులో ఉండేలా రెవెన్యూ విభాగం చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఇందిరమ్మ కాలనీగా పేరొందిన ఈ పేదల సముదాయానికి ఇటీవల కొత్తగా వివేకానందనగర్ పేరిట నామకరణం చేసి స్వాగత తోరణం నిర్మించారు. గౌలిదొడ్డి వరకు ప్రస్తుతం వస్తున్న ఆర్టీసీ సర్వీసులను కాలనీవరకు పొడిగించాలని స్థానికులు కోరుతున్నారు. భూగర్భ మురుగునీటి వ్యవస్థ, రోడ్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



గౌలిదొడ్డి ఇందిరమ్మకాలనీలో స్వాగత తోరణానికి రంగులు



బస్తీల్లో పర్యటించిన మజ్లిస్ నేతలు



నూర్‌కాలనీలో అధికారులకు సమస్యలు వివరిస్తున్న మజ్లిస్ నేతలు

కాటేదాన్, న్యూస్‌టుడే: శాస్త్రిపురం డివిజన్ నూర్‌కాలనీలో సమస్యలతో సతమవుతున్నామని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి స్థానికులు ఆదివారం మొరపెట్టుకున్నారు. దీంతో వెంటనే ఆయన డివిజన్ మజ్లిస్ నేత గఫార్ బృందానికి బస్తీ సమస్యలు గుర్తించి తెలియజేయాలని ఆయన ఆదేశాలు జారీచేశారు. సాయంత్రం వర్షం కురుస్తున్నా.. బస్తీల్లో నేతలు పర్యటించారు. రాజేంద్రనగర్ సర్కిల్, విద్యుత్తు, జలమండలి తదితర శాఖల అధికారులను అప్పటికప్పుడే పిలిపించి స్థానికంగా ఉన్న మురుగు, విద్యుత్తు, నీటి సమస్యలను వివరించారు. పరిష్కారమయ్యేలా చొరవ తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



మట్టి గణేష్ ప్రతిమలు అందిస్తున్న సర్కిల్ డీసీ, కార్పొరేటర్

కాటేదాన్, న్యూస్‌టుడే: దోమల నివారణపై పూర్తిస్థాయి దృష్టి కేంద్రీకరిస్తున్నామని రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ విజయలక్ష్మి, మైలార్‌దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డిలు పేర్కొన్నారు. నేషనల్ మస్కిటో డే సందర్భంగా డివిజన్‌లోని వెంకటేశ్వరకాలనీలో ఆదివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు పాల్గొన్నారు. వర్షాకాలంలో దోమలను విజృంభిస్తాయని అన్నారు. వాటి నివారణఖు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు సైతం సహకరించాలన్నారు. ఓవర్ ట్యాంక్‌లు, కుళాయి గుంతలు, ప్లాస్టిక్ డ్రమ్ములు, సిమెంటు తొట్లు తదితర వాటిపై మూతలు పెట్టుకోవాలన్నారు. లేకుంటే దోమలు గుడ్లు పెట్టి వ్యాపిస్తాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎఇ గణేష్, రవి, శ్రీకాంత్, చిన్న, శ్రీను, వెంకటయ్య, ప్రతాప్, షానిటరీ సూపర్‌వైజర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

మట్టి గణపతులే మిన్న..

రానున్న వినాయక ఉత్సవాల్లో భాగంగా వెంకటేశ్వర కాలనీలో మట్టిగణపతుల పంపిణీని ఏర్పాటు చేశారు. రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ విజయలక్ష్మి, మైలార్‌దేవుపల్లి కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డిలు మహిళలకు మట్టి గణపతులను అందజేశారు. పర్యావరణాన్ని రక్షించాలంటే... మనమంతా మట్టిగణపతులను పూజించాలని పిలుపునిచ్చారు.

జ్ఞానవంతమైన సమాజమే స్వేరోస్ లక్ష్యం



తొండుపల్లిలో ఓ ఇంటిపై స్వేరోస్ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: జ్ఞానవంతమైన సమాజమే లక్ష్యంగా ఆవిర్భవించిన స్వేరోస్ సంస్థలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని స్వేరోస్ కమిటీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కె.విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం తొండుపల్లికి చెందిన ఆర్.జయసింహ ఇంటిపై ఎవరెస్టు శిఖరం మీద ఎగిరిన జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం స్వేరోస్ కమిటీ పాటుపడుతుందన్నారు. సమాజం మనకు ఏమిచ్చింది అనకుండా.. మనం సమాజానికి ఏమిస్తున్నాం అని ప్రశ్నించుకోవాలన్నారు. స్వేరోస్ కమిటీ కార్యాచరణను గ్రామ స్థాయిలో పటిష్ఠం చేసి విద్యకు దూరంగా ఉన్న బడుగులను చైతన్యపర్చడానికి నడుం బిగించాలని పేర్కొన్నారు. ఆర్.అర్జున్, హరీ, కిషన్, నితిన్, ప్రణీత్, చరణ్ పాల్గొన్నారు.

వైభవంగా వెండికొండ సిద్దేశ్వర జాతర



సిద్దులగుట్ట ఆలయం వద్ద భక్తుల రద్దీ

శంషాబాద్: వెండికొండ సిద్ధేశ్వర స్వామి జాతర ఆదివారం అట్టహసంగా ప్రారంభమైంది. ఎంతో చరిత్ర కలిగిన సిద్ధుల గుట్ట జాతర మూడు రోజుల పాటు జరుగుతుంది. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. శంషాబాద్ పరిధిలోని పలు గ్రామాల నుంచి అనేక మంది భక్తులు వచ్చారు. ఆలయ అధికారులు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉచిత అన్నదానం నిర్వహిస్తున్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నుంచి భక్తుల కోసం బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: వినియోగదారుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులందరు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ శంషాబాద్ శాఖ డిప్యూటీ మేనేజర్ శారద అన్నారు. సంపన్న వర్గాలకు పరిమితమైన బ్యాంకు సేవలను నేడు బడుగు, బలహీన వర్గాలకు విస్తరించే క్రమంలో ఎస్‌బీఐ సామాజిక అనుసంధానం(సోసైటీ కనెక్ట్) అన్న నినాదంతో శంషాబాద్ శాఖ అధికారులు ఆదివారం బ్యాంకు ముందు రహదారిపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ప్రజలకు ఎస్‌బీఐ అందిస్తున్న వివిధ సేవలపై వివరించారు. డిప్యూటీ మేనేజర్ శారద మాట్లాడుతూ.. వినియోగదారుల ఆర్థిక సామర్థ్యాన్ని పరిగణలోకి తీసుకొని రుణాలు ఇవ్వడానికి ఎస్‌బీఐ సిద్ధంగా ఉందన్నారు. ఉషారెడ్డి, లలితరత్న, మక్బూల్ బాషా, సధీర్ సింగ్ పాల్గొన్నారు.



వినియోగదారులకు పలు రుణాలపై అవగహన కల్పిస్తున్న అధికారులు

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

కాటేదాన్: మైలార్‌దేవుపల్లి డివిజన్ వాంబేకాలనీలో రాజీవ్‌గాంధీ జయంతిని శనివారం ఘనంగా జరుపుకొన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ మహిళ ఉపాధ్యక్షురాలు అబ్దేశి సదాలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే తెలంగాణలో అభివృద్ధి సాధ్యమన్నారు. పార్లమెంట్‌లో 33శాతం మహిళా రిజర్వేషన్లకై ఆమె పార్టీ నాయకులతో కలిసి ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. మహిళలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించినప్పుడే సంపూర్ణ అభివృద్ధి సాధ్యమన్నారు. రాహుల్‌గాంధీ నేతృత్వంలో అఖిల భారతీయ మహిళా కాంగ్రెస్ చేపట్టిన సంతకాల సేకరణకు తాము మద్దతు ప్రకటించి కొనసాగిస్తున్నామన్నారు. డివిజన్ పార్టీ అధ్యక్షులు రమేష్‌ముదిరాజ్, ఎ బ్లాక్ అధ్యక్షులు సానెం శ్రీనివాస్‌గౌడ్, ధనుంజయ్, అరుణ్‌కుమార్, శంకర్, బొల్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పార్టీ నేతలు

IN THE COURT OF THE HON'BLE Ist ADDL. SR. CIVIL JUDGE, RANGA REDDY DISTRICT AT: L.B.NAGAR
OS No. 198 2015

Between:
State Bank of India
Small & Medium Enterprises City Credit Centre (SMECC) **...Plaintiff**

AND

M/s. S.K. Food Products,
Prop. Smt. D.Radhika **...Defendants**
To

M/s. S.K. Food Products, Prop. Smt. D.Radhika, Plot No. 7-3-124/S, 116, Balaji Nagar, Near Ramcharan Oil Mills, Kattedan, R.R. District- 500 077.

R/o. H.No. 6-5-20/2, Babul Reddy Nagar, Shivarampally, Hyderabad.

R/o. H.No. 3-7-400/4A. Nalanda Nagar, Upparpally, Rejendernagar, Hyderabad-48. **...Defendants**

NOTICE

The abovenamed plaintiff filed suit for Money Recovery against you for Rs. 5,38,968/- before the Hon'ble Ist Addl. Sr. Civil Judge, at L.B.Nagar, Ranga Reddy District the Hon'ble Court has directed notice against you through paper publication and the matter is posted to 31-08-2017 and you have to appear before Ist Addl. Sr. Civil Judge, at L.B.Nagar at 10-30 AM or failing which the matter will be heard and set ex-parte.

By order of the Court

Sd/- **M.P. SANJAY**
Advocate for the Plaintiff
H.No.31, Tarbund Bazar,
Tarbund, Secunderabad- 500 009
Cell: 8885625424

EENADU CLASSIFIEDS

IRON & CEMENT, EYE CARE, COOKING,FLOORINGS, YOGA & MEDIDATION, BEAUTY PARLOUR, DIABETIES, HOUSE KEEPING, COURIERS, DRIVING SCHOOLS, TAILORING, CELL PHONES, SCHOOL UNIFORMS, GENERATORS, ELECTRICAL, FURNITURE FOR SALE, SWEETS

BUSINESS SERVICES

PACKERS & MOVERS

SAILAXMI PACKERS & Movers Local & All Over India DSNR: 9391072529, KP: 9394428929, Sec: 9032028929, Vij, Vzg, Chennai, Bng, Puna.

HOME NEEDS

PEST CONTROL

Golden Pest Control Termit TRMT- 2B/R 2,000/- 3B/R- 2,500/- 10Yrs Guarantee. Cockroach Bite TRMT. Ph: 9618034224/ 9676211260

తేజశ్రీ పెస్ట్‌కంట్రోల్ చెదలు, ఉడ్‌బోరర్ నివారణ 10 సం॥ గ్యారంటీ బొద్దింకలు జెల్ ట్రీట్‌మెంట్ ఏ వస్తువు కదపనక్కర్లేదు. Rs. 1000/- ★ దేవ ఈశ్వర్‌రెడ్డి ✆ 8106000303

REAL ESTATE

FLAT FOR SALE

S.Ft 3,300/- లకే VJA బందరురోడ్డు దగ్గరలో అడిగినవలో స్విమ్మింగ్‌పూల్, క్లబ్‌హౌస్, జిమ్, హోం థియేటర్, RO వాటర్, సోలార్ వాటర్ తదితర సౌకర్యాలతో 2 & 3 BHK లగ్జరీ అపార్ట్‌మెంట్లు గృహప్రవేశానికి సిద్ధంగా కలవు. సంప్ర: 73372 43565, 94401 20033.

JOBS

Wanted Marketing Executives for SV Dream Home Interior. Q:- 10+2, Any Deg. Receptionist (F) S:- 10K-25K. Shapurnagar. 9912688413/ 9100147404

AGRIBUSINESS

POULTRY

విన్నటిరోజు NECC, హైదరాబాద్ జోన్ 100 కోడిగుడ్ల ఫారంగేటు ధర రూ॥ 355/- చిల్లర ధర రూ॥ 4.15 ఫోన్: 23240329, కల్‌బర్డ్ ధర రూ॥ 62/-per KG, ఫర్‌బర్డ్ ఫోన్: 9000371404.

AUTOMOTIVE

VEHICLES FOR SALE

School Buses for Sale Eicher 2008 & Swaraz Mazda 2011 Contact ✆ 8074035550/ 9133505525.

VEHICLES WANTED

Wanted Delivery Vehicles for bigbasket.com from Balanagar, Kukatpally nearby areas, TATA ACE/ Mahindra Jeeto, 38,000/-PM. Min 2 yrs Contract. 9550516655

BUSINESS SERVICES

BUSINESS OFFER

Invest in our Business And Earn Upto 15% Benefit per Month. (Running 2nd Year) Contact: 9705671867

Call Centre Projects with Min. 10 Seaters Data Entry Projects with Min.. 5 Seater are Available for Out Sourcing ✆ 9652438681

ప్లాస్టిక్ హైడ్రాలిక్ & ఇంజక్షన్ మౌల్డింగ్ మెషిన్స్. నెలకు అత్యధిక ఆదాయం సంపాదించండి, ముడిసరుకు ఇచ్చి తయారైన సరుకు కొంటాం. R.J.ఎంటర్‌ప్రైజెస్, ✆ 77992 51970.

తక్కువ పెట్టుబడితో ఇంట్లో ఉండి ప్లాస్టిక్ వస్తువులు తయారయ్యే మెషిన్స్ కలవు. ముడిసరుకు ఇస్తాం, తయారయ్యేవి కొంటాం, అగ్రిమెంట్. సదీప్ ఎంటర్‌ప్రైజెస్. ✆ 98668 36940.

థర్మాకోల్ & పేపర్‌ప్లేట్స్, టీ కప్స్ అగరబత్తి తయారుచేయు మెషిన్లు & రా మెటీరియల్ కలవు. నెల 20 వేలు పైగా ఆదాయం, బై బ్యాక్ అగ్రిమెంట్. స్త్రై ఇంజనీరింగ్ కం., ఉప్పల్, HYD. ✆ 77308 39945.

ప్లాస్టిక్ పరిశ్రమ: మెషిన్లు అమ్మకం, ఇండిపెండెంట్ సరుకు తయారీ, ముడిసరుకు ఇచ్చి తయారైనది కొంటాం. నెలకు 20 వేలు పైగా ఆదాయం. 5 సం॥ బై బ్యాక్ అగ్రిమెంట్. బాలాజీ ఎం॥ప్రై., ✆ 95818 86892.

BUILDING & CONSTRUCTION

BOREWELLS

Srisujala Borewells: 6 1/2, 2000 Ft, 4 1/2, 600 Ft Drilling Flushing & Rebore. with Latest Technology ✆ 9948318666/ 9948329666

BEAUTY PERSONAL CARE

WANTED

Wanted Lady Beautician To work at Ameerpet contact: 8374300222

EDUCATION

కాలేజ్‌స్థాపన: 2001 డిగ్రీ, హోటల్ మేనేజ్‌మెంట్, బిఇడి (ఉస్మానియా), పి. హెచ్‌డి పుల్‌టైం/పార్ట్‌టైం ఆల్‌స్పెషలైజేషన్స్ ఆదివారం క్లాసెస్ అడ్మిషన్స్ కొరకు సంప్ర: 8501057777/ 040-27705677

HOME TUTIONS

20 Yrs Exp. Prof. Home Tutor is Ready to Teach Maths, Phy, Chem, for the Classes 9th, 10th, Inter. who needs Quality Tutor & Can Pay High Fees. 8712803319

PROFESSIONAL SERVICES

ASTROLOGY

బాబా బషీర్‌ఖాన్ వ్యాపారంలో నష్టం, ప్రేమ, వివాహం, విద్య, విదేశీయానం, సంతానం, ఆర్థికసమస్యలు మొ॥ సమస్యలకై వెంటనే సం॥ 9989689194.

REAL ESTATE

యూవత్ AP & తెలంగాణలో వ్యవసాయ భూములు, పారిశ్రామిక భూములు, ప్లాట్లు, ప్లాట్లు, ఇండ్లు, విల్లాలు లాంటి రియల్ ఎస్టేట్ ఆస్తులను కొనదలచిన లేదా అమ్మదలచిన వారు సంప్ర: 7013105272, వాట్సప్: 9247116436 (ఏజెంట్లు కూడా)

HOUSE FOR SALE

Madhura Nagar Colony Shamshabad 200 Sqyds, E/F House for Sale. G+2 + Pent House. ✆ 9848761404/ 9908907259

Indp 2BHK 19,90,000/- Nr. Hayathnagar Gated Community With All Development Loan LRS R.Laxareddy ✆ 9290009902/ 9441091936/ 9000139851

Indp & Duplex House HMDA Layout 25 L to 50L, 5 Km From Adibatla IT Companies Nr. ORR Loans B.Bheem Reddy ✆ 8885060742/ 9700974808

ఉప్పల్ మెయిన్‌రోడ్డులో ఇండిపెండెంట్ ఇళ్లు & అపార్ట్‌మెంట్ ప్లాట్లు అమ్మబడును పటేక్‌పేర్ & యాదగిరిగుట్ట యందు ఈస్ట్‌ఫేస్ ఓపెన్ ప్లాట్లు అమ్మబడును. 8179011437/ 8008927698.

LAND FOR SALE

ఉచితం. వినాయక చవితి సందర్భంగా AVM వెంచర్స్ వారి సువర్ణావకాశం. Hydలో న్యూ పార్మాసిటీకి దగ్గరలో 1- ఎకరం కేవలం 10 లక్షలు. ఇది తీసుకున్న వారికి 200 గ॥ ప్లాట్ హైదరాబాద్ లిమిట్స్ లో ఉచితంగా ఇవ్వబడును. Ph: 9493166709/ 8897495566

మహేశ్వరం రెవెన్యూ గ్రా॥ మం॥ జిల్లా రంగారెడ్డి 2 ఎకరములు అగ్రి కల్చర్ ల్యాండ్ అమ్మకానికి కలదు. ఫ్యాబ్‌సిటీకి 5 KM, ORR 6 KM, ఎయిర్‌పోర్ట్‌కి 10 KM. క్లియర్ టైటిల్ ✆ 8187047722.

PLOT FOR SALE

Bhashyam's HMDA Venture Gachibowli @ Kollur 1/2 km from ORR Beside Residential Houses 60% Bank Loan Spot Reg. Ph: 9948760109

Bachupully, Mallampet, ORR Junction (Exit-4) Road Facing Venture 150, 200 (Y) Plots with all Developments ✆ 9030033207, 9959991155.

APPA Junction @ Chevella New Venture for Low Cost Fruit Plantation, Malabar Trees, Model Farm House, Farm Plots Ph: 9849096826

Adibatla ITIR Zone HMDA Approved Plots close to TCS, CTS, ORR Junction. Fully developed. Spot Regd. Loans ✆ 9618882020.

Ibrahimpatnam 540 Acres @ 5999/- Mega Venture HMDA LPNo: 45/2017. Housing PROJECT - On Sagar Hi-Way Loans 70% ✆ 8886575999.

Moula -Ali Industrial Plot for Sale 1023 Sq.Yards North West Corner Plot Contact: 9849619544

North East Corner Plot for sale at Gandimaisamma V.Nr.to ORR & Highway 1783 Sqyds with 40ft road ready to construct apts 9866568999

Highway HMDA Plots for Rs. 4800/- per Sq.Yd. in the biggest highway attached township @ Kothuru. Company own plots for justified price. Ready for Regn. (Brokers Excuse) Ph: 9505333397, 9505061007.

Medchal Court Road, KLRNJR 3rd Phase Corner Plots HMDA Avl. Bank Loans Avl. Cemented Ads & All Developments Completed ✆ 9100440888

శ్రీశైలంహైవే, కడ్తాల్ ఫార్మాసిటీ, RRR కి అతి సమీపంలో వెంచర్ Rs: 6 వేల సులభ వాయిదాలతో 18 మలబార్ నీమ్ మొక్కలతో కూడిన ప్లాట్స్ కలవు. Ph: 8186867777

పాడినగర్ టౌన్‌లో 100 గజాలు 1,50,000/- EMI (నెలకు 5 వేలు మాత్రమే) ప్రీ రిజి॥ & సైట్ విజిట్ (ప్రీ. సంప్ర: Maathrubhoomi Housing Pvt Ltd. # 73/A, 2nd ఫ్లోర్, మాస్టర్ మైన్డ్ అపార్ట్‌మెంట్, శివబాగ్ కాలనీ, Nr.S.R.నగర్, P.S. అమీర్‌పేట్ ✆ 8185936389, 040-40246023.

Adibatla HMDA ప్లాట్లు సాగర్ హైవే TCS, వండర్‌లా పార్క్ BDL దగ్గరలో All Dev. రెడీ టు కన్‌స్ట్రక్షన్, స్పాట్ రిజి॥ లోన్స్ సౌకర్యం. ✆ 9866227875.

వనస్థలిపురం, సాహెబ్‌నగర్, మారుతి నగర్‌లో వెస్ట్ పేసింగ్, క్లియర్ టైటిల్ గల 267 చ.గ. ఓపెన్ ప్లాట్, గజం 18,000/- No Negotiations, స్పాట్ రిజిస్ట్రేషన్, నో బ్రోకర్స్, ఫోన్: 9133579333

వరంగల్ హైవే Nr. వివేరా హోటల్ HMDA అప్రూవ్డ్ లేఅవుట్ LP No. 76/ LO/ PLG/ HMDA 2016 80% లోన్ Avail Nr. MRO ఆఫీస్, రెడీమ్ కన్‌స్ట్రక్ట్ ఇన్ అపార్ట్‌మెంట్ ✆ 9133371999

ఆదిభట్ల @ బొంగ్లూరు HMDA గేటెడ్ కమ్యూనిటీ (LP.No)తో "Rich Meadows" ప్లాట్లు & ఇండ్లు అన్ని Devp.తో వేశ్వేశ్వరయ్య కాలేజ్ ఎదురుగా Ph: 7306432555, 8885937555

యాదగిరిగుట్ట వరంగల్ హైవే @ వంగపల్లి J.S.R గ్రూప్ సిటీలో హైవే పేసింగ్‌కు DTCP 8 వెంచర్‌లలో ప్లాట్లు కలవు. రిజి॥ + రిసార్ట్ మెంబర్‌షిప్ ఫ్రీ. సంప్ర: 9440697029

న్యూ HMDA సుల్తాన్పూర్ లేఅవుట్‌లో Plots ORR లోపల Exit-4, మెడికల్ డివైస్ పార్క్ దగ్గర 150, 200, 500 Sq.Yds 120' రోడ్‌కి కలవు. బ్యాంకులోన్‌తో ✆ 9247476767.

99000/- లకే 100 చ॥గ॥ల ఇంటి స్థలం శంషాబాద్‌కు అతి దగ్గరలో రంగారెడ్డి జిల్లానందు డైరెక్ట్ కంపెనీ ఆఫర్. స్పాట్ రిజి॥ సైట్ విజిట్ (ప్రీ. సంప్ర: 9949695027.

గండిమైసమ్మ 'X' రోడ్ HMDA అప్రూవ్డ్ Open Plots for Sale (With LPNo) 12KM from బాలానగర్ 'X' రోడ్, 5KM from Pragathinagar, Kukatpally. ✆ 9948458202

వెంచర్ క్లోజింగ్ ఆఫర్ శంషాబాద్ to పాడాద్ రోడ్‌లో గజం 999/- మాత్రమే (ప్రీ సైట్ విజిట్. M.S ఎస్టేట్ ✆ 9949190981.

రాజేంద్రనగర్‌కు శంషాబాద్‌కు దగ్గరలో రంగారెడ్డి జిల్లా నందు లోకల్ బస్సుల సౌకర్యంతో 100 గ॥ 1,50,000/- మాత్రమే. EMI, ప్రీ రిజి॥ & సైట్ విజిట్ (ప్రీ, సంప్ర: Maathrubhoomi Housing Pvt Ltd. # 73/A, 2nd ఫ్లోర్, మాస్టర్ మైన్డ్ అపార్ట్‌మెంట్, శివబాగ్ కాలనీ, Nr.S.R.నగర్ P.S, అమీర్‌పేట్ ✆ 9849873149, 040-23739969.

మునగనూరు బ్యాంక్‌కాలనీ 229 గ॥ W/F ప్లాట్ LRS Paid, Ready to Const. with Permission. Rs:10,000/- P.Sqy. ✆ 9912316110

ECIL, నాగారం 368 sq.yds N/F ప్లాట్ & యాదాద్రి, సురేంద్రపురి మెన్ రోడ్ 500 మీ॥ దూరంలో 5999/- per sq.yd ప్లాట్లు కలవు. ✆ 7207272888/ 9182261844

ఇల్లు కట్టుకోవడానికి 60 గ॥ 57 వేలకే. 5 వేలకే బుకింగ్ & మిగతా 4000x13 నె॥ Nr. ఎయిర్‌పోర్ట్ @ షాద్‌నగర్. Nr. సువర్ణభూమి. Ph: 9346887779.

ఇల్లు కట్టుకోవడానికి 150 గ॥ 1.49 వేలకే. షాద్‌నగర్, మొమిన్‌పేట్, వికారాబాద్, సంగారెడ్డి, యాదగిరిగుట్ట, చౌటుప్పల్ 7 వేలకే బుకింగ్ & 7000x20 నె॥ 9542671999.

యాదగిరిగుట్ట నుండి 3Km దూరంలో పెద్ద కంపెనీలకు తక్కువ ధరలో ప్లాట్లు అమ్మబడును. మంచి వాస్తు & ప్లాట్లు సైజులు కలవు. అన్ని సౌకర్యాలు కలవు. బ్యాంకులోను కలదు. 040-24126888.

గండిమైసమ్మ x రోడ్ వద్ద, ORR లోపల న్యూ HMDA అప్రూవ్డ్ వెంచర్‌లో ప్లాట్స్ LPNo:46/ HMDA/2017, చ॥గ॥ రూ॥ 13,700/-లకే బ్యాంక్ లోన్స్ & స్పాట్ రి॥ Ph: 9951381533.

రూ.850/-కే గజం యాదాద్రి కమాన్ నుండి 10 KM మోత్కూర్ రోడ్‌లో 50 ఎకరాల గే॥ కమ్యూనిటీ సైట్ విత్ మలబార్ ప్లాంటేషన్. ప్లాట్ సైజ్ 250/500 స్క్వా॥ ✆ 9949973873.

రూ.1250/-కే గజం, విజయవాడ హైవేకు 4 KM పోచంపల్లి రోడ్‌లో 50 ఎ॥ గే॥కు ఫామ్‌సైట్ 10 సం॥ టేకుచెట్లు, గెస్ట్‌హౌస్ & పార్క్స్ ప్లాట్ సైజ్ 500/2000 గ॥లు. ✆ 9949973873.

శంషాబాద్, శ్రీ శ్రీ శ్రీ చినజీయరుస్వామి ఆశ్రమానికి ఆనుకొని, ప్రపంచంలో అతి ఎత్తైన శ్రీరామానుజాచార్యుల 216 అడుగుల విగ్రహానికి అతి చేరువలో అత్యాధునిక సౌకర్యాలతో HMDA LP నంబరు కలిగిన మా Gated Townshipలో రిజిస్ట్రేషన్‌కు సిద్ధంగా ఉన్న HMDA Plots కేవలం Rs. 4500/- per SqYd. అమ్మకానికి కలవు. (Brokers Excuse) Cont. Ph: 9505095050, 9603754444.

శంషాబాద్ & అప్పాజంక్షన్ దగ్గరలో రంగారెడ్డి జిల్లా నందు లోకల్ బస్ సౌ॥ 100 చ॥గ॥ 9000తో మీ సొంతం, మిగిలినది EMIలో కట్టండి. ప్రీ సైట్ విజిట్, డైరెక్ట్ కంపెనీ RS ఎస్టేట్స్ ✆ 8790201417

భూమిపూజ: యాదాద్రి సురేంద్రపురి వెనుక గేటెడ్ కమ్యూనిటీలో వెంటనే ఇల్లు కట్టుకొనుటకు రెడీ॥ ఓపెన్ ప్లాట్స్ కలవు, క్లియర్‌టైటిల్ స్పాట్ రిజి॥ Ph: 7075945775

150 గ॥ 15 వేలకే రిజి॥ & మిగతా 6500x16 నె॥ వాయిదాలు Nr.ఎయిర్ పోర్ట్ @ షాద్‌నగర్ Nr.సువర్ణభూమి ఇండ్లు దగ్గరలో సంప్రదించండి. 9505289998.

కేవలం రూ: 1,25,000/- లకే 200 చ॥గ॥ల ఇంటి స్థలం హైదరాబాద్ (రామోజీ ఫిలింసిటీ) చౌటుప్పల్ సమీపంలో NH:9, క్లియర్ టైటిల్ స్పాట్ రిజి॥ ✆ 9948078062, 9848305444.

Hyd నుండి అమరావతికి వెళ్లే రూట్‌లో ప్రముఖ పుణ్యక్షేత్రం వద్ద చ॥గ॥ 3900/- మరియు 2800/- రూ॥లలో డైలీ కాటేజ్‌లకు అనువైన ప్లాట్లు కలవు. ✆ 9963114817

బెంగుళూరు హైవే పేసింగ్ వెంచర్ "నందిగామ" గజం కేవలం 1500/- మాత్రమే డైరెక్ట్ కంపెనీ ఆఫర్ (ప్రీ సైట్ విజిట్‌కు సంప్ర: 9949190981.

మీ సొంతింటి కలను నిజం చేసుకోండి. ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదాద్రి టెంపుల్‌కు దగ్గరలో అన్ని డెవలప్‌మెంట్స్‌తో 150 ఎక॥ మెగా వెంచర్‌లో & రిసార్ట్ డెవలప్‌మెంట్స్‌తో ప్లాట్లు కలవు. ✆ 9949077977

TO-LET

Srinagar Yellareddyguda, Laxminivas 3BHK, Flat No:201, 2nd Floor for Rent with all Fecilities only for Family. ✆ 9705242254

JOBS

Part/Full Time Home Based On/Offline, DataEntry, Ad-Posting, Copy-Paste, SMS Send, Form Filling, Page Type Convert to Words, No Target, Earn:25-40K. 6Y.Old Govt.Reg. Co. AN ISO:9001-2015 Certified Co, Daily/Weekly Pay. Free Trng.& 9502750123/ 7095750123/ 040-42000192/ 94.

Wanted @ MNC 77 Vacances Hyd Branch Qly +2, ITI Degree, Diploma Etc. Earn 9,000/- - 16,000/- Free Hostel, Age: 18-28 ✆ 040-65140422/ 9246222604.

Jewellery Showroom in Jubilehills require Sr. Salesman, Floor Manager, Accountant, Asst. Accountant, Data Entry Operators, All Male only. Contact: 9441436385, 9000703311.

Wanted Telecallers for Home/ Mortgage Loans, Pickup Boys, Sales Exe Receptionist, Team Leaders. Salescum- Collection Exe. ✆ 7396062852/ 040-27504131

Wanted Marketing Executives, Telecallers and H.R.Managers at Habsiguda Salary + Commission, Can Contact: 7095465666.

Female Telecallers (No's 25) Freshers/ Exp for Personal Loans Fixed Sal+ Inc, Off @ Chaitanyapuri, Dilsukhnagar ✆ 9866116401

Oasis Company In Hyd Permanent Job Office Staff/ Managers M/F A: 18-28 Q: 10- PG Income: 12,500 to 35,500 Hostel Free ✆ 7207774778

Urg, Req.. Female HR, Incharge & Telecallers, Male Mrktg Exe's, Officers & Managers for Real Comp @ Madhapur. Q: Inter/Deg/ MBA Fixed Salary+inc+ Bonanzas ✆ 8121333347 / 9652328899

Wanted exp Sales Man/ Sales Girls/ Helpers/ Office Boy/ Drivers, Accountant Receptionist & civil supervisor. Cont: Ganesh & Co. Jewellers. Ph: 040-23200799/ 23202861.

Wanted Accountant Exp. 3-5yrs & Marketing Executives Min 1yr Exp. @ Dollfin Developpers, Madeenaguda 9440036599/ 040-42223246

Urg Req BDM-2, Prod Demons-2, ITI Technician-2 Receptionist-1 For Top Notch Co. Att Sal Pac+ Inc. Good Comm Skills Cont: 9849999901.

Wanted experienced D.Pharmacy, Pharma Asistants for Fast Growing retail Pharmacy Chain at Manikonda area. Accommodation Free 8886726777, 7382314566.

Dynamic, Smart Candidates to Promote 2000 Acres Townships Project Assured Income M/F Welcome Cont: Neha 9052516667

Wanted Experienced Sales/ Collection Executives for DDF Partner of Bajaj Finance for 2 Wheeler in & around Nagaram. Contact: 7993769101/ 7207297354. Mail: hr@padmasai.in

Wanted Sr. MKTG Exe's, MBA Freshers, Coraldraw Designers, ACP Signmakers for Reddys Digital PVT.LTD., Nacharam. ✆ 8008002265.

Wanted ITI Electricians having 1-2 yrs exp in Industrial Electrification permit interview at rrpl on 19, 20, 21 jdm hyd. 9849216151.

Sri Srinivasa Jewellers Wanted Sales Mens Sales Girls, Accountant Gold Smith Attractive Salary ✆ 040-42306669/ 9030096986

Wanted Marketing Executives/ Office Assistant M/F for Ragala Resorts Office at Habsiguda. Ph: 9959359333/ 9959375444

Sony Services Req. Data Entry Operators & Demo Installation & Audio & Video (B.Tech) Engineers at KPHB. ✆ 9246587779/ 9248027726.

Wanted Counter Executives for Promition of One of the Top Mobile Network Connection in and Around Twin Cities in Airtel Outlets Requirements: Qualification - 12th Pass Good Communication Skills 4G Handset Must Salary - Rs. 10,000 Take Home + PF & ESI Incentive (Rs. 1,000 to Rs: 3000, Purely Target Basis Achievement) Contact: 27907222/ 27907333/ 9502190737.

Wanted field officers M/F Telicaller's fixed salary + Incentives + Bus Pass Cont: 9951220789.

Wanted Wheel Alignment Technicians & Helpers. Work at Shapurnagar, Jeedimetla, Contact: 9885535566/ 8087376107

కన్సల్టెన్సీ కాదు... ఇన్‌ఫ్రా కంపెనీ. Age: 30సం॥లు పైన వారు M/F మార్కెటింగ్ మేనేజర్స్, T.L., రిట్రైర్ ఎంప్లాయిస్ కావలెను. జీతం: 25K-50K. నోట్: సాఫ్ట్‌వేర్, టీచర్స్, LIC, మెడికల్, జాబ్ హోల్డర్స్, వర్కింగ్ ఓన్లీ శని & ఆది టైమ్స్ 10-5PM పార్ట్/ ఫుల్‌టైం ✆ 9100027203/8639431009.

లేడీస్ టికెల్ డిజైన్, ప్యాకింగ్‌చేసి రోజు రూ॥1100/- సంపాదించుకోవచ్చు (హోం డెలివరి) ధన్యశ్రీ నాంపల్లి ✆ 9030444383, 9704086431.

5 స్టార్ హోటల్ మైంటేనెన్స్ క్యాటరింగ్ బాయ్స్ P:400/- F:700/- గర్ల్స్ P:400/- F:1400/- రూం + మీల్స్ (ప్రీ, సెక్యూరిటీగార్డ్స్ హౌస్‌కీపింగ్ (6000/- 15000/-) ✆ 9666846298/ 7330753758

ప్రముఖ రియల్‌ఎస్టేట్ సంస్థ HMDA లేఅవుట్స్ మార్కెటింగ్ చేయుటకు (M/F) (ఫ్రెష్/Exp. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, స్టాఫ్‌బాయ్స్, MM, AGM's కావలెను. సాలరీ+ ఇన్సెంటివ్స్ ✆ 8185962568.

సూపర్ మార్కెట్‌లో పనిచేయడానికి సేల్స్ గర్ల్స్ & బాయ్స్, హెల్పర్స్ కంప్యూటర్ బిల్లింగ్ ఆపరేటర్స్, ప్యాకింగ్ గర్ల్స్, అఫ్జల్‌గంజ్, Hyd. ✆ 66463848, 9440569292

స్పాట్‌జాయినింగ్, జీతం: 18,000/- అర్హతలుగా ప్రముఖ ఏజెన్సీలకై 300 ఖాళీ పోస్టులకై M/F స్టాఫ్, P/F టైం, ఆల్ ఏరియాస్. Q: 10th - P.G, Age: 18-35Y, Ph: 8897511523

DSNR డైరెక్ట్ జాబ్. వెంటనే కావలెను. కాల్‌సెంటర్, కస్టమర్‌కేర్, టెలికాలర్స్, డాటాఎంట్రీ, M/F, జీ: 8-15K, Q: SSC-PG, కోఠార్స్ థియేటర్ లేన్. Ph: 9390055414.

MNC కంపెనీకై సెక్యూర్స్ & సూపర్వైజర్స్ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, గచ్చిబౌలి & హైటెక్‌సిటీలో కా॥, జీ: 13,000 & 17,000/-, 8 గం॥, ESI, PF & Bonus. ✆ 8096242482/ 8885224546/ 7989094312

"సువర్ణావకాశం" - మీరు VRS/ రిటైర్డ్ అయ్యి బోర్ ఫీలౌతున్నారా? మరలా మేనేజర్‌గా పనిచేస్తూ నెలకు 40,000/- ఆపైన సంపాదన కొరకు సంప్ర॥ - (స్త్రీలకు ప్రత్యేక విభాగం కలదు. సుమిత్ర: సెల్: 8374109968/ 9246262646.

సేల్స్‌బాయ్స్ & గర్ల్స్, కంప్యూటర్ ఆపరేటర్, క్యాషియర్స్, హెల్పర్స్ అనుభవం ఫ్రెష/లేకున్నా వ॥30లోపు. రూప్‌లక్ష్మి (ప్రె.మార్కెట్, షాప్ నెం.423/B. 4th ఫ్లోర్, కోత్తపేట.✆ 9248019916/9885673980.

Wanted Helpers మా ఆఫీస్‌లో పనిచేయుటకు వ॥ 25 సం॥లోపు ఎలాంటి విద్యార్హత లేని పురుషులు కావలెను. (P/F) టైం మంచి జీతం ✆ 8367418967/ 9704710880

డైరెక్ట్ తెలుగు మాట్లాడే కాల్‌సెం॥లో కలెక్షన్ ఎగ్జి॥ రిసెప్షనిస్ట్, డేటాఎంట్రీ, M/F స్టాఫ్ కావలెను P/F 10th-P.G. జీ॥ 6K to 20K Exp ✆ 9100849004/ 8801064739

డైరెక్ట్ కంపెనీ M/F మార్కెటింగ్ ఎగ్జిబ్స్, టీచర్స్, LIC/ చిట్స్ వారు, గృహిణులు, MLM, బిజినెస్/ మార్కెటింగ్ Exp వారు కావలెను. Age:25 సం॥లు పైన పార్ట్/ ఫుల్‌టైం * జీతం ✆ 9951381717/ 9581831242.

ఫీజులేదు. పాంగిన్‌సుల్స్, మల్టీప్లెక్స్‌లో సేల్స్ బాయ్స్ & ప్రముఖ LTD కం॥లో హెల్పర్స్, సూపర్వైజర్స్, ప్యాకింగ్ బాయ్స్, సెక్యూరిటీ, హౌస్‌కీపింగ్ కా॥ జీ: 9-20వేలు, (ప్రీరూం, మీల్స్ ESI, P.F Ph: 9866264278.

సాడ్‌ఫ్యాక్స్‌కు 200+ డెలివరీ బాయ్స్ కావలెను. బైక్/ DL తప్పనిసరి. జీతము 20 వేల వరకు ఉంటుంది. ★ వెంటనే చేరవలెను. మిస్డ్ కాల్ ఇవ్వండి- : 01139586596

బాలానగర్‌లోని ప్రముఖ ఇంజనీరింగ్ కంపెనీ నందు పనిచేయుటకు అనుభవం కలిగిన CNC - Supervisors/ Millers/ Turners & Security Officers కావలెను. అనుభవం బట్టి జీతం & ESI + PF సదుపాయం కలదు. ✆ 9848829474/ 9848883220

మాన్యుఫాక్చరింగ్ కంపెనీలకు B.Tech/ M.Tech, Mech/ EEE/ ECE వారు, ప్రొడక్షన్/ మెయింటెనెన్స్/ QC/Testing కొరకు మేనేజర్లు/ అడ్మినిస్ట్రేటర్లు/ క్యాషియర్లు/ కంప్యూటర్/ డేటాఎంట్రీ ఆఫ్స్/ స్టోర్ సూపర్వై/ అకౌంటెంట్లు/ కస్టమర్‌కేర్/ కాల్‌సెంటర్/ కలెక్షన్/ వెరిఫికేషన్/ సేల్స్ ఎగ్జిక్యూటివ్/ టెలికాలర్స్ కావలెను. Exp: 0 to 30 Years, జీ: 10K to 80K, వివరాలకై- 7337410067, 9177918952, 8374392002.

అర్జెంటుగా డైరెక్ట్ (తెలుగు) మాట్లాడే కాల్‌సెం॥కై M/F స్టాఫ్, DSNR, ఉప్పల్, సికింద్రా, అబిడ్స్, ECIL, KPHB, MP, B.హిల్స్, హైటెక్‌సిటీ, P/T, D/N జీ: 14-25K Q: 10th - PG ✆ 7032473870

EENADU CLASSIFIEDS

JOBS

లేడీస్ డ్రెస్సెస్ ఆల్ట్రేషన్ చేయుటకు జెంట్స్ టైలర్స్ కావలెను. సంప్రదించండి. 9885515615

ప్రముఖ ISO 9001: 2015 సర్టిఫైడ్ ఫెసిలిటీ కంపెనీ నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్‌లు (F) & టెలీకాలర్స్ (F), HR-Exe & అకౌంటెంట్స్ కావలెను. ✆ 9989809121, 7702543121

గృహిణులకు గొప్ప అవకాశం ప్రముఖ రియల్ ఎస్టేట్స్‌లో కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు రి॥ LIC ఏజెంట్లు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, గృహిణులు కావలెను. సంప్ర॥ 9 to 6Pm 040-24126888.

5&3 స్టార్ హోటల్స్‌లో క్యాటరింగ్ బాయ్స్/గర్ల్స్ కావలెను. గర్ల్స్ 600-1200/-, బాయ్స్ 450-900/- P/F టైం రూం+మీల్స్, స్పాట్ పేమెంట్స్. ✆ 9666847563, 7995280048.

హైటెక్‌సిటీ (MNC) కంపెనీలో పనిచేయుటకు హౌస్‌కీపింగ్ బాయ్స్ సూపర్‌వైజర్స్, ఎలక్ట్రీషియన్స్ కుక్స్, HVAC, M.S.T వెంటనే కావలెను. ✆ 7993865616.

వాటర్‌పార్క్‌లో పనిచేయుటకు డిగ్రీ పాసైన యువతి యువకులు వెంటనే కావలెను జలవిహార్ నెక్లెస్ రోడ్ Hyd. ✆ 9908822588

ఎగ్జోటిక్ ఈవెంట్స్‌కు అనుభవం వున్న మేనేజర్, ఎగ్జిక్యూటివ్, రిటైర్డ్ అకౌంటెంట్ హెవీ/ లైటు డ్రైవర్లు కావలెను. 23215566, 9989802046

ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు X to PG అర్హత గల అభ్యర్థులు కావలెను. ఆకర్షణీయమైన జీతం, ఉచిత భోజన వసతి కలదు. Cell. 85109 73559, 85109 73845

సికింద్రాబాద్ కాల్‌సెంటర్ వెంటనే కావలెను. P/F టైం, డే/ నైట్ షిఫ్ట్స్, M/F వ: 18-30, మంచిజీతం. # 335, 3rd ఫ్లోర్, చంద్రలోక్ కాంప్లెక్స్, C-బ్లాక్, ప్యారడైస్ 9966342711.

ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు Female Tele callers కావలెను. ఫిక్స్‌డ్ జీతం + ఇన్సెంటివ్ కలదు. హబ్సిగూడ ✆ 7569066330.

ప్రముఖ కంపెనీలో Female Telecallers కావలెను. మంచిజీతం+ ఇన్సెంటివ్ ఇవ్వబడును. అనుభవం వారికి ప్రాధాన్యత + మంచి ప్యాకేజ్ ఇవ్వబడును. ✆ 9494509955

కుకట్‌పల్లి, నిజాంపేట్, చందానగర్ ఏరియాలోని ప్రముఖ హాస్పిటల్‌లో పని చేయుటకు అనుభవం కల్గిన హౌస్‌కీపింగ్ ఆయాలు కావలెను. Ph: 9666111048

రావుబ్రదర్స్ చిట్‌ఫండ్స్ ప్రైలి॥ Dilsukhnagar బ్రాంచ్ నందు పనిచేయుటకు Assist Businessmens &ఏజెంట్స్ (Business) కావలెను. ఆసక్తి గలవారు ఇంటర్వ్యూ: 24/8/17న హాజరుకాగలరు. ✆ 9394335572, 40033344.

ఆఫీస్ అసిస్టెంట్: ప్రముఖ ప్రచురణ సంస్థకు ఇంగ్లీషు, హిందీ మాట్లాడగల్గిన కంప్యూటర్ ఆపరేటర్ (F) కావలెను. సికింద్రాబాద్, పద్మారావునగర్ పరిసర వాసులకు ప్రాధాన్యత. ✆ 99891 13036, 040 - 27503030.

డైరెక్ట్ కంపెనీ Female Only టెలీకాలర్స్, H.R, పర్సనల్ అసిస్టెంట్ (P.A) కావలెను. Q: ఇంటర్/ డిగ్రీ/ PG/ MBA/ B.Tech ఫ్రెషర్స్‌కి ట్రైనింగ్ ✆ 9963555858

MARKETING / SALES

Wanted Experience Salesman for Kids Shop. Salary 12000- 16000 + Commission Contact with Biodata Pranay 9000000589. HEPPPPBYKUSHALS 130/A Jubileehills R.No.36, Near More Super Market

Wanted Marketing Exe. with Good Communication Skills. Walk in Resume. SS Lab Equipments, Nagaram.✆ 9866565517, 7095404471.

MBA/ MCA/ Degree Freshers (M/F) Required for a reputed company. Attractive Incentives. Habsiguda.✆ 7075998062, 7286818790.

Wanted MKTG Telecallers, MKTG Exe, Manager for a Reputed company L.B.Nagar Good Salary+Comm+Inc ✆ 8297111573/8328090104.

ప్రముఖ రియల్‌ఎస్టేట్ డోర్ టు డోర్ మార్కెటింగ్ చేయుటకు M/F Agent's లు Executives కావలెను. నెలకు 35 వేల వరకు సంపాదించే అవకాశం. Ph: 8328053198

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేయుటకు అనుభవము మరియు టీం ఉన్న మార్కెటింగ్ సిబ్బంది కావలెను. టీం ఉన్న వారికి ప్రత్యేక ప్యాకేజ్ ఇవ్వబడును. లాంచింగ్ Shortly 300 ఎక॥ HMDA & EMIతో ✆ 9063219645

FACULTY / TEACHERS

Looking For Female Trainer in Kompally Area To Teach Abacus for Children Bet Age 6-12yrs. Work only on Saturday, Sunday earn Upto 10,000 PM. Training Provided By SIP Academy. 9705782260 (11-2pm)

Wanted VI to X Hindi Teachers St. Donald's High School P&T Colony DSNR Hyd. Come along with Originals

Wanted Teacher's Immediately VI to X Class H.S.C with B.E.D Teacher's (Phy's, Maths), Telugu Subjects. Sri Ranganath Vidya Niketan, Nanak Ramguda/ 9652666146

Wanted Maths, Phy.Sci For Higher Classes, Sci, Maths, S.S For Office Asst. Lower Class @ Saviour School (Opp): Rajbhavan ✆ 9849354864.

Wanted Qualified and Experienced Male/ Female Academic Zonols, Co-ordi-nations and Incharges for a Reputed Group of Schools in Hyderabad City. ✆ 8498918000/ 8498917000

Wanted Pre-Primary Teachers, Hindi, English and Computers for Primary Classes and Social, Computer Science for High School Classes, Attractive Salary. Contact: Sri Krishna Nagar, Venkatagiri, Yousufguda. Ph: 9866750650

Dommnics Group of School Requires High School English Maths Social & Computers PET & Primary English Maths Science & PPE Primary Teachers for Karmanghat Kothapet & Malakpet ✆ 8328035868/ 9392417396

Wanted English, Phy, Economics, Civics, Commerce, Sanskrit Floor/ Off Incharge Computer Operator, Supervisors Jr.Clg 9666295529

DRIVERS

International Brand Distributor Requires Drivers with Batch Number Duty Between 10AM to 8PM ✆ 9440409523/ 66904005

వాంటెడ్ డ్రైవర్స్ ప్రతిష్టాత్మక ట్రాన్స్‌పోర్టుకంపెనీకి 32 అడుగుల (6 Wheeler) & 20 అడుగుల కంటైనర్ డ్రైవర్ అవసరం. 3yrs Exp AP & TS యొక్క భారీ సరుకుల లైసెన్స్ వాహనాలు South & West ప్రాంతాల్లో ఉంటుంది. ప్రావిడెంట్‌ఫండ్, యాక్సిడెంట్ మెడిక్లైయిమ్ ఇన్సూరెన్స్ పాలసీ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. Documents: డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్‌కార్డు, చిరునామా రుజువు, ఫోటో ✆ 09923207112 / 09370147183 / 09325949801 (10am to 7pm)

RTC Hire బస్సు నడుపుటకు హెవి లైసెన్స్ ఉన్న డ్రైవర్లు కావలెను. BHEL, RC పురం, చందానగర్, మియాపూర్ వారికి ప్రాధాన్యత. జీ: 15 రోజులకి 13 వేలు. ✆ 7330941424/ 7995436479.

కేవలం 20 నెలల్లో Verito Cabను స్వంతం చేసుకోండి. ముందస్తు చెల్లింపు లేకుండానే, షరతులు వర్తిస్తాయి. 40520197/ 7675909909.

కనీసం 5 సం॥రాలు డ్రైవింగ్‌లో అనుభవం కలిగి బెంజ్/ బి.యం.డబ్ల్యూ/ ఆడి (Benz/ BMW/ Audi) కార్లు నడుపుటకు 40 సం॥ల లోపు డ్రైవర్లు కావలెను. బంజారాహిల్స్ పరిసర ప్రాంతాల వారికి ప్రాధాన్యత. ఆసక్తి గలవారు ఉ॥ 9 గం॥ల నుండి 5 గం॥ల లోపు సంప్ర॥ ఫోన్: 040-27152489/ 27173663.

అద్భుతమైన అవకాశం హైటెక్ సిటీ IT కంపనీస్‌లో నెల ప్యాకేజ్ వెహికల్స్ ETIOS, Xcent, Xylo, 2016 above మోడల్స్ ✆ 9391333277.

హైటెక్‌సిటీ IT కంపెనీస్‌లో ట్యాక్సీప్లేట్ వెహికల్స్ నడుపుటకు డ్రైవర్స్ కావలెను. జీ: 12000-15000/- ఇవ్వబడును. సంప్ర: 9391333277/ 9963835511.

ACCOUNTING

Get GST Classes along with Advance Tally.ERP9/ MS Office @ 50% Dis. with Job Screening & Free Placements. 8121465380.

B.Com/M.Com/ MBA as Accountants Without Exp. Sal:Upto 12,000/- Job Thru 45 days Tarining for Details STPL,Tarnaka ✆ 98855 67344.

BPO / CALL CENTER

Female Telecallers కావలెను. (Inter/ Degree/ Pass/ Fail Hitech City). ✆ 9550822642

ENGINEERING

Vamsiram Builders Wanted Personnel for the following posts who are well experi-enced in construction of High Rise Commercial Buildings to work in Hyderabad. Senior Site Engineers/ Surveyors with Total Station Experience Interested Persons can apply before 25-08-2017 - 5.00 pm. E-mail: operationsvrb@gmail.com

MEDICAL

Clinic Sharing Fulfledged Running Spacious Clinic at Shivam Main Road, Close to DD Colony available on Sharing Rent. ✆ 9866222111.

SECRETARIAT - OFFICE STAFF

Wanted Good Looking Female Secretary in Hi-Tech City. Send Resume and Photo to : malisettimines@gmail.com.

SECURITY GUARDS

Wanted Security Guards, Near MGBS. Hight: above 5'.6" &Age below 45yrs. Qly: 10th Pass. Good Salary. Cont: 9441224783/ 9849882807.

సెక్యూరిటీగార్డ్సు & Gunmen కావలెను. సోమాజిగూడ/ బంజారాహిల్స్/ బేగంపేట ఏరియాలకు. మంచి జీతం+ డ్యూటీలో ఫుడ్ కలదు. ✆ 9182091500/ 9700152976.

TOURS & TRAVELS

Singapore & Malaysia @ 49,999/- Dubai & Abudhabi @ 49,999/- Bangkok, Pattaya & Phuket @ 39,999/- Kakani Holidays P.Ltd. ✆ 97016 95555.

దసరాకి ఒరిస్సా 5 రోజుల AC యాత్ర సెప్టెంబర్ 26న పూరి, కోణార్క్, భువనేశ్వర్, గిరిజాదేవి శక్తి పీఠం, అన్నవరం, తలుపులమ్మ లోవ, సింహాచలం, అరసవిల్లి, శ్రీకూర్మం, శ్రీముఖ లింగం, పిఠాపురం, ద్రాక్షారామం, ద్వారకాతిరుమల. లక్ష్మీటూర్స్. ✆ 98662 46466.

కావేరిపుష్కరాలు, మొదటిరోజు శ్రీరంగపట్నంలో స్నానమాచరించే గోవా & కర్ణాటక 20 క్షేత్రాల AC యాత్ర Sep 4న & తమిళనాడు శ్రీరంగంలో పుష్కర స్నానమాచరించే రామేశ్వరం 30 క్షేత్రాల AC యాత్ర Sep 15న. ✆ 98662 46466.

కావేరిపుష్కరాలు, శ్రీరంగం, మైసూర్, శృంగేరి, గోకర్ణం,మూకాంబిక 7 రో॥ 7200/-10-9 & 15-9 ★ కాశిమినిటూర్,కాశి,ప్రయాగ. 3రో॥ వ॥ భో॥ 3000/- sep-4 సత్యసాయి సేవాసమాజ్ 9618933189.

కావేరి పుష్కరాలు Sep-13-23, 2 రాత్రిలు, 3 పగలు, అన్ని వసతులతో 9,250/7,250/- ఒక్క మనిషికి, పుష్కర స్థానం శ్రీరంగపట్నం , కర్ణాటక Ph: 9494873377/ 9494723377

శివోహంవారి ఛార్‌ధామ్ యాత్ర సెప్టెంబర్ 7, 15 రో॥ 19,500/- షిర్డీ+ 4 జ్యోతిర్లింగ, 3/10, 8 రో॥ 6,000/-, 13/11 నవదేవియాత్ర, 13 రో॥ 16,500/- ✆ 96766 37578.

శ్రీలంక రామాయణ యాత్ర & శాంకరీదేవితో @ 33,999/- శోభన, ద్వారక, ఉజ్జయిని & ఓంకాళేశ్వరితో @ 14,999/- కాకాని హాలిడేస్ ప్రై॥ లిమిటెడ్. ✆ 91779 42424.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మార్పు శాశ్వతమేనా?

- ఒకప్పుడు నచ్చినప్పుడే.. ఇప్పుడు సమయానికి
- బోసిపోయి కనిపించే కలెక్టరేట్‌లో సిబ్బంది హడావుడి
- కొత్త కలెక్టర్ రాకతో మార్పు



ఈనాడు, హైదరాబాద్

అంతలోనే ఎంత మార్పు.. నచ్చినప్పుడు, తీరికున్నప్పుడు అలా వచ్చి.. ఇలా వెళ్లిపోయేవారు. సమీక్ష సమావేశాలంటే విహార యాత్రలకు అన్నట్లుగా వచ్చేవారు. ఎవరైనా గట్టిగా అడిగితే ఇక అంతే.. వాళ్లను లక్ష్యంగా చేసుకుని బద్నాం చేసేవారు. ఇప్పుడు.. ఠంఛన్‌గా సమయానికి వస్తున్నారు. ఏది అడిగితే దానిపై నివేదికలు.. పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉంటున్నారు హైదరాబాద్ జిల్లా రెవెన్యూ ఉద్యోగులు. పెద్దగా హడావుడి ఉండని కలెక్టరేట్ కొద్ది రోజుల నుంచి సందడిగా మారింది.

● వాస్తవానికి ఇతర జిల్లాలతో పోలిస్తే హైదరాబాద్ జిల్లా యంత్రాంగానికి పని తక్కువే. ముఖ్యమైన పౌరసేవలు, కార్యక్రమాలు, పథకాలను జీహెచ్ఎంసీ పర్యవేక్షిస్తుంది, అమలు చేస్తుంది. భూముల పరిరక్షణ, సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక, ధ్రువీకరణ పత్రాల జారీ తదితరాలను రెవెన్యూ యంత్రాంగం చూస్తోంది. కొన్నేళ్లుగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేమితో కొందరు ఉద్యోగులు దారి తప్పారు. కొన్ని సంఘాల అండ చూసుకుని రెచ్చిపోతున్నారు. ఎప్పుడు ఎక్కడుంటారో తెలియని పరిస్థితి. 12 గంటలు దాటితే గానీ కొందరి దర్శనం లభించదు. ఒక్క మాటలో చెప్పాలంటే కలెక్టరేట్ బోసిపోయి కనిపించేది. సొమ్ము పడనిదే ఏ పనీ చేయని పరిస్థితి. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా ఫించన్లు తదితర సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలోనూ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలను... అడిగినంత ఇస్తే ఒక్క రోజులో మంజూరు చేస్తారు. లేదంటే ముప్పు తిప్పలు పెడతారు.

● తమ సమస్యను చెప్పుకొనేందుకు ఎక్కడెక్కడి నుంచో ప్రజలు ప్రతి సోమవారం నిర్వహించే మీ కోసం కార్యక్రమానికి వస్తుంటారు. ఎవరెప్పుడొస్తారో ఎవరికీ తెలియదు. ఎన్నిసార్లు అర్జీలు పెట్టుకున్నా... సమస్యలు పరిష్కారం కావు. జిల్లాస్థాయి అధికారులు రారు. వాళ్ల కింది స్థాయి ఉద్యోగుల్ని పంపిస్తారు. ఉన్నతాధికారులు పట్టించుకోరు. ఒకవేళ పట్టించుకుంటే ఇక అంతే సంగతులు. లేనిపోని ఆరోపణలు చేస్తారు. ఆకాశ రామన్న పేరుతో ఫిర్యాదులు ఇస్తారు. డబ్బులు కావాలని వేధిస్తున్నారంటూ రచ్చరచ్చ చేస్తారు. అందుకే ఇన్ని రోజులూ కొందరిని చూసీ చూడనట్లుగా వదిలేస్తున్నారు. హైదరాబాద్‌లో అడుగు ఖాళీ జాగా దొరకడం కష్టం. అలాంటిది రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూముల్ని కాపాడటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొందరైతే అందిన కాడికి దండుకుని కబ్జాకోరులకు పరోక్షంగా సహకరిస్తున్నారు. కనీసం ఎంత భూమి ఉంది.. ఎక్కడెక్కడ ఆక్రమణలకు గురయ్యాయి.. ఏవేవి కేసుల్లో చిక్కుక్కున్నాయనే అంశంపైనా స్పష్టత లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

● హైదరాబాద్ కలెక్టర్‌గా డాక్టర్ యోగితా రాణా బాధ్యతలు స్వీకరించారు. అప్పటికే కొందరు ఉద్యోగులు ఆమె పనితీరు ఎలా ఉంటుందంటూ ఆరా తీశారు. పప్పులుడకవని తెలియడంతో కలవరం మొదలైంది. అందుకు అనుగుణంగా ఆమె మొదటి రోజు నుంచే తన 'మార్కు' పనితీరును షురూ చేశారు. ఉంటే సక్రమంగా ఉండాల్సిందే.. లేదంటే మీకు నచ్చిన చోటు బదిలీ చేయించుకోండి.. తనకెలాంటి అభ్యంతరం లేదంటూ ముఖం మీదే చెప్పేశారు. అవినీతిని సహించేది లేదు.. మనమున్నదే ప్రజల కోసం... నిర్లక్ష్యంగా వహిస్తే మాత్రం కొరఢా ఝుళిపించడం ఖాయమంటూ హెచ్చరించారు. ప్రభుత్వ భూములకు సంబంధించిన సమాచారాన్ని పబ్లిక్ డొమైన్‌లో ఎందుకు పెట్టలేదంటూ ప్రశ్నించారు. రెవెన్యూ వ్యవస్థ మొత్తాన్ని పది రోజుల్లోగా ఈ-ఆఫీస్‌గా మార్చాలని ఆదేశించారు. ఒక్కో అంశానికి సంబంధించి సమీక్షిస్తానని.. అవసరమైన నివేదికలు, సమాచారంతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎప్పుడు.. ఎవరిని పిలుస్తారోనని అందరూ ఠంఛన్‌గా సమయానికి కలెక్టరేట్‌కు వస్తున్నారు. తమ విభాగానికి సంబంధించిన సమాచారం.. నివేదికల్ని సిద్ధం చేసి పెట్టుకుంటున్నారు. పెండింగ్ దస్త్రాలపై దృష్టి సారించారు. ఎప్పుడూ బోసిపోయే కలెక్టరేట్‌లో కొంత హడావుడి కనిపిస్తోంది. కొత్త కలెక్టర్ ఆ కొందరు ఉద్యోగులపై నజర్ పెడితే పరిస్థితిలో మార్పు వస్తుంది.. మిగిలిన వారు దారిలోకి వస్తారు.. ఈ మార్పు శాశ్వతంగా ఉంటుంది.



చెట్టు మా తల్లి: మైత్రీవనం వద్ద ఓ వ్యక్తి చెట్టుకు దేవతా విగ్రహాన్ని ఏర్పాటుచేసి నిత్యం ఇలా పూజిస్తున్నారు. ప్రాణవాయువును అందించే మొక్కలు దైవరూపాలేనని చాటిచెబుతున్నారు.




కుక్కకాటుకు గురైన చిన్నారి

ఎంఎస్ మక్తాలో కుక్కల స్వైరవిహారం

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఖైరతాబాద్ ప్రాంతంలోని ఎంఎస్‌మక్తాలో కుక్కలు స్వైరవిహారం చేశాయి. ఆదివారం ఉదయం బయట ఆడుకుంటున్న క్రమంలో అయిదుగురు పిల్లలను విచ్చలవిడిగా కరిశాయి. కుక్కలను పట్టేందుకు జీహెచ్ఎంసీ సిబ్బంది ప్రయత్నించి దొరక్కపోవడంతో వెళ్లిపోయారు. బస్తీకి చెందిన ఆఫిన్ (10), సోహైల్ (13), మరో ముగ్గురు చిన్నారులు గాయపడ్డారు. వారిని ఫీవర్ ఆస్పత్రికి తరలించారు. ఖైరతాబాద్‌లోని బీజేఆర్‌నగర్ బస్తీ, రాజ్‌నగర్‌లో పలువురిని కుక్క కాటేసిన ఘటన మర్చిపోకముందే ఈ ఘటన చేసుకోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఐమ్యాక్స్ ఎదుట గల లేక్‌వ్యూ పార్కులోనూ ఉదయం కుక్కలు చేరుకుంటున్నాయని, అక్కడ వాకర్లపై దాడిచేస్తాయన్న భయం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

గట్టి సంకల్పం.. మట్టిలో దైవత్వం



- పదేళ్ల క్రితమే మట్టి గణపయ్యకు సేవ్ సంస్థ ప్రచారం
- అందుబాటులోకి తెచ్చేందుకు స్వయంగా తయారీ
- దోవతి, కండువా సంప్రదాయంతో నేతన్నలకు ఉపాధి

నార్సింగి, న్యూస్‌టుడే

గణేష్ ఉత్సవాలు వస్తున్నాయంటే నెల రోజుల ముందుగానే యువకుల్లో ఎక్కడ లేని ఆనందం. బస్తీలు, కాలనీల్లో మండపాలు ఏర్పాటు చేసేవారికి నెలరోజులు తీరిక ఉండదు. ఈ ఏడాది ఎంత ఎత్తు వినాయకున్ని ఏర్పాటు చేయాలి? ఏ ఆకారం... ఎలాంటి రంగులతో తయారు చేసిన గణపయ్యను ఏర్పాటు చేయాలనే విషయాలతో తర్జనభర్జన పడుతుంటారు. ఏటా గణపతుల మండపాల సంఖ్య రెట్టింపు అవుతుంది... అదే రీతిన ఇటీవల మట్టి గణపతులను పూజించాలంటూ ప్రచారం ఊపందుకుంటుంది. రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన గణపతులతో చెరువులు కలుషితమవుతున్నాయని ప్రకృతి ప్రేమికులు పలు విధాలుగా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు యత్నిస్తున్నారు. అయితే నగరంలో మట్టి వినాయకులపై అంతంత మాత్రంగానే అవగాహన ఉన్న కాలంలోనే సేవ్(సొసైటీ ఫర్ అవేర్నెస్ అండ్ విజన్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్) స్వచ్ఛంద సంస్థ మట్టి గణపతుల తయారీకి ముందుకు వచ్చింది. 2006 నుంచి ఈ సంస్థ మట్టి గణేష్ ప్రతిమలను పూజించాలంటూ ప్రచారం చేయడమే కాకుండా స్వయంగా తయారు చేసేది. మట్టి ప్రతిమలపై ప్రచారం మొదలైన ప్రచారం మొదలైన తొలినాళ్లలో అవి ఎక్కడా దొరికే పరిస్థితి ఉండేది కాదు. దీంతో వాటిని తయారు చేసి అందుబాటులోకి తేవాలని సంస్థ వ్యవస్థాపకుడు విజయరాం నిర్ణయించారు. దీంతో ప్రచారం మాటల వరకే పరిమితమైతే సమస్య పరిష్కారం కాదని... అవసరమైన వారికి మట్టి ప్రతిమలను అందించే ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

జలచరాలు కనుమరుగు..

రసాయన రంగులు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన వినాయక విగ్రహాలు చెరువులు, కుంటలలో నిమజ్జనం చేసిన తర్వాత, విష రసాయనాలతో ఆయా చెరువులు, కుంటలు కలుషితమై పోతున్నాయి. ఫలితంగా ఆ చెరువుల్లో ప్రకృతి సిద్ధంగా పెరిగే చేపలు, ఇతర జలచరాలు అంతరించి పోతున్నాయి. వినాయకులను తయారు చేయడానికి ఉపయోగించే రంగులు, రసాయనాల్లో మెర్క్యూరి, లెడ్ వంటి ప్రమాదకరమైన పదార్థాలు నీటి వసరులను కలుషితం చేస్తున్నాయి. ముఖ్యంగా నగరం శివారులో ఉన్న పలు చెరువులు ఇలా ఏటా కలుషితమై.. నేడు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది.

ఎలా తయారు చేస్తున్నారు...?

మట్టి వినాయకుల తయారీలో అవసరమైన మట్టిని బెంగాల్ నుంచి తెప్పించాల్సి వస్తోంది. మన మట్టిలో ఇసుక రేణువుల పరిమాణం ఎక్కువ మొతాదులో ఉంటుండటంతో ప్రతిమల తయారీ తర్వాత పగుళ్లు వచ్చే అవకాశం ఉంది. అదేవిధంగా వెదురు బొంగు కూడా అక్కడి నుంచే తీసుకువస్తున్నామని విగ్రహాలు తయారు చేసే ముఖ్య కళాకారులు అసిందాస్ తెలిపారు. వెదురుకర్రకు మొదట వరిగడ్డిని ఆయా ప్రతిమల ఆకారంలో చుట్టి సిద్ధం చేస్తారు. అలా గడ్డితో తయారు చేసిన ప్రతిమలకు మట్టిని విడతల వారీగా పూస్తారు. తర్వాత విగ్రహానికి అవసరమైన నగలను కూడా మట్టితో తయారుచేసి అలంకరిస్తారు. చివరగా మట్టితో తయారు చేసిన ప్రతిమలకు మట్టి నీళ్లలో బ్రష్ అద్ది రుద్దుతూ మెరుగులు దిద్దుతారు.

ఒక్క రూపాయికే..

నగరానికి చెందిన విజయరాం ప్రకృతి ప్రేమికుడు. కొన్నేళ్లుగా ఆయన అందరి మాదిరిగా మట్టి వినాయకులనే వినియోగించాలని ప్రచారం చేస్తున్నాడు. అయితే ప్రచారంతోనే ఆగిపోకుండా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయకులకు ప్రత్యామ్నాయంగా మట్టి వినాయకులను జనానికి అందుబాటులోకి తీసుకువచ్చారు. తొలుత చిన్న సైజులో మట్టి గణేష్‌లను తయారు చేయించి ఒక్క రూపాయికే అందించడం ప్రారంభించారు. ఇందుకోసం బెంగాల్ నుంచి కళాకారులను రప్పించి ఇక్కడే మట్టి వినాయకుల తయారీకి శ్రీకారం చుట్టారు. అలా ఒక్కో మెట్టు అధిగమిస్తూ ప్రజల ఆసక్తి మేరకు మట్టి ప్రతిమలను కొంత పెద్ద సైజులో తయారు చేయించి విక్రయంచడం మొదలు పెట్టారు. సాధారణంగా చిన్నవాటి తయారీకి రూ.40 వరకు ఖర్చవుతున్నా.. వాటిని ఒక్క రూపాయికే అందించడానికి కృషి చేశారు. ఒక్కో ఏడాది ప్రతిమల తయారీని పెంచుతూ ప్రస్తుతం వేల సంఖ్యలో తయారు చేస్తున్నారు. వీటిలో చిన్నవాటితోపాటు పెద్ద వినాయకులు(3, 4, 5 అడుగుల ఎత్తు) కూడా ఉన్నాయి. పెద్ద ప్రతిమలను ఎలాంటి లాభాపేక్ష లేకుండా తయారీ ధరకు విక్రయిస్తున్నారు. మొదట నగర శివారులోని నార్సింగిలో తయారీ యూనిట్ ఏర్పాటు చేసిన విజయరాం ప్రస్తుతం నార్సింగితో పాటు హయత్‌నగర్, విజయవాడ, ఒంగోలులో కూడా మట్టి వినాయకుల తయారీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మట్టి వినాయకుల తయారీ కోసం 150 కుటుంబాలను బెంగాల్ నుంచి తీసుకువచ్చి ఇక్కడ ఉపాధి కల్పిస్తున్నారు.

నేత మగ్గాలపై నేసిన..

మట్టి వినాయకులతోనే సరిపెట్టకుండా సేవ్ సంస్థ చేనేత కార్మికులకు ఉపాధి చూపాలని సంకల్పించింది. తమ వద్ద మట్టి వినాయకులను(పెద్ద ప్రతిమలు) తీసుకునే వారికి ప్రతిమతో పాటు విగ్రహాన్ని అలంకరించేందుకు అవసరమైన దోవతీ, కండువాను అందజేస్తున్నారు. వీటని చేనేతలతో మగ్గాలపై నేయించి తయారు చేయిస్తున్నారు. తద్వారా నేతన్నలకు కొన్ని నెలల పాటు ఉపాధి లభిస్తోంది. ఆధ్యాత్మిక విషయాలకు సంబంధించిన సీడీలను కూడా జూట్ బ్యాగులో పెట్టి ప్రతిమలతోపాటు ఉచితంగా ఇస్తున్నారు.

ప్రజల్లో మట్టి గణేష్‌లపై ఆసక్తి పెరిగింది

–విజయరాం, సంస్థ వ్యవస్థాపకులు



ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన వినాయకులను పూజించడం వల్ల స్వామి మనల్ని దీవించరని, ఆయన సంతోషంగా ఉండరని సేవ్ సంస్థ వ్యవస్థాపకులు విజయరాం అన్నారు. మట్టి పవిత్రమైందని, స్వదేశీ వస్తువని, మట్టి వినాయకులను పూజించడం మూలంగా పర్యావరణం మెరుగుపడుతుందన్నారు. ప్రస్తుతం ప్రజల్లో మట్టి గణేష్‌లపై ఆసక్తి పెరిగిందన్నారు. ప్రభుత్వం ముందుకు వచ్చి ప్రోత్సహించినట్లయితే కుమ్మరులకు, ఇతర కళాకారులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. ప్రస్తుతం కుమ్మరులకు ఏడాదిలో కేవలం రెండు నెలలు మాత్రమే ఉపాధి లభిస్తోందన్నారు. ప్రకృతి, పర్యావరణాన్ని కాపాడాలనుకునే ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను ప్రోత్సహించాలన్నారు.



నార్సింగిలోని సేవ్ మట్టి గణపతుల తయారీ కేంద్రాన్ని సందర్శించిన మేయర్ తదితరులు (పాతచిత్రం)



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న రామలింగేశ్వర్‌రావు తదితరులు

అక్షరం పదునైన ఆయుధం

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: అక్షరం పదునైన ఆయుధమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ.రామలింగేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం సుందరయ్య కళానిలయంలో నవ్యసాహితీ సమితి ఆధ్వర్యంలో దివంగత శ్రీ చక్రవర్తి రంగస్వామి శతజయంతి ఉత్సవం సందర్భంగా రంగస్వామి రచించిన సంపూర్ణ కథానిక కదంబం, సంపూర్ణ నవలా కదంబం, సంపూర్ణ కవితా కదంబం పుస్తకాలను పలువురు వక్తలతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సమాజాన్ని మార్చేశక్తి పుస్తకాలకు, రచయితలకు ఉంటుందన్నారు. సమాజంలో మానవ విలువలను సాహిత్యం పెంపొందిస్తుందన్నారు. చక్రవర్తి రంగస్వామి శతజయంతి సభ కాకుండా ప్రముఖ సాహితీవేత్తలు, సుప్రసిద్ధ చిత్రకారుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమమని అన్నారు. చక్రవర్తి రంగస్వామి రాసిన కథలు, నవలలు ఎంతో ప్రాచుర్యం పొందాయన్నారు. కార్యక్రమానికి యువ భారతి సంపాదకులుసుధామ అధ్యక్షత వహించారు. ప్రముఖులు శీలా వీర్రాజు, చంద్ర, బత్తుల బాపూజీ, డా.అక్కిరాజు రమాపతిరావు (మంజుశ్రీ), వేదగిరి రాంబాబు, ఆచార్య ఫణీంద్ర, మంగళగిరి ప్రమీళాదేవి, పరిగి మదన్‌మోహన్, వేమరాజు విజయ్‌కుమార్, చక్రవర్తి సుందరశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాల నిరోధక చట్టం తేవాలి



మాట్లాడుతున్న మెట్రోపాలిటన్ సెషన్ జడ్జి రాధారాణి

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: మూఢ నమ్మకాల నిరోధక చట్టం తేవాల్సిన ఆవశ్యకత ఉందని నాంపల్లి మెట్రోపాలిటన్ సెషన్ జడ్జి గురజాల రాధారాణి అన్నారు. ఆదివారం సాయంత్రం సుందరయ్య కళానిలయంలో మానవ వికాస వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో దివంగత సామాజిక వేత్త నరేంద్ర దబోల్కర్ వర్ధంతి సందర్భంగా మూఢనమ్మకాలను అరికట్టాలని కోరుతూ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. బాణామతి, చేతబడి, మంత్రాలు, యంత్రాల వంటి వాటితో నిత్యం పలు ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు రక్షణ కల్పించి వారిని చైతన్యవంతులను చేయాలన్నారు. మానవ వికాస వేదిక రాష్ట్ర కార్యదర్శి డా.హన్మంతరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మూఢనమ్మకాలు బాగా పెరిగిపోయి హింసాత్మక ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటి నివారణకు ప్రభుత్వం చట్టం చేసి ప్రజలకు రక్షణ కల్పించాలన్నారు. సమావేశంలో సాంబశివరావు, ఎన్.విక్రం, స్వరాజ్యలక్ష్మి, ఇసునాక మురళీధర్, ఈశ్వరలింగం తదితరులు పాల్గొన్నారు.

రూ.వెయ్యి కోట్లతో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న గద్దె ప్రేమ్‌గాంధీ

చేవెళ్ల, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు గద్దె ప్రేమ్‌గాంధీ డిమాండ్ చేశారు. సమితి రంగారెడ్డిజిల్లా కార్యవర్గ సమావేశాన్ని చేవెళ్లలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఐకమత్యంగా లేకపోవడంతోనే హక్కులను సాధించుకోలేకపోతున్నామని, అంతా ఒక్కతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటానికి సిద్ధమవుతున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కల్వ సుజాత, ముఖ్య సలహాదారు గంప సిద్ధలక్ష్మి, హైదరాబాద్ మహిళా విభాగం అధ్యక్షురాలు రోజారమణి, ప్రజాసంబంధాల అధికారి బాలుగుప్తా, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌గుప్తా, వెంకటేశంగుప్తా, నవీన్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, మనీష్‌గుప్తా, పూర్ణచందర్ పాల్గొన్నారు. అనంతరం సంఘం జిల్లా నూతన అధ్యక్షునిగా వీరేందర్‌గుప్తా, ఉపాధ్యక్షునిగా రాకేష్, మండల ఇన్‌ఛార్జిగా భూపాల్‌గుప్తా, మండల అధ్యక్షుడిగా రమేష్‌గుప్తా, ఉపాధ్యక్షునిగా సంతోష్‌కుమార్‌లను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.


జ్ఞాపికలతో పాల్గొన్నవారు



ధ్రువపత్రాలతో మారథాన్ విజేతలు






రాక్‌బ్యాండ్ సందడి

గచ్చిబౌలి స్టేడియంలో విజేతలకు బహుమతుల ప్రదానం

ఉరకలెత్తిన ఉత్సాహం

గచ్చిబౌలి, ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఆద్యంతం సందడిగా సాగిన ఎయిర్‌టెల్ హైదరాబాద్ మారథాన్-2017 ఆదివారం విజయవంతంగా ముగిసింది. నగరంలో ఏడోసారి చేపట్టిన మారథాన్‌లో దాదాపు 20వేల మంది ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. పీపుల్స్ ప్లాజావద్ద ప్రారంభమైన పరుగు గచ్చిబౌలి స్టేడియం వరకు కొనసాగింది. 42 కిలోమీటర్ల ఫుల్ మారథాన్‌లో వెయ్యిమంది, 21 కిలోమీటర్ల ఆఫ్ మారథాన్‌లో 5వేల మంది, 10కెలో దాదాపు 6వేల మంది ఉత్సాహంగా పరుగు తీశారు. రన్నింగ్ చేస్తున్న వారిని ఉత్సాహపరిచేందుకు మారథాన్ మార్గంలో అక్కడక్కడ రాక్‌బ్యాండ్ మ్యూజిక్‌తో కళాకారులు వారికి స్వాగతం పలికారు. అక్కడక్కడ చిరుజల్లులు పడినా వాటిని లెక్కచేయకుండా పరుగు కొనసాగించారు. రన్నర్లకు అత్యవసర చికిత్స అందించేందుకు వీలుగా 21 మెడికల్ స్టేషన్లు, 5 అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచారు. ఉదయం 5.30 గంటలకు ప్రారంభమైన పరుగు పది గంటలకు ముగిసింది. ఈ పరుగులో విజేతలుగా నిలిచినవారిచిన వారికి ఎయిల్‌టెల్ ఏపీ, తెలంగాణ సీఈవో వెంకటేష్‌విజయరాఘవన్ బహుమతులను అందజేశారు. ఫుల్ మారథాన్‌లో ఇంద్రజిత్‌యాదవ్, దాసరి ఒబులేసు, క్రీస్తార్జున్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. మహిళల ఫుల్ మారథాన్‌లో జ్యోతిగత్వే, జ్యోతిసింగ్, ఆరాధానపుల్‌చంద్‌లు విజయం సాధించారు. విజేతలకు పతకంతోపాటు నగదు పురస్కారం అందజేశారు. ఆఫ్ మారథాన్‌లో సాగ్రముయాదవ్, శంకర్‌లాల్‌స్వామి, అనూప్, మహిళల విభాగంలో అమన్‌దీప్‌కౌర్, నీతు సింగ్, సోనియాలు బహుమతులు దక్కించుకున్నారు. 10కె రన్‌లో జి వహలాగ్, రాకేష్‌కుమార్, రాకేష్‌స్వామిలు, మహిళల విభాగంలో వి.నవ్య, సౌమ్య, రాజశ్రీలు విజేతలుగా నిలిచారు.

ప్రారంభించిన సీపీ, బల్దియా కమిషనర్

ఉదయం 5 గంటలకు నెక్లెస్ రోడ్డులో ఫుల్ మారథాన్‌ను నగర పోలీసు కమిషనర్ మహేందర్‌రెడ్డి, 6 గంటలకు హాఫ్ మారథాన్‌ను జీహెచ్‌ఎంసీ కమిషనర్ డా.జనార్దన్‌రెడ్డి ప్రారంభించారు. ఫుల్ మారథాన్ హుస్సేన్‌సాగర్ చుట్టూ తిరిగి ఖైరతాబాద్ ఫ్లైఓవర్, రాజ్‌భవన్ రోడ్డు, సోమాజిగూడ రాజీవ్ సర్కిల్, పంజాగుట్ట, బంజారాహిల్స్ మీదుగా హైటెక్ సిటీకి చేరుకొంది. హాఫ్ మారథాన్ పీపుల్స్ ప్లాజా నుంచి ఖైరతాబాద్ ఫ్లైఓవర్ మీదుగా అదే మార్గంలో సాగింది. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ ప్రపంచ నగరంగా ఎదగాలంటే ఇలాంటి కార్యక్రమాలు అవసరమన్నారు. జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యనగరంగా, స్వచ్ఛత దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కేర్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో వైద్యసేవలు అందించారు.


దారిలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్ జనార్దన్‌రెడ్డి


పరుగు ప్రారంభిస్తున్న సీపీ మహేందర్‌రెడ్డి




పరుగులో పాల్గొన్న వరంగల్ అర్బన్ కలెక్టర్ ఆమ్రపాలి








అడుగడుగునా ఆత్మవిశ్వాసం తొణికిసలాడేలా యువతుల పరుగోత్సాహం

నిషాచరుల్లో వారూ!

- తనిఖీల్లో చిక్కుతున్న వైనం
- మోతాదుకు మించి మద్యం నమోదు

వారాంతాల్లో రాత్రివేళ ఎంపిక చేసిన చోట్ల తాత్కాలికంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి మోతాదుకు మించి మద్యం తాగుతున్న వారిని ట్రాఫిక్ పోలీసులు పట్టుకుంటున్నారు. ప్రతి శుక్ర, శనివారాల్లో 26 ప్రాంతాల్లో ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. ఒక్కోసారి పదుల సంఖ్యలో మందుబాబులు దొరికిపోతున్నారు. వాహనాలను స్వాధీనం చేసుకుని కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నారు.

	కేసులు	జరిమానా (లక్షల్లో)	శిక్షలు
2015	13,285	127.62	1847
2016	17452	298.88	2323
2017 (జులై 3వరకు)	10500	185.55	2620

ఈనాడు, హైదరాబాద్

వారాంత విందులు... పబ్బుల్లో చిందులు... మద్యం మత్తులో ఆనందోత్సాహాల్లో తేలియాడి మునిగితేలుతున్న కొందరు యువత ఆ వెంటనే సొంతంగా వాహనాలు నడుపుకొంటూ రోడ్డు ఎక్కేస్తున్నారు. ఈ తరహా చోదకులు ఎక్కువగా ప్రమాదాలు చేస్తున్నట్టు గుర్తించిన ట్రాఫిక్ పోలీసులు కొద్దినెలల నుంచి డ్రంకెన్ డ్రైవ్ విస్తరిస్తున్నారు. మత్తులో వాహనాలు నడుపుతున్నవారిలో యువకులే గాక ఇటీవల కాలంలో యువతులు, మహిళలు కూడా అధికసంఖ్యలో దొరికిపోతున్నారు. కార్లలో డ్రైవింగ్ సీట్‌లో మహిళలు, యువతులుండడంతో మహిళా పోలీసుల సంఖ్యను పెంచామని ఉన్నతాధికారులు తెలిపారు. ఇకపై ఇలా వాహనాలు నడపకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటూ వారి కుటుంబ సభ్యులను హెచ్చరించామన్నారు.

తనిఖీ బృందాల పెంపు... ప్రమాదాల సంఖ్య పెరుగుతుండడంతో జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, ఎస్సార్‌నగర్, సికింద్రాబాద్, ఆబిడ్స్, కోఠి ప్రాంతాల్లో తనిఖీ బృందాలను పెంచారు. బైకులపై వస్తున్న యువకులు పోలీసులకు చిక్కకుండా పారిపోతున్నారని తెలుసుకుని రెండువైపులా కానిస్టేబుళ్లను ఉంచుతున్నారు. కొద్దినెలల క్రితం జూబ్లీహిల్స్‌లో ఓ ప్రమాదం చోటు చేసుకుంది. ఇందులో కారులో ఉన్న ఇద్దరు యువతులకు గాయాలయ్యాయి. పోలీసులు వారిని రక్షించిన అనంతరం వివరాలడిగారు. మద్యం మత్తులో వారు ఏమీ చెప్పలేని స్థితిలో ఉండడం గమనార్హం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అప్పటి నుంచి యువతులు, మహిళలపై దృష్టి కేంద్రీకరించారు. ప్రత్యేకంగా జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్టలో తనిఖీలు చేపడుతున్నారు.



తనిఖీలు



పోలీసుల కౌన్సెలింగ్

వాగ్వాదం చేస్తూ.. రాత్రివేళల్లో కారు నడుపుకొంటూ వస్తున్న మహిళలను పోలీసులు ఆపి డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేస్తున్నామని, పరీక్షలకు సహకరించాలని కోరితే కొందరు ఎదురుతిరుగుతున్నారు. శ్వాసపరీక్షలో బ్రీత్ అనలైజర్‌కు గాలి గట్టిగా ఊదమని చెబితే ససేమిరా అంటున్నారు.. . కొద్దిరోజుల క్రితం జీహెచ్ఎంసీలో విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా అధికారి మోతాదుకు మించి మద్యంతాగి వాహనం నడుపుకొంటూ ఇంటికి వెళ్తుండగా పోలీసులు ఆపారు. కారు దిగీదిగగానే ఆమె అధికారులతో గొడవకు దిగారు. ఇన్‌స్పెక్టర్ నచ్చజెప్పి శ్వాస పరీక్ష నిర్వహించగా రక్తంలో ఆల్కహాల్ శాతం 105 మి.గ్రా.లుగా తేలింది. దీంతో ఆమె వాహనాన్ని స్వాధీనం చేసుకుని మరో వాహనంలో క్షేమంగా ఇంటివద్ద దిగబెట్టి వచ్చారు. మరోరోజు ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న మహిళా డాక్టర్ మోతాదుకు మించి మద్యం తాగి బంజారాహిల్స్ పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీలకు చిక్కారు. శ్వాసపరీక్ష నిర్వహించగా 135 మి.గ్రాములు ఆల్కహాల్ ఉన్నట్లు తేలింది. ప్రతి 100మిల్లీమీటర్ల రక్తంలో మద్యం మోతాదు 30మిల్లీ గ్రాములకు మించకూడదు.

విద్యార్థి లోకం... సామాజిక హితం!



వీఎన్‌ఆర్ విజ్ఞానజ్యోతి విద్యార్థుల అవగాహన కార్యక్రమం

సేవలు.. అవగాహన కార్యక్రమాలు

ఈనాడు–హైదరాబాద్

పిల్లలకు చదువు ఒక్కటే కాదు నైతిక విలువల గురించి తెలపాలని. చుట్టూ ఉన్న సమాజం గురించి అవగాహన కల్పించాలని పెద్దలు ఊరకనే అన్లేదు. అటు ఇంట, ఇటు విద్యాలయాల్లో సామాజిక స్పృహ ప్రోది చేసిననాడు ఓ చక్కటి భావిభారతం సాకారమైనట్లే. నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పుస్తకాలకే పరిమితం కాకుండా ఇటీవల సమాజ సేవకూ అంకితమవుతున్నారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తున్నారు. పేదలకు ఆపన్నహస్తం అందిస్తున్నారు. దురలవాట్ల నిర్మూలనపై దండయాత్ర చేస్తున్నారు. హరితహారం వంటి కార్యక్రమాల్లో భాగమవుతున్నారు. మట్టి గణపతులను పూజించండి అంటూ తాము స్వయంగా తయారుచేయడమే గాక అందరికీ పంపిణీ చేస్తున్నారు.

వివిధ కార్యక్రమాలతో... 'మత్తుమందుల జోలికి వెళ్లకండి.. జీవితాలను నాశనం చేసుకోకండి' అంటూ ఇటీవల వీఎన్ ఆర్ విజ్ఞాన జ్యోతి ఇంజినీరింగ్ విద్యార్థులు నినదించారు. కేబీఆర్ పార్కు వద్ద ర్యాలీ నిర్వహించారు. ఇదే అంశంపై బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల విద్యార్థులు ఓ అవగాహన సదస్సు నిర్వహించారు. ఇక పాఠశాలల నుంచి డిగ్రీ వరకూ విద్యార్థులంతా ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం), ఎన్‌సీసీ, ఎన్‌జీసీ తదితరాల్లో ఏదో ఒక సంస్థతో కలిసి పని చేసిన వారే.. తామే కాదు తమతోపాటు మొక్కలూ ఎదగాలని కోరుకుంటూ హరితహారంలో భాగస్వామ్యమయ్యారు. మొక్కలు నాటి కాపాడేందుకు కృషి చేస్తున్నారు. అలానే పేద పిల్లలకు పాత పుస్తకాలతో పాటు, నోట్సులు పంచుతున్నారు. ఇందుకు పాఠశాలల్లోనే క్లబ్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. తాజాగా నాగార్జున పాఠశాల విద్యార్థులు బియ్యం, పప్పులు సేకరించి వైదేహి అనాథ ఆశ్రమం, నాదర్‌గుల్‌లోని మరో ఆశ్రమానికి శనివారం అందజేశారు. సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల విద్యార్థినులు దిల్‌సుఖ్‌నగర్‌లోని అనాథ శరణాలయంలో ఉన్న పిల్లలకు రాఖీలు కట్టి మీకు మేమున్నామంటూ మిఠాయిలు తినిపించారు. స్వచ్ఛభారత్‌లో రైల్వే, ఆర్టీసీ సిబ్బందితో పాటు విద్యార్థులూ భాగస్వామ్యమై పరిసరాలను శుభ్రంగా మారుస్తున్నారు. లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధుతో కలిసి విద్యార్థులు స్వచ్ఛభారత్‌లో పాల్గొన్నారు. ఇలా అవకాశమున్నప్పుడల్లా విద్యార్థులు ఈ తరహా కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతుండడం మంచి పరిణామమని విద్యావేత్తలు అంటున్నారు.



డ్రగ్స్ నిర్మూలనపై సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల విద్యార్థుల చైతన్యం

వందేళ్ల చరితం
ఎందరికో ఆశ్రయం

వేలాదిమందిని తీర్చిదిద్దిన రెడ్డి వసతి గృహం



సురవరం ప్రతాపరెడ్డి స్మారక గ్రంథాలయం

- విద్యార్థులకు అన్ని విధాలా అండ
- శతాబ్ది ఉత్సవాలకు అడుగులు

ఒకరు కాదు ఇద్దరు కాదు వేలాదిమంది పేద విద్యార్థులను, అనాథలను అమ్మలా అక్కున చేర్చుకున్న సముదాయమది. వారికి ఇంటి పెద్దలా దిశానిర్దేశం చేసి ముందుకు నడిపించింది. బతుకుపై భరోసా కల్పించింది. ఎదుగుదలలో మార్గదర్శిగా నిలిచింది.. ఎందరో జాతి రత్నాలను దేశానికి అందించింది.. కీలక ఘట్టాలకు సాక్షిగా నిలిచి భాగ్యనగరంలో తనకంటూ ఓ పేజీని లిఖించుకుంది. గత వందేళ్లుగా ఎందరికో వసతి అందిస్తూ కొనసాగుతున్న ఆ నిలయం ఆబిడ్స్‌లోని రెడ్డి వసతిగృహం. శతాబ్ది ఉత్సవాలకు సన్నద్ధమవుతున్న వేళ ఒక్కసారి అవలోకిస్తే..

ఈనాడు, హైదరాబాద్

అప్పట్లో హైదరాబాద్‌లో ఒకే ఒక హిందూ హోటల్ ఉండేది. అక్కడ భోజనం అంతగా బాగుండక విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. ఇదే విషయాన్ని రాజా బహదూర్ వెంకట్రామరెడ్డి(ఆర్‌బీవీఆర్‌ఆర్) ఓ శుభకార్యానికి హాజరైన రెడ్డి రాజులు, జమీందారులు, ధనికులు, ప్రముఖుల వద్ద ప్రస్తావించారు. ఎవరైనా బాధ్యత తీసుకుంటే సాయం చేసేందుకు సిద్ధమేనంటూ వారు ముందుకొచ్చారు. అప్పుడు వెంకట్రామరెడ్డే ముందుకొచ్చారు. అప్పటికప్పుడు రూ.80వేలు పోగయ్యాయి. 1918 జూన్ 13న ఓ అద్దె ఇంట్లో రెడ్డి వసతి గృహం ప్రారంభించగా తొలి ఏడాదే 54మంది విద్యార్థులు చేరారు. 1924లో ఆబిడ్స్‌లో 9వేల చదరపు గజాల స్థలాన్ని కొనుగోలు చేసి భవనాన్ని నిర్మించారు. ఇప్పటికీ అక్కడే కొనసాగుతోంది. ప్రస్తుతం బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, డిగ్రీ, ఎంబీబీఎస్, పాలిటెక్నిక్ తదితర కోర్సులకు చెందిన 500 మంది విద్యార్థులు ఇక్కడ వసతి పొందుతున్నారు.

ఎందరో..!

ఇంజినీరింగ్.. వైద్యం.. రాజకీయం..సాహిత్యం.. ఇలా ఏ రంగం తీసుకున్నా అందులో ఈ వసతి గృహంలో ఆశ్రయం పొంది ఎదిగినవారు కనిపిస్తుంటారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, విశ్రాంత న్యాయమూర్తి బీపీ జీవన్ రెడ్డి, ఉత్తర ప్రదేశ్ మాజీ గవర్నర్ బి.సత్యనారాయణ రెడ్డి, జైపాల్ రెడ్డి.. ఇలా ప్రముఖులే కాక పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు ఉన్నారు.

నిర్వహణ ఎలాగంటే

అసలే ఆబిడ్స్ వంటి ప్రధాన వాణిజ్య కేంద్రం. విద్యార్థుల సంఖ్య వందల్లోనే ఉంటుంది.. నిర్వహణ ఎలా అనేగా సందేహం? రెడ్డి హాస్టల్‌కు అనుబంధంగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ల నుంచి ప్రతి నెలా అద్దె రూపేణా రూ.12 లక్షల వరకు వస్తుంది. ప్రముఖులు ఇచ్చిన విరాళాల నుంచి వడ్డీ వస్తుంది. ఇక వసతిగృహానికి అనుబంధంగా నారాయణగూడ వైఎంసీఏలో బాలికల వసతిగృహం, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా విలియంకొండలో మోడల్ స్కూల్ ఉన్నాయి.

వేతనం తీసుకోరు


వసతి గృహాలు.. పాఠశాల.. కళాశాలను 14మందితో కూడిన ఆర్‌బీవీఆర్‌ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ పర్యవేక్షిస్తోంది. అంతా ఉన్నతోద్యోగాల్లో స్థిరపడిన వారే. రూపాయి జీతం కూడా తీసుకోరు. నాలుగేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు. 3వేల మంది సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు.

20 శాతం..!

వసతిగృహాల్లో రెడ్డి విద్యార్థులకు 80 శాతం, మిగిలిన వారికి 20 శాతం సీట్లు కేటాయిస్తారు. ఇక విలియం కొండలోని రెడ్డి మోడల్ పాఠశాలలో 600 మందికి పైగా వసతి పొందుతుండగా అందులో 130 మందే రెడ్డి విద్యార్థులు కావడం గమనార్హం.

ఏడాది పాటు..!

రెడ్డి వసతి గృహాన్ని ప్రారంభించి వచ్చే ఏడాదికి నూరేళ్లు పూర్తవుతుంది. ఈనెల 22 నుంచి శతాబ్ది ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఏడాది పాటు ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయి. మరింతమంది కోసం ఆబిడ్స్, నారాయణగూడలో కొత్త భవనాలను నిర్మిస్తారు.



పుస్తకాలు

క్రమశిక్షణతో మసలుతూ

క్రమశిక్షణ విజయంలో రాజీ పడరు. నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు తేలితే ఇంటికి పంపించేస్తారు. వచ్చే ఏడాది ప్రవేశం ఇవ్వరు. చదువొక్కటే కాదు విద్యార్థులకు అన్ని రంగాల్లో శిక్షణ ఇప్పిస్తారు. 10వేలకు పైగా పుస్తకాలతో కూడిన గ్రంథాలయం, ప్రత్యేక అధ్యయన గది, వ్యాయామశాల, టీవీ రూమ్, ఆడిటోరియం, బాస్కెట్ బాల్, క్రికెట్ మైదానం, సువిశాల భోజనశాల ఉన్నాయి. ఒక్కో గదిలో ఇద్దరు లేదా ముగ్గుర్ని మాత్రమే అనుమతిస్తారు. విలియం కొండ పాఠశాలలో పదో తరగతిలో ఏటా నూరు శాతం ఉత్తీర్ణత అదీ కూడా ప్రథమ శ్రేణిలోనే నమోదవుతోంది.

తల్లిదండ్రులు లేని లోటు తీర్చింది

– కరుణాకర్ రెడ్డి, కోదాడ



మాది కోదాడ. తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోయారు. పదో తరగతి వరకు ఎలాగోలా ఊర్లో చదువుకున్నా. నగరంలోని ఓ ప్రముఖ కళాశాలలో ఇంటర్ సీటు వచ్చింది. ఎక్కడుండాలో తెలియక ఆందోళనకు గురయ్యా. ఒకానొక దశలో చదువు మానేసి ఉద్యోగం చేద్దామనుకున్నా. తెలిసిన బంధువుల ద్వారా రెడ్డి వసతిగృహంలో 2009లో చేరా. డిగ్రీ వరకు అక్కడే ఉండి చదువుకున్నా. అంతా ఉచితమే. అమ్మ, నాన్న లేని లోటును తీర్చి బతుకుపై భరోసా కల్పించింది.

పదెకరాల్లో!

రాజేంద్రనగర్ మండలం బుద్వేల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌బీవీఆర్‌ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీకి 10 ఎకరాలు.. రూ.10 కోట్లను కేటాయించింది. అధునాతన హంగులతో విద్యా సంస్థలను ఏర్పాటుచేస్తారు. ఈనెల 22న సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేయనున్నారు. పాఠశాల, కళాశాల, వసతి గృహాలు, ఆడిటోరియం, క్రీడా మైదానం వంటివి ఏర్పాటు అవుతాయి.



వసతిగృహం బ్లాకులు

ప్రవేశ ప్రక్రియ భిన్నం...

వసతిగృహంలో ప్రవేశం కోసం ఏటా వేలాది దరఖాస్తులు వస్తాయి. వాటన్నింటిని పరిశీలించి ఓ జాబితాను రూపొందిస్తారు. అనంతరం కోర్సుల వారీగా ముఖాముఖి నిర్వహిస్తారు. తల్లిదండ్రులు కూడా హాజరు కావాలి. విద్యార్థి ప్రతిభ, ఇక్కడ ఉండేందుకు నిజంగా అర్హుడేనా అన్నది పరిశీలించి కమిటీ సభ్యులు ఎంపిక చేస్తారు. కొత్తవారైనా, పాతవారైనా ఏటా ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకుని ముఖాముఖికి హాజరు కావాల్సిందే. కేవలం చదువుకునే విద్యార్థులకే వసతిగృహంలో అవకాశమిస్తారు. విద్యార్థుల నుంచి ప్రతి నెలా నామమాత్రపు ఛార్జీలను వసూలు చేస్తారు. అనాథలు, నిరుపేద విద్యార్థులకు ఉచితం. అదే తల్లి లేదా తండ్రి చనిపోతే 50 శాతం ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. అర్హులైన విద్యార్థులకు ఏటా రూ.45 లక్షల వరకు ఉపకార వేతనాలు ఇస్తుంటారు. ఆబిడ్స్‌లోని వసతి గృహం ఆవరణలోనే ఎంబీఏ, ఎంసీఏ కళాశాల ఉంది.



ఎంబీఏ, ఎంసీఏ కళాశాల

వినూత్న కార్యక్రమాలు

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంచేందుకు ప్రముఖులతో స్ఫూర్తిదాయక ప్రసంగాలు.. చర్చాగోష్ఠులు నిర్వహిస్తారు. అందరినీ వనపర్తి హౌజ్, కాకతీయ హౌజ్, సురవరం ప్రతాప రెడ్డి హౌజ్, రామలింగారెడ్డి హౌజ్, కొండా వెంకటరంగారెడ్డి హౌజ్, రావి నారాయణ రెడ్డి హౌజ్ అంటూ ప్రత్యేక జట్లుగా విభజిస్తారు. ఏటా 'ఉష' పేరిట ప్రత్యేక సంచికను విద్యార్థులే స్వయంగా తీసుకొస్తారు. ఆ ఏడాదిలో హాస్టల్‌లో జరిగిన ప్రధాన సంఘటనలు, కవితలు, వ్యాసాలు అందులో ఉంటాయి. ఆర్‌బీవీఆర్‌ఆర్ జ్ఞాపకార్థం ఏటా పలువురికి పురస్కారాలను అందజేస్తారు. ఆయన పుట్టిన రోజున విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన సీఐలను ఎంపిక చేసి నగదుతో పాటు బంగారు పతకాన్ని అందజేస్తారు. జాతీయ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో విశిష్ట సేవలందించిన వ్యక్తికి రూ.50వేల నగదుతో పాటు రాజా బహదూర్ వెంకట రామారెడ్డి అవార్డును అందజేస్తారు. ఈసారి పద్మభూషణ్ డా. కె. ఈశ్వర వర ప్రసాద్ రెడ్డికి బహూకరించాలని నిర్ణయించారు.

మరింతమంది విద్యార్థులకు వసతి



అందరికీ గుర్తుండిపోయేలా రెడ్డి హాస్టల్ శతాబ్ది ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించాం. మన దేశంతో పాటు విదేశాల్లో ఉన్న పూర్వ విద్యార్థులను భాగస్వామ్యం చేస్తాం. ఈ విషయంలో ప్రభుత్వ సహకారం మరువలేనిది. మేం అడగ్గానే స్థలం, నిధులను ముఖ్యమంత్రి కేసీఆర్ కేటాయించారు. మరింత మంది విద్యార్థులకు వసతి కల్పించాలన్నదే మా లక్ష్యం.

– డా. రఘుపతి రెడ్డి, అధ్యక్షులు, ఆర్‌బీవీఆర్‌ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ



జూలోని మొసళ్ల కేంద్రం

మారాం చేస్తాయి.. మైమరిపిస్తాయి

చార్మినార్, న్యూస్‌టుడే

మొసళ్ల పేరు చెప్పగానే కొందరికి ఒళ్లు జలదరిస్తుంది. కాని వాటి చేష్టలు మాత్రం చూడాలనిపిస్తాయి. నగరంలోని నెహ్రూ జూపార్కుకు వెళ్లే సందర్శకులు పెద్ద సంఖ్యలో ఉన్న వీటిని చూసి ముచ్చటపడుతుంటారు. ఒకటా రెండా ఇక్కడ దాదాపు 90 వరకు ఉన్నాయి. మగర్, గరియల్, సాల్ట్‌వాటర్, కైమన్(ఆప్టికల్) రకానికి చెందినవి కనిపిస్తాయి. వీటి సహజ చేష్టలను తిలకించేలా ప్రస్తుతం ఎన్‌క్లోజర్ల ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దాదాపు రూ.20లక్షలతో మొసళ్ల మోటులను అభివృద్ధి చేస్తుండడం విశేషం.

వాటి బలం తెలుసా.. నీటిలో గున్న ఏనుగులను సైతం లాక్కెళ్లే శక్తి మొసళ్లకు ఉంటుంది. దాదాపు 60-70 ఏళ్ల వరకు జీవిస్తాయి. వంద కిలోల బరువు, 7 నుంచి 10 అడుగుల పొడవు ఉంటాయి. ఆడ మొసళ్లు పన్నెండో యేట గుడ్లు పెట్టే దశకు చేరుకుంటాయి. వేసవిలో ఇవి గుడ్లు పెట్టి అవి కన్పించకుండా ఇసుకతో కప్పి వేస్తాయి. సాధారణంగా చేపలు, మాంసం ముక్కలు వంటివి తింటుంటాయి. మొసళ్ల ఎన్‌క్లోజరులో మధ్యలో నీరు, చుట్టూ ఇసుకదిమ్మె మాదిరి నిర్మాణం.. దీనికి మరో వరసలో నీరు ఉండేలా ఏర్పాట్లు ఉంటాయి. జూలో ఒక్క మగర్ జాతికి చెందిన మొసళ్లే 80కి పైగా ఉన్నాయి. వీటిలో 32 మగవి, మరో 18 ఆడవి. మిగతావన్నీ పిల్లలు. మగర్ మొసళ్ల ఎన్‌క్లోజర్ పక్కన గరియల్ రకం మొసళ్ల ఎన్‌క్లోజరు రూపుదిద్దుకుంటుంది. జూలో ఇవి అరడజను మాత్రమే ఉన్నాయి. అందులో అయిదు ఆడ, ఒకటి మగ.. కొత్తగా జతలను సమకూర్చడానికి అధికారులు సన్నాహాలు పూర్తి చేశారు. గరియల్ పక్కనే సాల్ట్‌వాటర్ మొసళ్ల ఎన్‌క్లోజరు ఉంటుంది. ఈ రకం మొసలి ఒకటే ఉంది. కోల్‌కతా నుంచి మరొకటి తెప్పిస్తున్నారు. జూలోని అటర్(నీటికుక్కల)కు సమీపంలో కైమన్(ఆప్టికల్) రకం మొసళ్లు జత ఉన్నాయి. కళ్లకు అద్దాలు పెట్టుకున్నాయా అన్నట్లుగా ఇవి కనిపిస్తుంటాయి.

సంతానోత్పత్తి కేంద్రం... ఈ జూలో 1978లో తొలిసారి మొసళ్ల సంతానోత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పారు. పర్యవేక్షణ బాధ్యతలు చూసిన బి.సి. చౌదరి తెలుగురాష్ట్రాల్లోని మొసళ్లతోపాటు గుజరాత్, హరియాణ, దిల్లీ నుంచి మగర్ జాతివి ఇక్కడకు తెప్పించి వాటి సంతతి పెరిగేలా చూశారు. గౌతమ్ కూడా నాలుగేళ్ల ప్రాయంలో దిల్లీ నుంచి వచ్చిందే. గుడ్ల నుంచి పిల్లలు రాగానే గతంలో దేశంలోని నదుల్లో వదిలేవారు. నదుల్లో కాలుష్య నివారణలో ఇవి తమవంతు పాత్ర నిర్వహిస్తాయి.

పిలిస్తే వచ్చేస్తుంది



గౌతమ్

జూలో నలభై రెండేళ్ల మగ మొసలి 'గౌతమ్' ఇక్కడి కీపరు ఎస్. దేవేందర్ ఆజ్ఞను చక్కగా పాటిస్తుంది. పేరు పెట్టి పిలవగానే తోక ఆడిస్తూ మంద నుంచి వచ్చేస్తుంది. 'మూ ఖోల్' అంటే నోరు తెరుస్తుంది.. చేపలు, మాంసం ముక్కలు పెట్టగానే ఆరగిస్తుంది. జూలో అకౌంటెంట్‌గా విధులు నిర్వహించిన గాయత్రి జంతువుల దత్తత పథకం కింద దీనిని ఆరేళ్ల క్రితం దత్తత తీసుకుని ఆహారం, పోషణ నిమిత్తం రూ.10వేలు అందించారు. 'గౌతమ్'గా పేరు పెట్టారు. నాలుగేళ్ల క్రితం మొసళ్ల మధ్య జరిగిన పోట్లాటలో రెండు కాళ్లకు దెబ్బతగిలి చచ్చుపడగా జూ వెటర్నరీ సహాయ సంచాలకులు ఎం.ఎ.హకీం చికిత్స అందించి నయం చేశారు. కాగా ఏ మొసలైనా తోక నిక్కచ్చిగా నిలబడేలా ఉంటే ఆరోగ్యంగా ఉన్నట్లని, తోక పడిపోయిన రీతిలో పాలిపోయి ఉంటే అనారోగ్యంతో ఉన్నట్లు గుర్తిస్తామని సిబ్బంది చెబుతున్నారు.



పత్రాలు లేకుండా.. కాయలేమో నిండా!

ఎక్కడా చూద్దామన్నా ఆకులు లేవు. ఓ మోడులా కనిపిస్తోంది. అయినా నిండా కాయలే. నగరంలోని శిల్పకళా వేదికలో ఓ చెట్టు ఇలా ఆకట్టుకుంటోంది.

వైరం మరచి... స్నేహం పంచి....



కోఠి మహిళా కళాశాల సమీపంలో ఓ కుక్క కోతి పిల్లను తన వీపుపై మోస్తూ తరచూ కనిపిస్తోంది.
–యామిక్కి శ్రీకాంత్, దౌల్తాబాద్, వికారాబాద్



నిజాంపేట బండారి లేఅవుట్‌లో ఓ కోతి నిత్యం ఒక పందిపై కూర్చొని తిరుగుతూ కనిపిస్తోంది.
–చింటూ ప్రెట్టీ, నిజాంపేట బండారి లేఅవుట్

సుందరీకరించరూ...



మురికి నాలా కాదు సుమా... నిత్యం ఎంతోమంది సందర్శించే సఫిల్‌గూడ మినీ ట్యాంకు బండ్ ఇది. దీనికి మంచి రోజులు ఎప్పుడో? –సూర్యమూర్తి, సఫిల్‌గూడ



ఎల్లమ్మ తల్లి ఆలయంలో మేయర్ రామ్మోహన్ దంపతులు

ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న మేయర్ దంపతులు

సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: గ్రేటర్ హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్ దంపతులు ఆదివారం బల్కంపేట ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నారు. దేవస్థానం పాలకమండలి సభ్యులు బి.ఆర్. నారాయణరాజు, తెరాస నాయకులు కొలను బాల్‌రెడ్డి తదితరులు మేయర్ దంపతులను అమ్మవారి మూలవిరాట్ వద్దకు తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం నల్లపోచమ్మ, నాగదేవత, అద్దాల మండపాన్ని కూడా వారు దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వారికి తీర్థప్రసాదాలను అందజేశారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం

హైదరాబాద్: వెనుకబడిన తరగతుల విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఆర్థిక సహాయం చేయనున్నట్లు ఏలూరి ఫ్యామిలీ ట్రస్టు ఫర్ ఎడ్యుకేషన్ ఆఫ్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ నిర్వాహకులు రత్నాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆబిడ్స్ తిలక్‌రోడ్డులోని ట్రస్టు కార్యాలయంలో సెప్టెంబరు 15లోపు దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 040 24758011లో సంప్రదించాలన్నారు.

నీరు... వృథా తీరు...



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో వృథాగా పోతున్న నీరు. రైళ్లలోకి నీరు ఎక్కించేందుకు పైపులను నిర్లక్ష్యంగా పెట్టి వదిలేస్తున్నారు. –జీవన్‌కుమార్, చింతలకుంట చెక్‌పోస్టు

పడరా మరి!

కొత్తగా రహదారులు వేస్తున్నారు బాగానే ఉంది. కానీ చివరి లైన్ వదిలేస్తున్నారు. దీనివల్ల వర్షాకాలంలో ద్విచక్ర వాహన చోదకులు పడిపోయే ప్రమాదం ఉంది. విజయవాడ జాతీయ రహదారిపై పెద్ద అంబర్‌పేట వద్ద రోడ్డు వేయకుండా వదిలేసిన చివరి లైన్ ఇది. –సాయికిరణ్, అబ్దుల్లాపూర్‌మెట్



పౌర పాత్రికేయం

వాట్సాప్ నంబరు: 8008001763

మీ చేతిలో సెల్‌ఫోన్ ఉందా? ఎక్కువ మందిని ప్రభావితం చేస్తున్న అంశాలను, విభిన్నమైన చిత్రాలను క్లిక్ మనిపించారా? వాటిని మీరూ 'ఈనాడు'కు పంపొచ్చు.

ఇలా అయితే జారి పడరా?



మైత్రీవనం-యూసఫ్‌గూడ మధ్య మెట్రో డివైడర్లను నిర్మిస్తున్నారు. వాటి మధ్యలో మొక్కలు పెంచితే ఆ నీరు పోయేందుకు పైపుల్ని రోడ్డుపైకి ఏర్పాటు చేస్తున్నారు. ద్విచక్ర వాహన చోదకులు జారి పడే ప్రమాదం ఉంది. -వీకే రాజు, సిద్దార్థ నగర్

గచ్చిబౌలి బస్‌స్టాప్ ఇది. ఇక్కడ బస్సుల మాట దేవుడెరుగు. ఆటోలదే అడ్డా. వాటి డ్రైవర్లదే ఇష్టారాజ్యం. -మహ్మద్, గచ్చిబౌలి





పీవీ ఎక్స్‌ప్రెస్ వే పైనుంచి ఆరాంఘర్ వైపు వెళుతున్న వాహనం పిల్లర్ నెంబరు 84-85 మధ్య ఆగిపోవడంతో, ఎక్స్‌ప్రెస్ వే పై కొద్ది సేపు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. లంగర్ హౌస్ పోలీసులు అక్కడికి చేరుకుని ఆ వాహనాన్ని పక్కకు తప్పించారు.
–న్యూస్‌టుడే, మెహిదీపట్నం

పేదల ప్రయోజనాలు పరిరక్షించేందుకు కృషి: ఎంపీ కేకే

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: పేద ప్రజల ప్రయోజనాలను పరిరక్షించేందుకు తెరాస ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఎంపీ (రాజ్యసభ) కె.కేశవరావు అన్నారు. బంజారాహిల్స్ డివిజన్‌లోని రూ.వందల కోట్ల విలువైన 15 ఎకరాల భూమిపై, రాష్ట్ర ప్రభుత్వానికి, ఇతరులకు మధ్య ఉన్న వివాదం పరిష్కారమై ఆ భూమి ప్రభుత్వానికే చెందుతుందని తేలడంతో ఆయా బస్తీల ప్రజలు ఆదివారం ఎంపీ కేకేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మూడు దశాబ్దాలుగా ఈ స్థలం వివాదం ప్రభుత్వానికి, ఇతరులకు నడుమ న్యాయస్థానంలో నడుస్తోంది. ఈ ప్రాంతంలో నివసిస్తున్న స్థానికులు, తమ నివాసాల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు పెట్టుకున్నా న్యాయపరమైన చిక్కులు వచ్చేవి. ఈ నేపథ్యంలో 2015లో ఎన్‌బీటీనగర్ బస్తీకి వచ్చిన సీఎం కేసీఆర్‌కు స్థానికులు ఈ విషయం వివరించారు. అప్పటి నుంచి ప్రభుత్వ ప్రతినిధులు న్యాయస్థానంలో ప్రభుత్వం తరపున గట్టిగా వాదనలు వినిపించారు. తీర్పు ప్రభుత్వ పక్షాన వచ్చినట్లు తెలియడంతో స్థానికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గద్వాల్ విజయలక్ష్మీ మాట్లాడుతూ, గత ప్రభుత్వాలు నెరవేర్చలేని పనిని, తెరాస ప్రభుత్వం చేసి చూపించిదని చెప్పారు. కృతజ్ఞతలు తెలిపిన వారిలో తెరాస నేతలు సీహెచ్ రవికుమార్, శ్రీనివాసగౌడ్, సుభాష్, రణవీర్, రాజు, పెద్దసంఖ్యలో బస్తీ ప్రజలు ఉన్నారు.



ఎంపీ కేకేను కలిసిన బంజారాహిల్స్ బస్తీల ప్రజలు

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

భాజపా నేతలు బండారు దత్తాత్రేయ, లక్ష్మణ్, కిషన్‌రెడ్డి డిమాండ్

గన్‌ఫౌండ్రీ, న్యూస్‌టుడే: ఉద్యమ సమయంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండు చేసిన తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోకపోవడం తగదని కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ మేరకు భాజపా నగర పదాధికారులు, కన్వీనర్ల సమావేశాన్ని ఆదివారం పార్టీ నగర కార్యాలయంలో నిర్వహించారు. పార్టీ నగర అధ్యక్షుడు, శాసనమండలి పక్షనేత ఎన్.రాంచందర్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ సెప్టెంబరు 17ను అధికారికంగా నిర్వహించాలన్నారు. సమరయోధుల త్యాగాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలన్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కె.లక్ష్మణ్ మాట్లాడుతూ తెరాస ప్రభుత్వం మాటల గారడీతో ప్రజలను మోసం చేస్తుందన్నారు. మజ్లిస్ పార్టీకి భయపడి విమోచన దినోత్సవాన్ని నిర్వహించడంలేదని ఆరోపించారు. ఎమ్మెల్సీ రాంచందర్‌రావు మాట్లాడుతూ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దుతామన్న తెరాస ప్రభుత్వం కనీసం రోడ్లను పట్టించుకోవడం లేదన్నారు. భాజపా శాసనసభా పక్షనేత కిషన్‌రెడ్డి, నగర పార్టీ ఇన్‌ఛార్జి పి.రాజేశ్వర్‌రావు, జాతీయ బాలకార్మిక సలహా మండలి వైస్ ఛైర్మన్ బి.వెంకట్‌రెడ్డి, వెంకటరమణి, టి.రాజశేఖర్‌రెడ్డి, ఆలె జితేంద్ర, రామన్‌గౌడ్, గౌతంరావు, కన్నెర మేష్, భవర్‌లాల్‌వర్మ, ఆశారాంసోహిణి పాల్గొన్నారు.



సమావేశంలో దత్తాత్రేయ, లక్ష్మణ్, కిషన్‌రెడ్డి తదితరులు

కొలువు వద్దంటే కుదరదు!



నగరశివారులోని ఓ కళాశాలలో బీటెక్ చివరి ఏడాది చదువుతుండగా ప్రైవేటు సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో నేను ఎంపికయ్యాను. చదువు పూర్తి అవ్వగానే ఉద్యోగంలో చేరతానని ఒప్పంద పత్రంపై సంతకం చేశాను. ఎంటెక్‌కు సంబంధించి రూర్కీ యూనివర్సిటీ ప్రవేశపరీక్షలో మంచిర్యాంకు వచ్చింది. నేను చదువుకోవడానికి వెళతానంటే ఆ కంపెనీ బెదిరిస్తోంది. రూ.2లక్షలు కట్టాలని ఒత్తిడి చేస్తోంది. -రమేశ్, దిల్‌సుఖ్‌నగర్

కోఠిలోని ఓ కళాశాలలో బీఎస్సీ చివరి ఏడాది చదువుతుండగా ఓ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో అర్హతసాధించా. ఒప్పంద పత్రంపై సంతకం చేశాను. ఆ తర్వాత మరొక మంచి కంపెనీలో అత్యధిక వేతనంతో కొలువు వచ్చింది. తొలికంపెనీ నాకు లీగల్ నోటీసు పంపించింది. రూ.లక్ష కట్టకపోతే కేసు వేస్తామని బెదిరిస్తోంది.

- అలేఖ్య, కొత్తపేట

ఈనాడు, హైదరాబాద్

ఒప్పంద పత్రాలను సాకుగా చూపించి పలు కంపెనీలు విద్యార్థులను బెదిరించి సొమ్ము చేసుకుంటున్నాయి. నగరంలో పలు కళాశాలల్లో కొన్ని కంపెనీలు ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నాయి. ఎంపికైన అభ్యర్థులతో పలు పత్రాలపై ఆయా సంస్థల ప్రతినిధులు సంతకాలు చేయించేసుకుంటున్నారు. కొలువు దక్కిందన్న ఆనందంలో విద్యార్థులు వాటిల్లోని విషయాలను చదవకుండానే సంతకాలు చేసేస్తున్నారు. ఏదైనా కారణంతో కొలువులో చేరట్లేదని ఆయా సంస్థలకు సమాచారం అందిస్తే.. అప్పటినుంచి అభ్యర్థులకు వాటినుంచి బెదిరింపులు ప్రారంభమవుతున్నాయి. ఒప్పంద పత్రాన్ని అడ్డుగా పెట్టుకొని ఆయా కంపెనీలు సొమ్ము చేసుకుంటున్నాయి. రూ. లక్ష నుంచి రూ. 5 లక్షల వరకు కట్టాలంటూ పలు కంపెనీలు ఒత్తిడి చేసి వసూలు చేస్తున్నాయి. మరికొన్ని కంపెనీలైతే న్యాయవాదులతో నోటీసులు పంపిస్తున్నాయి. నగరంలో చాలామంది విద్యార్థులు యూజీ, పీజీలు పూర్తి చేసిన వెంటనే ఆయా కంపెనీల ఒప్పందాల ఉచ్చులో పడుతున్నారు. ఏటా ఈ తరహా చిక్కులతో వందల సంఖ్యలో అభ్యర్థులు సతమతమవుతున్నట్లు సమాచారం. కొందరు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. అయితే, ఒప్పందపత్రాలపై అభ్యర్థులు సంతకాలు చేసిన నేపథ్యంలో తాము సాయం చేయలేమంటూ వారు చేతులెత్తేస్తున్నారు. కాగా కొలువు ఇవ్వడంలో పలు కంపెనీలు తీవ్రజాప్యం చేస్తున్నా



అభ్యర్థులు వేచిచూడటం తప్ప ఏమీ చేయలేని పరిస్థితి ఉంది. నగరంలో వందలాది అభ్యర్థులకు ఇలాంటి చేదు అనుభవం ఎదురవుతున్నా మౌనంగానే ఉండిపోతున్నారు. గ్రేటర్ పరిధిలోని ఏటా పలువురు అభ్యర్థులు న్యాయపరమైన చిక్కులను ఎదుర్కొంటున్నట్లు ఓ పోలీసు అధికారి తెలిపారు. ఒప్పందపత్రాల్లో ఏముందో చదవకుండా సంతకం చేశానంటే న్యాయస్థానాలు నమ్మవనే విషయాన్ని అభ్యర్థులు గుర్తుంచుకోవాలన్నారు.

కొలువు నచ్చలేదన్నా ఇబ్బందులే..

ఉద్యోగంలో చేరిన కొద్ది రోజుల్లోనే పని నచ్చకపోయినా, పనివేళలు ఇబ్బందులు కలిగిస్తున్నా, ఆరోగ్య సమస్యలు తలెత్తి కొలువులు వదులుకొనే అభ్యర్థులకు ఇబ్బందులు తప్పట్లేదు. ఉద్యోగంలో చేరేటప్పుడు ఒప్పంద పత్రాలపై సంతకం చేసిన కారణంగా వాటిని అడ్డం పెట్టుకొని పలు కంపెనీలు అభ్యర్థులను బెదిరిస్తున్నాయి. అప్పటికే చేసిన పనికాలానికి జీతాలను ఉంచేసుకుంటున్నాయి. ఇతర కంపెనీల్లో ఉద్యోగాలకు వెళ్లేందుకు అనుభవ ధ్రువపత్రాలను ఇచ్చేందుకు నిరాకరిస్తున్నాయి. ఇలాంటి పలు ఇబ్బందులను నగరంలో అభ్యర్థులు తరచూ ఎదుర్కొంటున్నారు. పాత సంస్థలో విద్యార్థులు చేరకముందే మంచి వేతనంతో మరొక సంస్థలో కొలువు వచ్చినా వెళ్లలేని పరిస్థితి కొందరికి ఎదురవుతోంది.

క్షుణ్ణంగా పరిశీలించాలి..

ఏదైనా సంస్థలు నిర్వహించే ఇంటర్వ్యూల్లో ఎంపికైన వెంటనే ఒప్పంద పత్రాలపై అభ్యర్థులతో సంతకాలు చేయించుకుంటున్నాయి. ఉద్యోగం వచ్చిందన్న ఆనందంలో ఆయా పత్రాలను ఏమీ చదవకుండానే వాటిపై సంతకాలు చేసేస్తున్నారు. ఏదైనా కారణంతో అభ్యర్థులు చేరకపోతే ఇబ్బందులు తప్పట్లేదు. ఇలాంటి పలు సంఘటనలు నగరంలో తరచూ చోటుచేసుకుంటున్నాయని, వీటిపై ఫిర్యాదులు వస్తున్నాయని పోలీసు అధికారులు వివరిస్తున్నారు. ఒప్పంద పత్రాలను పూర్తిగా చదువుకొని సంతకాలు పెట్టాలని వారు సూచిస్తున్నారు.

150 మందికి కొలువులే ఇవ్వలేదు..

నగరంలోని కోఠి సమీపంలోని ఒక కళాశాలలో సుమారు 500 మందిని ఆయా కంపెనీలు గత ఏడాది ఎంపిక చేసుకున్నాయి. వీటిల్లో సుమారు 350మందికే కొలువులు ఇచ్చాయి. మిగతా 150మంది చాలా నెలలపాటు ఆయా సంస్థల చుట్టూ తిరిగినా ప్రయోజనం చేకూరలేదు. కొలువు ఇవ్వట్లేదని ఆయా సంస్థల వద్దకు వెళ్లితే సంబంధిత అధికారులు ముఖం చాటేస్తున్నారని పలువురు అభ్యర్థులు వివరిస్తున్నారు. నగరంలో ఇలాంటి పలు సంఘటనలు వేలాది మంది విద్యార్థులకు ఎదురవుతున్నట్లు విద్యారంగ నిపుణులు వివరిస్తున్నారు. ఇలాంటి సంఘటనలపై ఆయా సంస్థలను కళాశాలల ప్రతినిధులు స్పందించట్లేదు. మళ్లీ ఆ సంస్థలు తమ కళాశాలలకు రారనే కారణంతో కళాశాలల యాజమాన్యాలు మౌనం ప్రదర్శిస్తున్నాయి.

అభ్యర్థులకు న్యాయం చేయాలి..

–ఎన్.విజయ్, పీజీ విద్యార్థి, ఓయూ



కొలువు వచ్చిందన్న ఆనందంలో నిరుద్యోగులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేస్తున్నారు. వీటిని అడ్డు పెట్టుకొని కొన్ని సంస్థలు చేస్తున్న దోపిడీని అడ్డుకోవాలి. అభ్యర్థుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోవాలి.

కళాశాలల్లోనే అవగాహన కల్పించాలి..

–శ్రీరామ్, న్యాయ విద్యార్థి, ఓయూ



యూజీ, పీజీ కోర్సులు పూర్తి అయ్యేముందే అభ్యర్థులకు ఒప్పంద పత్రాలతో వచ్చే చిక్కులపై కళాశాలల్లోనే అవగాహన కల్పించాలి. కంపెనీల ఉచ్చులో పడకుండా ఉండేందుకు, ఒకవేళ ఇబ్బందులు వస్తే వాటిని ఎలా ఎదుర్కొనాలో న్యాయనిపుణులతో సదస్సులు ఏర్పాటు చేయిస్తే బాగుంటుంది.

కేటీఆర్ సభకు భారీ ఏర్పాట్లు

బతుకమ్మలతో మహిళల ప్రదర్శన



నర్సాపూర్ చౌరస్తాలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అధికారులు

బాలానగర్, న్యూస్‌టుడే: బాలానగర్ వంతెన నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన జరగనుంది. రూ.105కోట్లతో నిర్మించతలపెట్టిన ఈ వంతెన పనులను మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా ప్రారంభించనున్నారు. సాయంత్రం 3గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నర్సాపూర్ చౌరస్తాలో సభా ప్రాంగణ ఏర్పాట్లను ఆదివారం హుడా, గ్రేటర్ సర్కిల్ అధికారులు పర్యవేక్షించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ మల్లారెడ్డి తదితరులు పాల్గొంటారన్నారు. కేటీఆర్ సభకు భారీగా జనసమీకరణ చేస్తున్న నేపథ్యంలో తెలంగాణ సంప్రదాయాలను కూడా ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం బతుకమ్మలతో మహిళలు ప్రదర్శన నిర్వహించారు. కార్పొరేటర్లు కాండూరి నరేందర్‌ఆచార్య, పండాల సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

భారీగా తరలిరావాలి: పన్నాల

కూకట్‌పల్లి: కేటీఆర్ సభకు డివిజన్‌నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని కార్పొరేటర్ పన్నాల కావ్యారెడ్డి కోరారు. ఆదివారం బాలాజీనగర్ డివిజన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డివిజన్ కార్యాలయంనుంచి మధ్యాహ్నం 12.30గంటలకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

'పచ్చదనం, పరిశుభ్రతపై బోధిస్తున్నాం'



ఇందిరాపార్కులో మొక్క నాటిన తెలంగాణ రాష్ట్ర స్కౌట్స్, గైడ్స్

కవాడిగూడ, న్యూస్‌టుడే : పచ్చదనం, పరిశుభ్రత, సేవానిరతి, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ తదితర అంశాలపై విద్యార్థులకు బోధిస్తున్నామని అసోం నుంచి వచ్చిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ దక్షిణాది రాష్ట్రాల సహాయ సంచాలకుడు అరుణ్ చంద్ర పాతక్ అన్నారు. ఆదివారం ఇందిరాపార్కులో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ దక్షిణాది రాష్ట్రాల ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి వచ్చిన స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులు వేప, రావి, అల్లనేరేడు, సిరిగంధం, జామ, గుల్‌మోహర్, ఈత, తాటి తదితర చెట్ల గురించి ఉద్యాన నిపుణుడు శ్రీనివాస్ విద్యార్థులకు వివరించారు. ఉద్యాన అధికారి రమేశ్ సహకారంతో పార్కులో తెలంగాణ, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల వారీగా విద్యార్థులు మొక్కలు నాటారు. ఆయా రాష్ట్రాల చిహ్నాలను మొక్కల ముందుంచారు. ఈ సందర్భంగా అరుణ్ చంద్ర పాతక్ మాట్లాడుతూ బాలురకు స్కౌట్స్, బాలికలకు గైడ్స్ శిక్షణ ఇస్తామన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ 150వ జయంతికల్లా దేశమంతా స్వచ్ఛంగా ఉండాలనే భారత ప్రభుత్వ నిర్ణయించిందని, అందుకు స్కౌట్స్, గైడ్స్ తమ వంతు కృషిచేస్తోందన్నారు. అందులో భాగంగానే శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ పదాధికారులు పరమేశ్వర్, జాన్ సామ్యుల్, లక్ష్మినారాయణ, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





దత్తన్నా.. విన్నపాల మాల స్వీకరించరూ!

ఆదివారం కేంద్ర మంత్రి దత్తాత్రేయను కలిసేందుకు ఆయన ఇంటికి నగరంతో పాటు వివిధ ప్రాంతాలనుంచి జనం తరలివచ్చారు. తమతమ వినతులను సమర్పించుకున్నారు.

ఆలోచన గొప్పగా... ఆచరణ చప్పగా!

- ☛ అటకెక్కిన జీపీఎస్ నిఘా ప్రాజెక్టు
- ☛ ఉత్తర్వులు వచ్చినా అమలు కాని వైనం

ఈనాడు, హైదరాబాద్

గ్రేటర్‌లో రవాణా వాహనాలపై నిఘాకు సంబంధించి గతంలో ఉత్తర్వులు ఇచ్చినా అమలుకు నోచుకోలేదు. నగరానికి వచ్చే పర్యాటకలు, సందర్శకులు, కొత్తవారికి భరోసా కల్పిస్తూ క్యాబ్‌లు, ఆటోలు ఇతర ప్రజా రవాణా వాహనాల్లో భద్రతకు పెట్టపీట వేయాలనేది యోచన. ఇందులో భాగంగా గ్రేటర్‌లో ప్రతి వాహనానికి గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్(జీపీఎస్) విధానం తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వం రవాణా శాఖ మంత్రి ఆధ్వర్యంలో ఒక అధికారిక బృందాన్ని ముంబయికి పంపింది. అక్కడ పోలీసులు, రవాణా శాఖ అధికారులతో సమావేశమయ్యారు. క్యాబ్‌లు, వాహనాల్లో అమలు చేస్తున్న జీపీఎస్ విధానాన్ని పరిశీలించారు. మంచి ఫలితాలు ఇస్తుండటంతో గ్రేటర్ హైదరాబాద్‌లోనూ ఇదే విధానం చేయాలని ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ నేపథ్యంలో ప్రతి వాహనానికీ జీపీఎస్ తప్పనిసరి చేస్తూ నిర్ణయించారు. తొలుత క్యాబ్‌ల్లో అందుబాటులోకి తెచ్చాక మిగతా అన్ని రవాణా వాహనాలకూ తప్పనిసరి చేయాలని నిర్ణయించారు. గతంలో నగరంలో అభయ సంఘటన తర్వాత క్యాబ్‌లు, ఆటోలపై ప్రత్యేక నిఘా పెట్టాలని భావించారు. ఇది ప్రకటనలకే పరిమితమైంది. ఇంతవరకు ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఇటీవలి ఉప్పల్ ఓ క్యాబ్ డ్రైవర్ కిడ్నాప్ చేసిన ఉదంతంతో మరోసారి భద్రత వైఫల్యాలు వెలుగులోకి వచ్చాయి. జీపీఎస్ నిఘా తప్పనిసరి అనే డిమాండ్ మరోసారి తెరపైకి వచ్చింది.



భద్రతకు భరోసా ఇవ్వాలని...

ప్రస్తుతం నగరంలో తిరుగుతున్న కొన్ని క్యాబ్‌లకు, ఆటోలపై ఎలాంటి పర్యవేక్షణ లేదు. ముఖ్యంగా మహిళా ప్రయాణికుల భద్రత గాలిలో దీపంలా మారుతోంది. క్యాబ్ డ్రైవర్లు మహిళలతో అనుచితంగా ప్రవరిస్తున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. కొందరు ఆటో డ్రైవర్లది అదేదారి. ప్రయాణికుల పట్ల అనుచితంగా ప్రవర్తించడం... లైంగిక వేధింపులకు గురిచేయడం లాంటి కేసులు వివిధ పోలీసు స్టేషన్లలో నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి వాహనానికీ జీపీఎస్ పెట్టి దానిన్ని పోలీసు కంట్రోల్ రూంకు అనుసంధానించాలని అధికారులు నిర్ణయించారు. ప్రతి క్యాబ్/ఆటోపై పోలీసుల ప్రత్యక్ష నిఘా ఉంటుందని భావించారు. అనుకోని సంఘటన ఎదురైనప్పుడ వాహనం ఎక్కడ ఉందో ఈ జీపీఎస్‌తో ఇట్టే కనిపెట్టవచ్చు. ప్రయాణికులతో డ్రైవర్లు అనుచితంగా ప్రవర్తించినా, వాహనానికి ఏదైనా ప్రమాదం సంభవించినా... పరికరంలో ఉన్న పానిక్ బటన్ నొక్కితే చాలు... కంట్రోల్ రూంకు సంక్షిప్త సందేశం రూపంలో సమాచారం వెళుతుంది. బండి నంబరు, ప్రాంతం ఇట్టే తెలుస్తాయి. వెంటనే సమీప ప్రాంతంలోని పోలీసులను అప్రమత్తం చేసి రంగంలోకి దించే అవకాశం ఉంది. నగరంలోని ప్రతి ఆటో, క్యాబ్‌ను ట్రాక్ చేయడమంటే మాటలు కాదు. ఇందుకు పోలీసు కంట్రోల్ రూంలో భారీ స్థాయిలో కంప్యూటర్ తెరను ఏర్పాటు చేయాలనేది యోచన. దీనిని 24 గంటలపాటు పర్యవేక్షించడానికి ప్రత్యేక సిబ్బందిని నియమించనున్నారు.

ఏదీ ఎక్కడ?

గ్రేటర్‌లో దాదాపు 1.60 లక్షల వరకు ఆటోలు, 70 వేల వరకు క్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇవి కాకుండా 2,000 పాఠశాల బస్సులు, 700 వరకు మినీ బస్సులు, ఇతర రవాణా వాహనాలు తిరుగుతున్నాయి. గతంలో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఈ వాహనాలన్నీ జీపీఎస్ పరిధిలోకి రావాలి. ఇంతవరకు ఒక్క అడుగూ ముందుకు పడలేదు. నిధుల సమస్య కారణంగా ప్రాజెక్టు అటకెక్కినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జీపీఎస్ పరికరాల్ని సంబంధిత వాహనదారులే సమకూర్చుకోవాలి. క్యాబ్‌లు, బస్సుల వరకు పెద్దగా ఇబ్బందులు లేకపోయినప్పటికీ ఆటోల విషయంలో ఈ విధానం అమలు చేయాలంటే భారంతో కూడుకున్న వ్యవహారం. ఒక్కో వాహనానికి జీపీఎస్ పరికరాలు సమకూర్చుకోవాలంటే రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు ఖర్చవుతుంది. ఆటో వాలాలు ఈ ఖర్చు భరించే పరిస్థితి లేదు. ఉత్తర్వుల తర్వాత అధికారులు పట్టించుకోవడం మానేశారు. పరిస్థితి యథాస్థితికి వచ్చిందని ప్రయాణికులు వాపోతున్నారు.

అడ్డు తొలగించింది..

ప్రియుడితో కలిసి భర్తను చంపిన మహిళ



హత్యకు గురైన సలీం (పాత చిత్రం)

పహాడీషరీఫ్, న్యూస్‌టుడే: తన భర్త తప్ప తాగి మృతి చెందాడని ఓ మహిళ అందరినీ నమ్మించింది. అంత్యక్రియలు చేస్తుండగా పోలీసులు అడ్డుకొని విచారించగా.. ప్రియుడితో కలిసి భార్యే భర్తను హత్య చేసినట్లు తేలింది. పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి కథనం ప్రకారం... ఈనెల 16న పహాడీషరీఫ్‌లో ఉండే మొహ్మద్ సలీం(35) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తీవ్రంగా తాగడం వల్లే చనిపోయాడని అతని భార్య షాహీన్ బేగం అందరినీ నమ్మించింది. చాంద్రాయణగుట్టలోని శ్మశానవాటికలో అంతక్రియలు జరిపేందుకు మృతదేహాన్ని తీసుకెళ్లారు. విషయం తెలియడంతో పహాడీషరీఫ్ పోలీసులు అంతక్రియలను అడ్డుకున్నారు. మృతదేహాన్ని పీఎమ్‌వీకి తరలించి మృతుని భార్య షాహీన్‌ను విచారించారు. తాడ్‌బన్ ప్రాంతానికి చెందిన సలీం.. రెండేళ్లక్రితం పహాడీషరీఫ్ వచ్చి ఉంటున్నాడు. కాగా షాహీన్‌కు యూసుఫ్ అనే యువకుడితో వివాహేతర సంబంధం ఉంది. తమకు సలీం అడ్డువస్తున్నాడని, అతన్ని అంతం చేయాలని షాహీన్ పథకం వేసింది. వృత్తిరిత్యా లారీడ్రైవరైన సలీం ఈనెల16న రాత్రి ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే ఇంట్లో షాహీన్‌తో యూసుఫ్ ఉండడంతో భార్యను నిలదీశాడు. యూసుఫ్‌తో గొడవపడ్డాడు. ఇదే అదనుగా భావించిన షాహీన్ ప్రియుడు యూసుఫ్‌తో కలిసి సలీంపై దాడి చేసి గొంతు నులిమి చంపేశారు. తీవ్రంగా తాగడం వల్లే తన భర్త చనిపోయాడని షాహీన్ అందరినీ నమ్మించింది. ఎట్టకేలకు పోలీసులు రంగంలోకి దిగడంతో గుట్టురట్టయ్యింది. నిందితులు షాహీన్, యూసుఫ్‌లను సోమవారం రిమాండ్‌కు తరలిస్తామని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

కోర్టు వాయిదాకొచ్చి యువతిపై అత్యాచారం

మేడిపల్లి(బోడుప్పల్), న్యూస్‌టుడే: ప్రేమ పేరుతో యువతిపై అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై మేడ్చల్ జిల్లా మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బోడుప్పల్ హేమానగర్‌కు చెందిన యువతి(30), కామారెడ్డి జిల్లాకు చెందిన ఇర్ఫాన్(35) నగరంలోని జెన్‌ప్యాక్ట్‌లో సహోద్యోగులు. కొంతకాలం ప్రేమ పేరుతో సన్నిహితంగా ఉన్నారు. ఈ క్రమంలో ఇద్దరు పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. యువతి ఇర్ఫాన్ వద్ద పెళ్లి ప్రస్తావన తీసుకురాగా అతను ముఖం చాటేయడంతోపాటు కామారెడ్డికి మకాం మార్చాడు. మోసపోయినట్లు నిర్ధారించుకొని బాధిత యువతి అప్పట్లో ఉప్పల్ పోలీసులను ఆశ్రయించింది. 2016లో ఉప్పల్ పోలీసు స్టేషన్‌లోనూ ఇర్ఫాన్‌పై కేసు నమోదై కోర్టు వాయిదాలు నడుస్తున్నాయి. శనివారం కోర్టు వాయిదాకు వచ్చిన ఇర్ఫాన్ బాధిత యువతితో మాట్లాడలంటూ నేరుగా హేమానగర్‌లోని ఆమె ఇంటికి వెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఇర్ఫాన్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్ రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

శంకర్‌పల్లి, న్యూస్‌టుడే: ఎర్రగడ్డ మార్కెట్‌కు కూరగాయలను తరలిస్తున్న బొలెరో వాహనాన్ని ఎదురుగా వచ్చిన ఇసుక లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. శంకర్‌పల్లి నుంచి పటాన్‌చెరువు వెళ్లే మార్గంలో బీడీఎల్ చౌరస్తా సమీపంలో శనివారం రాత్రి జరిగింది. శంకర్‌పల్లి ఎస్సై క్రాంతికుమార్ కథనం ప్రకారం.. నవాబ్‌పేట్ మండలం చించల్‌పేట్ గ్రామానికి చెందిన ఐదు మంది రైతులు కూరగాయలను తీసుకొని బొలెరో వాహనంలో నగరంలోని ఎర్రగడ్డకు వెళ్తుండగా బీడీఎల్ చౌరస్తా సమీపంలో ఎదురుగా వచ్చిన ఇసుక లారీ బొలెరో వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బొలెరోలోని రాజు(28)తో పాటు మరొకరికి గాయాలు అయ్యాయి. రాజు తలకు బలమైన గాయాలవడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. వెంటనే 108లో సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనతో వెంటనే మెరుగైన చికిత్స కోసం రాజును ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని బంధువుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అలా వెళ్లగానే ఇలా దొంగతనం

అల్వాల్, న్యూస్‌టుడే: ఇంటికి తాళం వేసి వెళ్లిన గంటన్నరలోనే దొంగలు పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అల్వాల్ పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. ఓల్డ్‌అల్వాల్‌లోని భూపతిరావునగర్ కాలనీలో నివసించే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కృష్ణ, భార్య, అత్తమ్మతో కలిసి ఉంటున్నాడు. భార్యకు పురిటినొప్పులు రావడంతో శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి ఆసుపత్రికి తీసుకెళ్లారు. సాయంత్రం 5:30 గంటల సమయంలో ఇంటికి రాగా ప్రధాన ద్వారం తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలో దాచిన 18 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదును దొంగలు ఎత్తుకెళ్లారని గమనించిన కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిటిజన్ కాలనీలోని బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి ఇంట్లో దొంగతనానికి పాల్పడిన ముఠానే ఈ చోరీ చేసి ఉండవచ్చని అనుమానులు ఉన్నాయి. ఈ రెండు ఘటనలు కొన్ని గంటల వ్యవధిలో జరుగడం గమనార్హం. ఇటీవలి కాలంలో ఆయా కాలనీలు, పరిసరాల కాలనీలో దొంగతనాలు వరుసగా జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు.

పడిపోతే ప్రమాదమే



షెడ్డు నిర్మాణం కోసం తడికలను ఓ ఆటోలో కూకట్‌పల్లి జాతీయ రహదారి మీదుగా తరలిస్తున్నారు. అవి అదుపు తప్పి పడిపోతే వెనుక నుంచి వచ్చే వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది.

ఎల్ఈడీ కాంతి ఊపందుకుంది

ఇప్పటికి 75 వేల దీపాలు ఏర్పాటు

హైదరాబాద్, న్యూస్‌టుడే: విద్యుత్తును పొదుపు చేసేందుకు జీహెచ్ఎంసీ చేపట్టిన ఎల్ఈడీ దీపాలను అమర్చే పనులు ఊపందుకున్నాయి. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఎనర్జీ ఎఫిసియెన్సీ ఈ నిర్వహణను చేపట్టి ప్రస్తుతం 75,621వేల దీపాలను ఏర్పాటు చేశారు. మిగత దీపాల పనులు కూడా ఊపందుకున్నాయని జీహెచ్ఎంసీ పేర్కొంది. ప్రస్తుతం ఏర్పాటు చేసిన దీపాలతో రోజుకు 5,164 కిలోవాట్ల విద్యుత్ ఆదా అవుతుందని, నగరవ్యాప్తంగా 4లక్షల60వేల ఎల్ఈడీ దీపాలతో ఏడాదికి 20.73 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుందని బల్దియా పేర్కొంది.

29 నుంచి సెల్ట్‌లో తరగతులు

ఓయూ: ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్)లో తరగతులను ఈ నెల 29వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు సెల్ట్ సంచాలకులు డా.సావిత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్లంలో సరళంగా సంభాషణ, వ్యక్తిత్వ వికాసంలో రెండు నెలల కాల వ్యవధి గల ఈ కోర్సుకు ఉదయం, సాయంత్రం వేర్వేరుగా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9652856107 ఫోన్లో సంప్రదించవచ్చని సూచించారు.

తాళంవేసిన ఇంట్లో బంగారం, వెండి చోరీ

నాగోలు, న్యూస్‌టుడే: తాళంవేసిన ఇంట్లో నగలు దోచుకెళ్లిన సంఘటన ఎల్బీనగర్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బండ్లగూడ సమీపంలోని మధురానగర్‌లో నివసించే సాయిలు(45), ఆయన తన కుటుంబంతో కలిసి ఈ నెల 18న శిరిడీ పుణ్యక్షేత్రానికి వెళ్లి తిరిగి ఆదివారం ఉదయం ఇంటికి చేరుకున్నారు. ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి ఉండటంతో లోనికి వెళ్లిచూడగా 3తులాల బంగారం, 30తులాల వెండి చోరికి గురవడాన్ని గమనించి.. ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.